

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



: fb.com/vaartha Digital
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

8-7-2026
బుధవారం
సంపుటి: 32
సంచిక: 158
పేజీలు: 10+4
వెల: 6.50

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

హైదరాబాద్




మంగళవారం జకార్తాలో ప్రధాని మోడీకి బిన్‌టాంగ్ ఆదిపూర్ణ పురస్కారం అందజేస్తున్న ఇండొనేసియా అధ్యక్షుడు సుబియాంటో



ముంబయిలో వరదల్లో జనం

కేరళ నుంచి కాశ్మీర్ దాకా

## పలు రాష్ట్రాల్లో వర్ష బీభత్సం

5



మంగళవారం కేరళంలోని వయనాడ్‌లో క్లౌడ్‌బరస్ట్ దృశ్యం

కేరళంలో కొండచరియలు విరిగిపడి ఐదుగురు మృతి

జమ్ముకాశ్మీర్‌లోని కిస్త్‌వార్ జిల్లాలో వరదలతో అతలాకుతలం

మూడురోజులుగా మహారాష్ట్రలో జనజీవనం అస్తవ్యస్తం

ఇండొనేసియాకు

## 'బ్రహ్మోస్త్రం'

బ్రహ్మోస్, అస్త్ర క్షిపణుల సరఫరాకు భారత్ ఓకే

19 కీలక ఒప్పందాలపై సంతకాలు

రక్షణ రంగంలో మరింత సహకారం

అధ్యక్షుడు సుబియాంటోతో మోడీ చర్చలు

**జకార్తా,జులై 7:** భారత్, ఇండోనేషియా తమ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సరికొత్త శిఖరాలకు చేర్చాయి. రక్షణ, వాణిజ్యం, సాంకేతికత, ఆరోగ్యం, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని విస్తృతం చేసే లక్ష్యంతో ఇరు దేశాలు 19 కీలక ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ చారిత్రక పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీకి ఇండోనేషియా తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన బింటాంగ్ ఆదిపుర్ణ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియాను ప్రదానం చేసి అరుదైన గౌరవాన్ని అందించింది. జకార్తా పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ ఒప్పందాలు కుదిరాయి. రక్షణ రంగంలో సహకారం ఈ ఒప్పందాల్లో ప్రధానంగా నిలిచింది. సముద్ర భద్రత, భద్రతా సహకారంపై ఉన్న అవగాహన ఒప్పందాన్ని ఇరు దేశాలు పొడిగించాయి. దీనికితోడు,

>>2



అహ్మదాబాద్ పేలుళ్ల కేసు:

## 38 మందికి ఉరి ఖరారు

11మందికి జీవిత ఖైదు

ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన గుజరాత్ హైకోర్టు

**అహ్మదాబాద్, జులై 7:** అహ్మదాబాద్‌లో 2008నాటి వరుస బాంబు పేలుళ్ల కేసులో 38 మంది దోషులకు విధించిన మరణశిక్ష గుజరాత్ హైకోర్టు సమర్థించింది. మరో 11మందికి విధించిన జీవిత ఖైదును కూడా యథాతథంగా కొనసాగిస్తూ కీలక తీర్పు వెలువరించింది. ఉగ్రదాడిలో మరణించిన బాధితుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. 2022లో ప్రత్యేకట్రయల్ కోర్టు విధించిన మరణశిక్షలను

>>2

భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నరసింహారెడ్డి కన్నుమూత

3

కెసిఆర్, కెటిఆర్, హరీష్

# ఆర్థిక ఉగ్రవాదులు

కాళేశ్వరం రీ డిజైన్ పేరుతో నిధులు కొల్లగొట్టేందుకు ప్లాన్

అసెంబ్లీకి వస్తే అన్నీ చర్చిద్దాం..

నిపుణులు, అడ్వొకేట్ జనరల్‌ను పిలిచి జాయింట్‌సెషన్ నిర్వహిద్దాం

మూడేళ్లు ప్రాజెక్టు రిపేర్లు మీకు అప్పగిస్తాం

పిపిపిలో నిప్పులు చెరిగిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై7:** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను మంగళవారం సాయంత్రం ప్రజాభవన్ వేదికగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రేవంత్ రెడ్డి వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైన్ పేరుతో కెసిఆర్ ఆలోచనలు మారాయని, ఊరు,పేరు,అంచనాలు మార్చి నిధులు కొల్లగొట్టడానికి ఆయన పెద్ద ప్లాన్ వేశారని ఆరోపించారు. కెసిఆర్ ఆర్థిక ఉగ్రవాద కుటుంబం, కెసిఆర్,కెటిఆర్,హారీశ్‌రావు ఆర్థిక ఉగ్రవాదులు అని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం అంశంపై కెసిఆర్ లేఖ రాస్తే శాసనసభలో చర్చిద్దాం, కాళేశ్వరాన్ని వారం రోజులు కాదు మూడేళ్లు కెసిఆర్‌కే అప్పగిస్తాం, ఎల్ అండ్ టీ,కాంట్రాక్టర్లను తీసేసి మేజర్ కాంట్రాక్టర్‌గా కెసిఆర్‌కే అప్పగిస్తాం అని పేర్కొన్నారు.

>>2



మంగళవారం సమీక్షలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

## ఇక డిజిటల్ గవర్నెన్స్

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకూ 1నే జీతాలు: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై7:** పరిపాలనలో మరింత పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం

>>2

ప్రధాని మోడీకి ఇండొనేసియా

## అత్యున్నత పురస్కారం

బిన్‌టాంగ్ ఆదిపూర్ణ పురస్కారం అందించిన అధ్యక్షుడు సుబియాంటో

**జకార్తా,జులై 7:** ప్రధాని మోదీకి అరుదైన గౌరవం దక్కింది. ఇండొనేషియా ప్రభుత్వం ఆయన్ను అత్యున్నత పురస్కారంతో సత్కరించింది. 'బిన్‌టాంగ్ ఆదిపూర్ణ రిపబ్లిక్ ఆఫ్ ఇండొనేసియా' అవార్డుతో మోడీని సన్మానించారు. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఆ మెడల్‌ను అందజేశారు. ప్రస్తుతం మోదీ ఇండోనేషియా పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. ఎంతో ప్రేమతో ఇండోనేషియాకు తనకు

>>2

# కొండా X కడియం



రచ్చకెక్కిన విభేదాలు

కొండా సురేఖను కాదని దేవాదాయ శాఖలో కడియం సమీక్ష

క్రమశిక్షణ కమిటీ జోక్యం చేసుకోవాలంటూ ఎఐసిసి పెద్దలు, సిఎంకు కొండా సురేఖ ఫిర్యాదు

కాంగ్రెస్‌లో మరో వివాదం

**హైదరాబాద్, జులై 7,ప్రభాతవార్త:** వరంగల్ జిల్లా వ్యవహారాలలో కడియం శ్రీహరి కల్పించుకొని బిజినెస్ రూల్స్ ఉల్లంఘిస్తూ అధికారులతో సమీక్ష చేస్తూ సమాంతరపాలనతో పరిపాలనలో ప్రతిష్టంభన కలిగిస్తున్నారని ఎఐసిసి పెద్దలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కొండా సురేఖ ఫిర్యాదు చేయడంతో మరోసారి కాంగ్రెస్‌లో విభేదాలు రచ్చకెక్కాయి. దేవాదాయ,ధర్మాదాయ శాఖ మంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న నాకు సమాచారం ఇవ్వకుండా అధికారిక సమీక్ష చేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేసింది. రాజ్యాంగబద్ధంగా నాకు అప్పగించిన బాధ్యతల పరిధిలో పరిపాలన విధాన నిర్ణయాలు సమీక్షలు, అభివృద్ధి కార్యక్రమాలపర్యవేక్షణ అధికారయంత్రంగానికి మార్గనిర్దేశం చేయడం వంటి అంశాలు రూల్ ఆఫ్ బిజినెస్ ప్రకారం చేస్తారనే విషయం ప్రజాజీవితంలో కనీసం అనుభవం కలిగిన ప్రతి ప్రజాప్రతినిధికి తెలిసి ఉంటుందని ఆవేదనను ఆమెలేఖలో తెలిపింది. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తన ఫిర్యాదు లేఖలో, దేవాదాయ, ధర్మాదాయ శాఖకు సంబంధించిన పరిపాలన, విధాన నిర్ణయాలు, అధికారిక సమీక్షలు, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ తదితర అంశాలు సంబంధిత శాఖా మంత్రి పరిధిలోకి వస్తాయని స్పష్టం చేశారు. అయినప్పటికీ, శాఖా మంత్రికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదాయ శాఖ డైరక్టర్‌తో పాటు శాఖ అధికారులను సమావేశపరచి పలు దేవాలయాల అభివృద్ధి, నిధుల కేటాయింపులు, మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, దేవాలయ భూముల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, అధికారులకు గడువులు నిర్దేశించడం వంటి అంశాలపై అధికారిక సమీక్ష నిర్వహించడం పరిపాలనా పరంగా అభ్యంతరకరమని అన్నారు. రూల్ ఆఫ్ బిజినెస్ స్ఫూర్తిని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. శాఖా పరిపాలనకు సంబంధించిన విధానపరమైన నిర్ణయాలు సంబంధిత శాఖా మంత్రి ఆధ్వర్యంలోనే జరగాల్సి ఉంటుందనే విషయం ప్రజా జీవితంలో అనుభవజ్ఞులైన ప్రతి ప్రజాప్రతినిధికి విదితమేనని, అలాంటి పరిస్థితుల్లో శాఖా మంత్రిని పూర్తిగా పక్కనపెట్టి అధికారిక సమీక్ష నిర్వహించడం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి దారితీస్తుందని మంత్రి తన లేఖలో స్పష్టం చేశారు.ఒకనియోజకవర్గ స్థాయి ఎమ్మెల్యే ఉమ్మడి వరంగల్‌కు సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఏవిధంగా ఆదేశిస్తారని ఆమె లేఖలో పేర్కొన్నారు. జిల్లా వ్యవహారాల్లో శ్రీహరి జోక్యం చేసుకుంటున్నారంటూ

>>2



సింగరేణికి మరో రెండు

## కీలక బొగ్గు బ్లాక్‌లు

నైనీతో పాటు తాడిచెర్ల కేటాయింపు

ఇతర రాష్ట్రాల్లోని బొగ్గు వేలం పాటల్లో పాల్గొనేందుకు కృషి

దేశాభివృద్ధిలో సహకార సమాఖ్య విధానం: కేంద్ర గనుల మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త:** సింగరేణికి మరో రెండు కీలక బొగ్గు బ్లాక్‌లు దక్కనున్నాయి. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌తో పాటు, తాడిచెర్ల2 కోల్ బ్లాక్‌ను కూడా సింగరేణికి కేటాయిస్తున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఈ నిర్ణయం సంస్థ భవిష్యత్తుకు పెద్ద ఊరటనిస్తుందని చెప్పారు. ఢిల్లీలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సింగరేణికి అనేక సహాయ సహకారాలు అందజేస్తోందన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు వేలం పాటలో పాల్గొనేందుకు తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ సింగరేణికి వచ్చేలా చొరవ తీసుకున్నామని అన్నారు. నైనీ కోల్ బ్లాక్‌లో సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్లు ఉన్నాయన్నారు. మరో 35 ఏళ్లకు సరిపడే బొగ్గు నిల్వలు నైనీలో ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో సిగరేణికి రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉందన్నారు. తాడిచెర్ల2 కోల్ బ్లాక్ సింగరేణికే ఇస్తున్నామని అందుకు ప్రధాని కూడా అంగీకరించారని తెలిపారు. తాడిచెర్ల2లో 182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశముందన్నారు. మరో 40నుంచి 50ఏళ్లపాటు బొగ్గుఉత్పత్తి చేయవచ్చని స్పష్టం చేశారు. ఈ బ్లాక్ ద్వారా ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుందన్నారు. దీని ద్వారా మొత్తంగా రూ.64,000 కోట్లకు పైగా రెవెన్యూ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నేరుగా సింగరేణికి ఈ గని ఇవ్వడం ద్వారా ఆక్షన్ ప్రీమియం చెల్లింపు లేని కారణంగా ఆ సంస్థకు కనీసం రూ.2,550 కోట్లు మిగులుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి రాయల్టీ సహా వివిధ మార్గాల్లో దాదాపు రూ.16 వేల కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని వెల్లడించారు. ఇది సింగరేణికి ఎంతో ఉపయోగకరంగా మారబోతోందని ప్రకటించారు తెలంగాణలో లక్షలాది కుటుంబాల జీవనాధారం సింగరేణి అని పేర్కొన్నారు. దేశాభివృద్ధి విషయంలో సహకార సమాఖ్య విధానంతో అన్ని రాష్ట్రాలు కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ సింగరేణ కాలరీస్ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. 39 వర్కింగ్ మైన్స్‌లో 21 అండర్ గ్రౌండ్ మైన్స్, 18 ఓపెన్ కాస్ట్ మైన్స్ ఉన్నాయని, సుమారు 6 నుంచి 8 జిల్లాల్లో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయని అన్నారు. లక్షలాది ప్రజల గుండెచప్పుడు సింగరేణి అని వెల్లడించారు. సింగరేణికి సంబంధించిన మేజర్‌మైనింగ్ ప్రాజెక్టుల ఎన్విరాన్మెంటల్, ఫారెస్ట్ క్లియరెన్స్‌లను వేగవంతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం

>>2

## భారీ వర్ష సూచన

50 నుండి 60 కి.మీ వేగంతో ఈదురు గాలులు

**హైదరాబాద్, జులై 7 ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం, రుతుపవనాల ప్రభావంతో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రాగల రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ముఖ్యంగా ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్,నిజామాబాద్, జగిత్యాల, మెదక్ పరిసర

>>2





## ఫ్రాన్స్ అధ్యక్షుడికి తప్పిన ప్రమాదం

డమాస్కస్‌లోని హోటల్ వద్ద భారీ పేలుడు

18 మందికి తీవ్ర గాయాలు

**డమాస్కస్, జులై 7:** సిరియా రాజధాని డమాస్కస్‌లో వరుస పేలుళ్లు తీవ్ర కలకలం రేపాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఆ దేశ పర్యటనలో ఉండగా.. ఆయన బస చేసిన హోటల్ వద్దే ఈ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. అయితే, ఈ ఘటనలో ఆయన క్షేమంగా బయటపడి నట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్-షరాతో సమావేశమయ్యేందుకు అధ్యక్ష భవనంలోకి మెక్రాన్ వెళ్లిన వెంటనే సమీపంలోని ఫోర్ సీజన్స్

>>2

ధరణి పోర్టల్‌పై

## సిట్!

అక్రమాల మూలాలు తేల్చేందుకు సర్కార్ కసరత్తు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై7:** ధరణి పోర్టల్‌లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. భూ రికార్డులు, రిజిస్ట్రేషన్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం విజిలెన్స్ విభాగం ద్వారా లేదా ప్రత్యేక

>>2



## డెడ్‌స్టోరేజ్‌కు జూరాల

5.790 టిఎంసిలకు చేరిన నీటిమట్టం

గతేడాది ఇదే రోజు 7.389 టిఎంసిలు

**మహబూబ్ నగర్ బ్యూరో, జులై 7, ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు జిల్లా వరప్రదాయినిగా పేరుగాంచిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వెలవెల బోతున్నది. పైనుంచి వరద జలాలు రాకపోవడంతో అడుగంటి వెక్కిరిస్తున్నది. గతేడాది మే 29న వరద జలాలు ప్రారంభం కావడంతో కళకళలాడిన జలాశయం నేడు బోసిపోయి దర్శనమిస్తున్నది. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వనపర్తి గద్వాల

>>2



మంగళవారం కేరళంలోని వయనాడ్‌లో క్లౌడ్‌బరస్ట్ దృశ్యం

## మరో రెండు కీలక బొగ్గు బ్లాక్‌లు

>> అందిస్తోందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోనూ సింగరేణి కార్మికులు భాగస్వాములయ్యారని తెలిపారు. కార్మికుల ధైర్యాన్ని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. సింగరేణి పురోగతికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణతో పాటు, ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు గనుల వేలంలో పాల్గొనేలా సింగరేణి ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు.

## కొండా X కడియం

>> మంత్రి సురేఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి దేవాదాయ అధికారులతో సమావేశంకు సంబంధించి ఎమ్మెల్యే కార్యాలయం విడుదల చేసిన అధికారిక ప్రెస్ నోట్లో కూడా మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, ప్రత్యేక అధికారుల బృందం ఏర్పాటు, అభివృద్ధి పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయడం, దేవాలయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవడం, జిల్లా కలెక్టర్ ద్వారా సర్వే నిర్వహించడం, నెల రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించడం వంటి అంశాలున్నాయనీ ఇవి బిజినెస్ రూల్ ప్రకారం చేయవచ్చా అని ఆమె ముఖ్యమంత్రికి, ఏఐసిసికి పంపిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇవన్నీ శాఖా పరిపాలనా పరిధిలో మంత్రి స్థాయిలో నిర్ణయించాల్సిన అంశాలు. ఇటువంటి విషయాల్లో శాఖా మంత్రిని పూర్తిగా విస్మరించి, సమావేశం నిర్వహించడం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి నాంది పలికే చర్యగా నేను భావిస్తున్నాను. ఇది ఒక సాధారణ పరిపాలనా లోపంగా కాకుండా, శాఖా మంత్రి అధికారాలను బహిరంగంగా ప్రశ్నించే ప్రయత్నంగా కనిపిస్తున్నది. గతంలో కూడా నా రాజకీయ, వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశంతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులను రెచ్చగొట్టి నాపై దుష్ప్రచారం జరిగేలా ప్రయత్నాలు చేసిన సందర్భాలు మీకూ తెలిసిందే. అయినప్పటికీ పార్టీ రాష్ట్ర నాయకత్వం, అధిష్టానం నా నిబద్ధత, నిజాయితీ, పార్టీ పట్ల విధేయతపై సంపూర్ణ విశ్వాసం కలిగి వుండటం వల్ల వారి కుటిల ప్రయత్నాలు విఫలమయ్యాయి. ప్రస్తుతం మరోమారు దేవాదాయ శాఖా మంత్రిగా నా అధికార పరిధిని బలహీనపరిచే విధంగా, ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనవసర జోక్యం చేసుకునే చర్యలు ప్రోత్సహించే విధంగా కడియం శ్రీహరిప్రవర్తించారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వ పరిపాలనా సమన్వయాన్ని దెబ్బతీయడమే కాకుండా, అధికార యంత్రాంగంలో కూడా అయోమయ పరిస్థితులను సృష్టించే అవకాశం ఉంది. ప్రజాస్వామ్య పాలనలో ప్రతి ప్రజాప్రతినిధికి తన పరిధి ఉన్నప్పటికీ, శాఖా పరిపాలనకు సంబంధించిన నిర్ణయాలు సంబంధిత శాఖా మంత్రి ద్వారా మాత్రమే జరగాల్సి ఉంటుందనే విషయం అనుభవజ్ఞులైన కడియం శ్రీహరికి తెలియనిది కాదని నేను విశ్వసిస్తున్నాను. అయినప్పటికీ, అందుకు విరుద్ధంగా ఆయన వ్యవహరించడం నన్ను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసారని స్పష్టం చేస్తున్నది. కావున ఈ వ్యవహారంపై పార్టీ స్థాయిలో, ప్రభుత్వ స్థాయిలో సమగ్రంగా పరిశీలించి, శాఖా మంత్రికి సమాచారం ఇవ్వకుండా అధికారిక సమీక్ష నిర్వహించిన అంశంపై వివరణ కోరాలని, ప్రభుత్వ పరిపాలన విధానాలు, శాఖా మంత్రుల రాజ్యాంగబద్ధ అధికారాలను గౌరవించే విధంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరికి స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరుతున్నాను. ఈ వ్యవహారం పార్టీ క్రమశిక్షణతో పాటు ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థ విశ్వసనీయతకు సంబంధించిన అంశం కావున, ఈ ఘటనపై పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వినయపూర్వకంగా కోరుతున్నాను. మూడు పేజిల లేఖతోపాటు ఫిర్యాదుకు సంబంధించి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ దేవాలయాల అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి సంబంధించిన ప్రెస్ నోట్ ప్రతిని, ఫోటోలను, దినపత్రిక కవరేజ్ క్లిప్పింగ్ ను జతపరిచారు.

## బాలామృతం కొత్త ప్లాంట్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై7:** ఈనాటి పిల్లలకు సరైన పౌష్టికాహారం, నాణ్యమైన విద్యను అందించే విషయంలో ప్రజా ప్రభుత్వం స్పష్టమైన బాధ్యతతో పలు కార్యక్రమాలు ప్రారంభించిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. పిల్లలకు సరైన పౌష్టికాహారం, నాణ్యమైన విద్యను అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన తెలంగాణ, ప్రయోజకులైన దేశ పౌరులుగా ఎదుగుతారని అన్నారు. మంగళవారం నాచారం ఐడీఏ ప్రాంతంలో తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బాలామృతం కొత్త ప్లాంటును ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం బాలామృతం ఉత్పత్తి, ప్యాకింగ్ ప్రాసెస్ యూనిట్‌ను పరిశీలించారు. పరిసరాల్లో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో మంత్రి ధనసరి అనసూయ సీతక్కతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పిల్లల భవిష్యత్తు, వారికి నాణ్యమైన విద్యను అందించడానికి ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఆడబిడ్డలను ఆర్థికంగా నిలబెట్టడమే కాకుండా వారికి పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరంగా ఉండాలి. పిల్లలు ఆరోగ్యకరంగా ఉన్నప్పుడే తల్లిదండ్రుల్లో ఆనందం ఉంటుంది. తల్లి గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు ఆరు సంవత్సరాల వరకు బలవర్ధకమైన పోషకాహారం పేద పిల్లలకు ఇవ్వాలనే ఈ నూతన బాలామృతం ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించామని చెప్పారు. పిల్లలు నూరేళ్ల ఆరోగ్యంగా ఉండాలంటే, ఇలాంటి సంస్థలు రావాలి. ప్రభుత్వం వైపు నుండి అన్ని విధాల సహకారం అందిస్తాం. పిల్లల భవిష్యత్తే, తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు. పేద పిల్లల ఆరోగ్యం, చదువు పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. పిల్లలకు నాణ్యమైన భోజనమే కాకుండా నాణ్యమైన విద్యను అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దు అని స్పష్టంగా చెప్పారు. గతంలో ప్రధానమంత్రి ఇందిరాగాంధీ మహబూబ్‌నగర్‌లో ఈ కేంద్రాన్ని ప్రారంభించగా, అంచెలంచెలుగా ఇక్కడ 21 ఎకరాల్లో పెద్ద పరిశ్రమగా విస్తరించిందని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు మరో నాలుగైదు రాష్ట్రాలకు పౌష్టికాహారం అందించే సామర్థ్యం సాధించిందన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్ కేజీ, యూకేజీ విధానం లేదు. పట్టణాల్లో వలస వచ్చిన వారి పిల్లలు చదువుకోవాలంటే, ప్రైవేటు స్కూళ్లకు పంపిస్తున్నారు. పేదలు తాము సంపాదించిందంతా పిల్లల చదువు కోసం ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి, పేదల కష్టాన్ని గుర్తించి ప్రభుత్వ బడుల్లో నర్సరీ నుండి 12వ తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్, లంచ్, సాయంత్రం స్నాక్స్ అందించే కార్యక్రమం ప్రారంభించామని చెప్పారు. విద్య రంగంపై ప్రతి ఏటా రూ. 27 వేలకోట్లు ఖర్చు చేస్తున్నామని, ఈ ఖర్చును ఖర్చుగా భావించడం లేదని భవిష్యత్తును తీర్చిదిద్దే పెట్టుబడిగా భావిస్తున్నామని చెప్పారు.

## ధరణి పోర్టల్‌పై సిట్!

>> దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి విచారణ జరిపించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే వెలుగులోకి వస్తున్న అక్రమాలపై ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. భూమి యజమాని వేలిముద్ర, ఓటీపీ ధ్రువీకరణ లేకుండానే రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది. భద్రతా వ్యవస్థలను బైపాస్ చేస్తూ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లను వినియోగించి లావాదేవీలు నిర్వహించినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది. అంతేకాకుండా విదేశాల్లో ఉన్న భూ యజమానులకు తెలియకుండానే వారి పేర్లలో మార్పులు చేసిన ఘటనలు కూడా వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణకు ఆదేశించనున్నట్లు తెలుస్తోంది. ధరణి పోర్టల్‌లో జరిగిన సుమారు 8 లక్షల లావాదేవీలకు సంబంధించిన ఆడిట్ ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ పరిశీలనలో దాదాపు 22 వేల రిజిస్ట్రేషన్లలో తేడాలు ఉన్నట్లు సమాచారం.

అలాగే 'ఘోస్ట్ ఐడీలు' ఉపయోగించి లక్షల ఎకరాల భూ రికార్డులను మార్చినట్లు ఆరోపణలు రావడం మరింత సంచలనంగా మారింది. కొందరు సిస్టమ్‌లోని టైమ్ క్లాక్‌ను మార్చి పాత తేదీలతో రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలుస్తోంది. కేరళకు చెందిన సైబర్ సెక్యూరిటీ ఆడిట్ సంస్థ నిర్వహించిన పరిశీలనలో ఈ అంశాలు బయటపడినట్లు సమాచారం. ఈ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకోవడం, భూ రికార్డుల భద్రతను మరింత బలోపేతం చేయడం, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ధరణి పోర్టల్‌కు సంబంధించిన ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయ, పరిపాలనా వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ప్రభుత్వం చేపట్టబోయే విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**రైతుల భూములపై భారీ కుట్ర: ప్రవీణ్ కుమార్**

తెలంగాణలో రైతులు, భూమి యజమానుల ఆస్తులపై భారీ కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆర్థికంగా, భూమి హక్కుల పరంగా దెబ్బతీస్తోందని విమర్శించారు. ఒకవైపు, కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లున్నా కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లు ఆన్ చేయకుండా రైతుల పొలాలకు నీరు అందకుండా చేస్తున్నారని... మరోవైపు, భూభారతి పోర్టల్ ద్వారా అక్రమ భూమి బదిలీలు జరుపుతున్నారని ఆరోపించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ పోర్టల్‌లో దాదాపు 22 వేల భూ బదిలీలు అక్రమంగా జరిగాయని, రైతులకు తెలియ కుండానే వారి భూములు ఇతరులకు మార్చేశారని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.

### వారం - వర్జ్యం

**08-07-2026, బుధవారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం**
**గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం,** పునర్వసు కార్తె
అష్టమి మ.12.37
రేవతి మ.3.55
వర్జ్యం : లేదు
దు. ఉ.11.46-మ.12.38
రాహుకాలం - మ.12.00-1.30

### వార్తాఫలం

**మేషం:** మాటల చాతుర్యంతో శత్రువులను సైతం మిత్రులుగా మార్చుకుంటారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**వృషభం:** దూరప్రాంతాల నుండి ముఖ్య సమాచారం తెలుసుకుంటారు. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

**మిథునం:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. కొత్తకార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఓర్పుతో ఎంతటి కార్యాన్నైనా సాధిస్తారు.

**కర్కాటకం:** కాలానుగుణంగా వచ్చే మార్పులకు అనుగుణంగా నడుచుకోవడానికి కొంత ఇబ్బంది పడతారు.

**సింహం:** ఇంటాబయటా మీ మాటే చెల్లుబాటు కాగలదు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. శుభవార్తలు వింటారు.

**కన్య :** స్థిరాస్తి వివాదాలు పరిష్కార మవుతాయి. వాహనాల విషయంలో జాగ్రత్తలు అవసరం. క్రీడారంగం యందు ఆసక్తి చూపుతారు.

**తుల :** గృహసంబంధమైన విషయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారనే భావన మీ వారిలో రానివ్వకుండా జాగ్రత్తలు వహించండి.

**వృశ్చికం:** ఉపయోగపడని వ్యక్తులనుకున్న వారే కార్య విజయాలను కారణం అవుతారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిని పొందుతారు.

**ధనుస్సు:**రాజకీయ రంగాలలోని వారికి కొంతవరకు అనుకూలంగా ఉంటుంది. చేతి వృత్తి పని వారికి అనుకూలంగా ఉంటుంది.

**మకరం:** పుకారులను నమ్మకండి. సంతాన విద్యా విషయాలలో కొంత అశాంతికి లోనవుతారు. గృహ యోగం కలదు.

**కుంభం:**పనులు నిదానంగా పూర్తి చేస్తారు. నూతన ఒప్పందాలు కుదురు తాయి. ఉద్యోగ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**మీనం:** ముఖ్యమైన పత్రాలను జత చేయవలసిన వాటిని మర్చి పోయే అవకాశం ఉంది. జాగ్రత్తలు పాటించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఆర్థిక ఉగ్రవాదులు

>> కెసిఆర్ వాదనలో బలం ఉంటే ఏ తప్పు చేయకపోతే సభకు రావాలి, కసీఆర్ కోరుకున్న రోజు అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి మేం సిద్ధం అని పేర్కొన్నారు. జాయింట్ సెషన్ పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టు పై కూలంకషంగా చర్చిద్దాం రండి స్పీకర్ కు లేఖ రాసి.. తేదీ ఖరారు చేయండి అని సూచించారు. ఎందుకు మీకు అప్పగించాలో చెబితే మూడేళ్ల ప్రాజెక్టు రిపేర్లు మీకే అప్పగిస్తాం..మీ గౌరవానికి భంగం కలగకుండా సభను సజావుగా సాగేలా చూసుకునే బాధ్యత మాది అని చెప్పారు. నిపుణులు,అడ్వకేట్ జనరల్‌ను సభకు పిలిచి జాయింట్ సెషన్ నిర్వహిద్దాం కాళేశ్వరం ప్రాజెక్టుపై కూలంకషంగా చర్చిద్దామన్నారు. 'ఆనాడు వైఎస్ హయాంలో 16 లక్షల 40 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేందుకు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును మొదలు పెట్టారు, కాకా వెంకటస్వామి విజ్ఞప్తి మేరకు ఈ ప్రాజెక్టుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్లగా పేరు పెట్టారు. 2012 మే నెలలో పృథ్వీరాజ్ చౌహాన్ తో 148 మీటర్ల ఎత్తులో నిర్మించుకోవాలనిఆనాటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ప్రాథమికంగా ఒప్పందం చేసుకున్నారు' అని చెప్పారు. గోదావరి జలాలను తరలించి తెలంగాణను సస్య శ్యామలం చేయాలని కాంగ్రెస్ మొదటి నుంచి ప్రయత్నించిందన్నారు. రూ.39 వేల కోట్ల అంచనాతో మొదలైన ఈ ప్రాజెక్టు తెలంగాణ ఏర్పడే నాటికి రూ.6150 కోట్లు ఖర్చు చేశారు. తెలంగాణ ఏర్పడిన తరువాత కేసీఆర్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం రూ. 5523 కోట్లు ఖర్చు చేసిందని.మొత్తం రూ.11,670 కోట్లు ఖర్చు చేశాక కేసీఆర్ ఆలోచనలు మారాయి అని చెప్పారు. ప్రాజెక్టు రీడిజైన్ కోసం అధ్యయనానికి 21-01-2015 న ఒక కమిటీ వేశారు, ఆ కమిటీ కేసీఆర్ ఆలోచన తప్పు అని చెప్పింది, మేడిగడ్డ దగ్గర బ్యారేజీ వద్దని నివేదిక ఇచ్చిందపి.ఆయనకి నచ్చినట్టు ఇవ్వలేదని ఆ నివేదికను కేసీఆర్ పక్కన పెట్టారు అని పేర్కొన్నారు. కెసిఆర్ తనకు కావాల్సిన రిపోర్ట్ ను వ్యాప్కోస్ సంస్థతో ఇప్పించుకున్నారు. కమిషన్ల కోసం ప్రాజెక్టు ఊరు మార్చి, పేరు మార్చి రూ.38 వేల కోట్ల నుంచి అంచనాలు రూ.81 వేల కోట్లకు పెంచారు అని చెప్పారు. నీళ్లు పెరగలేదు, ఆయకట్టు పెరగలేదు.. కానీ అంచనాలు మాత్రం పెరిగాయని అరోపించారు. ప్లానింగ్, డిజైన్, నిర్మాణం, ఆపరేషనల్ మెయింటెనెన్స్ నాణ్యతగా చేసి ఉంటే ఇవాళ ఇలాంటి పరిస్థితి రాకపోయేదన్నారు. తన మెదడును రంగరించి ప్రాజెక్టు డిజైన్ చేశానని కేసీఆర్ స్వయంగా చెప్పుకున్నారు. 2019 జూన్ 21 న కాళేశ్వరం ప్రారంభిస్తే ఏడాదిలోనే మేడిగడ్డ దెబ్బతిన్నదని ఇంజనీర్లు చెప్పారు, రిస్టోర్ చేయాలని ఆనాటి ఇంజనీర్ బీవీ రమణారెడ్డి 18-05-2020 న ప్రభుత్వానికి లేఖ ఇచ్చారని చెప్పారు. రిపేర్లు చేయకపోవడం వల్లే మేడిగడ్డ ప్రాజెక్టు కుప్పకూలే పరిస్థితికి వచ్చిందన్నారు. గోదావరి ఉధృతితో గోడ నాణ్యత లేకపోవడం వల్ల కన్నెపల్లి పంప్ హౌస్ 2022 లోనే మునిగిపోయింది, ఇది ఒక్క రోజులోనే వచ్చిన సమస్య కాదు.. కట్టిన ఏడాది నుంచే ఒక్కొక్కటిగా సమస్యలు బయటపడ్డాయన్నారు.మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కట్టిన చోట ఎలాంటి భూ పరీక్షలు చేయలేదు,ఇసుక మేడల్లా.. కేసీఆర్ ఇసుకపై బ్యారేజీలు కట్టారు అని పేర్కొన్నారు. 2023 అక్టోబర్‌లో ఆరు పిల్లర్లు కూలిపోయాయని, బ్యారేజీలు, డ్యామ్‌లు కడితే 25 శాతం చొప్పున నింపుతారని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. అయితే, కేసీఆర్ మాత్రం కట్టిన ఏడాదికే బ్యారేజీలను నింపేశారన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కింద ఆయకట్టే లేదని, మేడిగడ్డను చూపించి బంగాళాఖాతాన్ని తెచ్చినట్టు చేశారన్నారు. నీళ్లు నింపడం వల్ల బ్యారేజీలపై ఒత్తిడి ఎక్కువైందని, ఇసుక మీదనే బ్యారేజీలు కట్టడం వల్ల ప్రాజెక్టు కుంగిందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ వెన్నెముక లాంటిది, వెన్నెముక పనిచేయకపోతే ఎలా ఏమీ చేయలేరో.. కాళేశ్వరం కూడా అంతే అని పేర్కొన్నారు.

**కాళేశ్వరంపై చర్చకు రమ్మంటే మిడిమిడి జ్ఞానం ఉన్నవాళ్లను పంపిస్తున్నారు,**

ప్రాజక్టు కుప్ప కూలితే ఇంజనీర్ పై కేసు పెట్టింది బీఆరెస్ హయాంలోనే, వాళ్ల హయాంలోనే ఎన్‌డిఎస్‌ఏ ప్రాథమిక నివేదిక ఇచ్చింది, నాణ్యత లేకపోవడం, మెయింటెనెన్స్ లేకపోవడం, నిబంధనలు పాటించకపోవడం వల్లే బ్యారేజీ దెబ్బతిన్నదని ఎన్‌డిఎస్‌ఏ నివేదిక ఇచ్చిందన్నారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన ప్రాజెక్టును ఎలాగైనా నిలబెట్టాలని మేం ప్రయత్నిస్తున్నాం, ఇందుకు ఎక్స్ పర్ట్స్ ను తీసుకొచ్చి రీస్టోర్ చేసే ప్రయత్నం చేస్తున్నాం అని చెప్పారు. ఇంకొకాయన కేసీఆర్ ముందు చూపుతో ఈ ప్రాజెక్టు కట్టారని హరీష్ రావు అంటున్నారు కట్టిందే వరద జలాలు ఎత్తి పోసుకోవడానికే ఈ ప్రాజెక్టు, వర్షాలు లేకపోయినా నీళ్లు లేకపోయినా ఎత్తి పోసుకోవచ్చు అన్నట్లు హరీష్ రావు మాట్లాడుతున్నారు అని చెప్పారు. తొమ్మిదిన్నరేళ్లు మీకు అప్పగిస్తే రూ.8 లక్షల 21 వేల కోట్లు అప్పులు చేశారు, కాళేశ్వరం పేరుతో రూ. లక్ష 2 వేల కోట్లు ఖర్చు చేస్తే మీరు చేసిన నిర్వాకం ఏమిటి? ఇది మీరు చేసిన విధ్వంసం అని పేర్కొన్నారు. కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడొద్దు, కేసీఆర్ కట్టిన సెక్రటేరియట్, ప్రజా భవన్ వినియోగించడం లేదా? కల్యాణ లక్ష్మీ మ్మ, షాదీ ముబారక్, రైతు భరోసా కొనసాగించడం లేదా? అని ప్రశ్నించారు. నిజంగా ప్రజల కోసం వినియోగించే పరిస్థితి ఉంటే ఎందుకు ఉపయోగించం? మీరు చేసిన తప్పులకి ఉరి తీయాలని ప్రజలు కోరుకుంటున్నా నిబంధనలు అడ్డొస్తున్నాయని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలు కట్టిన పన్నులు గోదావరి పాలు కాకూడదు, మూడు బ్యారేజీలు ఉపయోగపడి ఉంటే, రాత్రింబవళ్లు ఉండి పూర్తి చేసేవాళ్లం, ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో అసహనంగా ఉన్నాం, నేరగాళ్లను శిక్షించలేకపోతున్నాం, ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకురాలేకపోతున్నామనే ఉందన్నారు. బాధ కాగా, ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, స్పీకర్, చైర్మన్, కార్పొరేషన్ ఛైర్మన్లు తదితరులు హాజరయ్యారు.



మంగళవారం జకార్తాలో ప్రధాని మోడీతో భేటీఅయిన ఇండొనేసియా అధ్యక్షుడు సుబియాంటో

## ఇండొనేసియాకు 'బ్రహ్మోస్త్రం'

>> ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థను అందించేందుకు ఒక రక్షణ కాంట్రాక్టుపై సంతకాలు జరిగాయి. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), ఇండోనేషియాకు చెందిన రిపబ్లికోర్ప్ మధ్య గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణుల సహకారంపైనా ఒక ఒప్పందం కుదిరింది. వాణిజ్య, ఆర్థిక రంగాల్లోనూ వ్యూహాత్మక భాగస్వామ్యానికి బలమైన పునాది పడింది. ఖనిజాలు, ఉక్కు సరఫరా వ్యవస్థలలో సహకారాన్ని మరింతగా పెంచుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్, ఇండోనేషియాకు చెందిన పీటీ క్రాకటౌ స్టీల్ మధ్య ఒక వ్యూహాత్మక జాయింట్ వెంచర్ ఏర్పాటు కానుంది. వీటితో పాటు విపత్తు నిర్వహణ, వ్యవసాయం, టెలికమ్యూనికేషన్స్, వైద్య ఉత్పత్తుల నియంత్రణ, ఎన్నికల నిర్వహణ వంటి అంశాలపై కూడా పలు అవగాహన ఒప్పందాలు జరిగాయి.

విద్యా, సాంస్కృతిక సంబంధాలను పెంపొందించే దిశగా ఐఐఎం బెంగుళూరు, పీటీ ఇంటెలిజెన్షియా గ్రహతామా మధ్య ఒక ఎంఓయూ కుదిరింది. ఇండోనేషియాలోని చారిత్రక ప్రంబనన్ ఆలయ సముదాయ పరిరక్షణ, పునరుద్ధరణ కోసం ఒక లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను కూడా మార్చుకున్నారు. ఈ పరిణామాలు ఇరు దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేశాయని భారత విదేశాంగశాఖ ప్రకటించింది.

## మోడీకి ఇండొనేసియా అత్యున్నత పురస్కారం

>> అత్యున్నత పురస్కారాన్ని అందజేసినట్లు పీఎంవో కార్యాలయం తన ట్వీట్‌లో తెలిపింది. ఈ గౌరవం కోట్లాది మంది భారతీయులకు చెందుతుందని మోడీ పేర్కొన్నారు. ఈ సత్కారం ఇండోనేషియా ప్రజల భావోద్వేగాలకు చెందుతుందని తెలిపారు. భారత్, ఇండోనేషియా మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలకు ఇది నిదర్శనమన్నారు. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసినట్లు మోడీపేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, శ్రేయస్సు కోసం పాటుపడే వ్యక్తులను ఇండోనేషియా సర్కారు బింటాంగ్ ఆదిపూర్ణ అవార్డుతో సత్కరిస్తుంది. జకార్తాలోని అధ్యక్ష భవనంలో జరిగిన ప్రత్యేకకార్యక్రమంలో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ప్రధాని మోడీకి బింటాంగ్ ఆదిపుర్ణ పురస్కారాన్ని స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రబోవో మాట్లాడుతూ ఇండోపసిఫిక్ ప్రాంతంలో స్థిరత్వాన్ని నెలకొల్పే శక్తిగా భారత్ పోషిస్తున్న కీలక పాత్రకు, ద్వైపాక్షిక సంబంధాలను మార్చడంలో ప్రధాని మోడీవ్యక్తిగత నాయకత్వానికి ఈ పురస్కారం ఒక గుర్తింపు. మా గణతంత్రం అందించే అత్యున్నత పురస్కారం ఇది. ఇండోనేషియా, భారత్ మధ్య ఉన్న చారిత్రక నాగరికతా బంధాలు, విడదీయరాని వ్యూహాత్మక విశ్వాసానికి ఇది నిదర్శనమని ప్రకటించారు.

## భారీ వర్ష సూచన

>> ప్రాంతాల్లో గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఈ అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తుఫాను వాతావరణం ఏర్పడే సూచనలు బలంగా కనిపిస్తున్నాయి. అంతేకాకుండా 50 నుండి 60 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ఈ నెల 10 వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. అల్పపీడనం మరింత బలహీనపడే అవకాశం ఉందని, తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మరోవైపు, రాజధాని హైదరాబాద్, దాని చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో కూడా వర్షపాతం గణనీయంగా పుంజుకోనుంది. వాయుగుండం ప్రభావంతో ఒక్కసారిగా మారిపోయి భారీ వర్షాలకు దారితీసే అవకాశం ఉంది. అకాల గాలులు, మెరుపుల పట్ల ప్రజలు, ముఖ్యంగా రైతాంగం అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. కాగా రాష్ట్రంలోని మరో 10 జిల్లాల్లో లోటు వర్షపాతం కొనసాగుతోంది. రాష్ట్రంలోని జగిత్యాల, హైదరాబాద్, వికారాబాద్, నారాయణ్‌పేట్, నిజామాబాద్, భువనగిరి, వనపర్తి, గద్వాల్, వరంగల్, మల్కాజిగిరి, హన్మకొండ జిల్లాల్లో -21 నుండి -54 శాతం వరకూ లోటు వర్షపాతం రికార్డయింది. ఇక గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో చిరు జల్లులు పడ్డాయి. వనపర్తి, గద్వాల, నారాయణ్‌పేట్, ఆదిలాబాద్, భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల్లో చిన్నపాటి జల్లులు కురిశాయి.

## ఇక డిజిటల్ గవర్నెన్స్

>> చేయడంతో పాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్ హెచ్చార్డీలోని బోధి పెవిలియన్ లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు అందించేందుకు వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని అధికారులకు సూచించారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలన్నారు.

రాష్ట్రంలో దాదాపు 4,800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా.. ఇందులో 4300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్ తో సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటి నుంచి 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, మున్సిపల్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, ఎంసిఆర్ హెచ్ఆర్‌డి వైస్ చైర్మన్ శాంతి కుమారి, వేతన సవరణ కమిషనర్ ఎన్. శివ శంకర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా విభాగం కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## అధ్యక్షుడికి తప్పిన ప్రమాదం

>> హోటల్ వద్ద పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. 18 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సుదీర్ఘ కాలంగా అంతర్యుద్ధంతో నలిగిపోయిన సిరియా.. ఇటీవల అక్కడ పాలకులు మారిన తర్వాత పునర్నిర్మాణంపై దృష్టి సారించింది. పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే గతంలో పలు దేశాలు విధించిన అనేక ఆంక్షలు ఎత్తివేయడానికి పాశ్చాత్య దేశాలను ఒప్పించడంలో కీలక పాత్ర వహించిన మెక్రాన్.. అల్-షరా అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా ఆ దేశంలో కీలక పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా ప్రతినిధుల బృందంలోతో కలిసి డమాస్కస్‌లోని ఫోర్ సీజన్స్ హోటల్‌లోనే బస చేశారు.

మెక్రాన్ పర్యటన కొనసాగుతున్న సమయంలోనే.. హోటల్‌కు సమీపంలో రెండు పేలుళ్లు సంభవించాయి. చెత్తడబ్బాలో ఒకటి, పార్కింగ్ చేసిన కారులో మరో పేలుడు జరిగినట్లు సిరియా అధికారిక మీడియా తెలిపింది. ఈ ఘటనలో నలుగురు భద్రతా సిబ్బందికి గాయాలైనట్లు సమాచారం.

## 38 మందికి ఉరి ఖరారు

>> ఉన్నత హైకోర్టు సమర్థించింది. ఒకే కేసులో ఇంత పెద్ద సంఖ్యలో నిందితులకు ఉరిశిక్ష ఖరారు కావడం భారత న్యాయవ్యవస్థ చరిత్రలోనే ఇది మొదటిసారి. ట్రయల్ కోర్టు ఇచ్చిన ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లను, అలాగే మరణశిక్షల ఖరారు పిటిషన్లను గుజరాత్ హైకోర్టు సమగ్రంగా విశ్లేషించింది. డిజిటల్ ఆధారాలు, ఫోరెన్సిక్ నివేదికలు, నిందితుల కాల్ డేటా రికార్డులను పరిశీలించిన తర్వాత.. దిగువ కోర్టు ఇచ్చిన తీర్పు చట్టబద్ధమైనదని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దోషులకు శిక్షల ఖరారుతో పాటు, ఉగ్రదాడిలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాల పట్ల న్యాయస్థానం మానవీయ కోణంలో స్పందించింది. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక పౌరుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని హైకోర్టు గుజరాత్ ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. అలాగే తీవ్ర గాయాలపాలైన బాధితులకు రూ. 5 లక్షలు మరియు స్వల్ప గాయాలైన వారికి రూ. 1 లక్ష చెల్లించాలని కోర్టు ఆదేశించింది. తీర్పు అనంతరం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమిత్ పటేల్ మాట్లాడుతూ, డివిజన్ బెంచ్ తీర్పు వెలువరించడానికి ముందు మార్చి 2025 నుండి ఈ అప్పీళ్లపై రోజువారీ ప్రాతిపదికన విచారణ జరిగిందని తెలిపారు. "ఈ కేసులో విచారణ మార్చి 2025 నుండి రోజువారీగా జరుగుతూ వచ్చింది. మంగళవారం గుజరాత్ హైకోర్టు డివిజన్ బెంచ్ తన తీర్పును వెలువరించింద్ని అని పటేల్ పేర్కొన్నారు. పూర్తి స్థాయి తీర్పు ఇంకా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రాలేదని, పూర్తి ఉత్తర్వును పరిశీలించిన తర్వాతే దీనిపై మరింత వ్యాఖ్యానించగలనని ఆయన చెప్పారు. "ప్రస్తుతానికి, పూర్తి తీర్పు అప్‌లోడ్ చేయబడలేదు, కాబట్టి నేను దానిని చదివే అవకాశం పొందలేదు. తీర్పు పూర్తి పాఠాన్ని పరిశీలించిన తర్వాతే నేను దానిపై వివరంగా వ్యాఖ్యానించగలన్ను అని ఆయన అన్నారు. ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసే హక్కు దోషులకు ఉంటుంది.

## డెడ్‌స్టోరేజ్‌కు జూరాల

>>జిల్లాల సరిహద్దులో కృష్ణా నదిపై 1995లో నిర్మించారు. ఇక్కడే 240 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఉన్నది. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ఇందులో దాదాపు 3.71 టీఎంసీలు డెడ్ స్టోరేజ్ కింద ఉన్నాయి. ఈ డెడ్ స్టోరేజ్ నీటిని సాగునీటికాల్వలకు వదలడానికి వీలుండదు. 5.94 టీఎంసీలు ఉంటే లైవ్ స్టోరేజ్ ఉన్నట్లు. అంటే సాగు, త్రాగునీటికి అందుబాటులో ఉండే నీరు అని అర్థం. జూరాల ప్రాజెక్టులో పూడిక (సిల్ట్) పేరుకుపోవడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుందని గతంలో నిర్వహించిన సర్వేల్లో తేలింది. వేసవి కాలంలో జలాశయంలో నీటి మట్టం అడుగంటి, డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరినప్పుడు ఆయకట్టుకు సాగునీటిని నిలిపివేసి కేవలం త్రాగునీటి అవసరాలకు మాత్రమే ప్రాధాన్యతనిస్తారు.

**గత ఏడాది..** జూరాల జలాశయంలో గత ఏడాది అనగా 2025 జూలై 7న, జూరాల జలాశయ నీటిమట్టం 7.389 టిఎంసిల నిల్వ ఉన్నది. 1.10 లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లో, 1.11 లక్షల క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది. మే 29న జూరాలకు వరద ప్రారంభమైంది.

**జూరాలలో ప్రస్తుతం..** జూరాలకు ఎగువన కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి వరద విడుదల అయితేనే కిందకి నీరు చేరుకుంటుంది. ఎలాంటి వరద నమోదు కాకపోవడంతో జూరాల అడుగంటింది.

పూర్తి కెపాసిటీ 318.516 మీటర్లు ,9.657 టీఎంసీలు కాగా మంగళవారం ఉదయం 6 గంటలకు అందిన సమాచారం మేరకు లైవ్ స్టోరేజ్ 2.083టీఎంసీ లు గా గ్రాస్ 5.790 టీఎంసీలుగా నమోదు అయింది.

# ఈటల! నీ మాటల్లో బిజెపి లైన్ ఉందా! బిఆర్ఎస్ స్క్రిప్ట్ ఉందా?

### బిజెపి ఎంపివా? బిఆర్ఎస్ ఏజెంటువా?: మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త:** ఈటల రాజేందర్ బిజెపి ఎంపిగా మాట్లాడు తున్నారో, బిఆర్ఎస్ ఏజెంట్‌గా మాట్లాడుతున్నారో ప్రజలకే అర్థం కావడం లేదని టిపిసిసి చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు.ఈటెల రెండు నాలుకల ధోరణి ఏంటి?ఆయన మాటల్లో బిజెపి లైన్ ఉందా, బిఆర్ఎస్ స్క్రిప్ట్ ఉందా అనేది తెలంగాణ సమాజం గమనిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీళ్లు తీయొద్దని చెప్పింది ఎవరో కాదు, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ తెలిపిందని తెలిపారు. కెటిఆర్ టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కాదు అసలైన ఎక్స్‌పర్ట్స్ ఎన్‌డిఎస్ఎ వాళ్ళు మాత్రమే ఆయన అన్నారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి భద్రతా కారణాల దృష్ట్యా నీళ్ల విడుదల చేయొద్దని కేంద్ర ప్రభుత్వ సంస్థనే నిషేధించిందని గుర్తుచేశారు. మేడిగడ్డలో నీళ్ళు ఎందుకు ఆపుతలేరని ఈటల రాజేందర్ ఢిల్లీకి పోయి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అడిగాలని కోరారు. బిఆర్ఎస్, బిజెపిలు రెండూ ఒకటే అని మేము మొదటి నుంచి చెపుతునే ఉన్నామని ఇప్పుడు అది వంద శాతం నిజమని తేలిపోయిందని మహేష్ కుమార్ అన్నారు. ఢిల్లీలో దోస్తీ... గల్లీలో కుస్తీ అన్నట్టుంది వీరి వ్యవహారం. ప్రజా క్షేత్రంలో బిజెపి, బిఆర్ఎస్ ఆడుతున్న ఈ కపట నాటకాలను కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజల ముందు కచ్చితంగా ఎండగడుతుందని ఆయన ఖరా ఖండిగా తెలిపారు. కాళేశ్వరంపై బిఆర్ఎస్ ఎంత తప్పుడు మాట్లాడితే అంత మందిని కెటిఆర్‌కు హితవు చెప్పారు. కాళేశ్వరం పేరుతో కెటిఆర్ కుటుంబం వేల కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. కెటిఆర్ ఇంజనీర్‌గా స్వతహాగా భావించుకొని డిజైన్ చేసి నియంతృత్వంగా నాణ్యతాప్రమాణాలు పాటించకుండా ఇంజనీర్ల మాట వినకుండా కట్టడంతో కాళేశ్వరం 'కూలేశ్వరం'గా మారిందని ఆవేదన చెందారు. కాళేశ్వ రాన్ని వారం అప్పగిస్తే నీళ్లు ఇస్తాం అని చెబుతున్న కెటిఆర్ తొమ్మి దిన్నర యేళ్లలో ఏమి చేశారో చెప్పాలని కోరారు. కాళేశ్వరంలో వారి అవినీతితో ప్రాజెక్టుకే శాపం ఏర్పడిందని వర్షాభావంతో నీళ్లు లేని సమయంలో సముద్రం లోకి నీళ్లు వదులుతున్నారంటూ కెటిఆర్ చేస్తున్న ప్రకటనలు ఆయన అనుభవ రాహిత్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. అవినీతితో కాళేశ్వరాన్ని కెసి ఆర్ ప్రభుత్వం కూల్చివేస్తే దాన్ని కాంగ్రెస్ కాపాడు తోందని అన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారే జీల పునాదుల నాణ్యత అనుమానాస్పదంగా ఉన్నాయనే వాస్తవం కెటిఆర్‌కు తెలియదా...?నాణ్యతా లోపంతో ఉన్న ప్రాజెక్టుల్లో పంపులు ఆన్ చేస్తే ఏమవుతుందో కెటి ఆర్‌కు తెలియదా? గతంలో కెసిఆర్ కూడా తాను ఇంజి నీరు అంటూ గొప్పలకు పోయి కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యత లేకుండా చేశారు. ఇప్పుడు కెటిఆర్ కూడా అదే అహంకారంతో అవగాహన లేకుండా పంపులు ఆన్ చేయమని అంటున్నారు. ఎన్‌డిఎస్ఎ, సిడబ్ల్యుసి అనుమతులు లేకుండా బ్యారేజీలు నిర్వహించడం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడడమే అన్నారు.



# రూ.1.60 కోట్ల నిషేధిత సింథటిక్ డ్రగ్స్ స్వాధీనం

### నాచారంలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల దాడులు

### హైమా సింథసిస్ కంపెనీపై కేసు నమోదు

**హైదరాబాద్ (తార్నాక), జులై 7, ప్రభాతవార్త :** నాచారంలో ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్, డ్రగ్ కంట్రోల్ అధికారుల సంయుక్త దాడుల్లో రూ.1.60 కోట్ల విలువైన నిషేధిత సింథటిక్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్ స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం1985 కింద నిషేధిత పదార్థంగా గుర్తించిన ఎన్‌బెంజిల్‌పైపెరజైన్కు చెందిన 5.860 కిలోల డ్రగ్‌ను అధికారులు సీజ్ చేశారు. డ్రగ్ కంట్రోల్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు ఎస్టీఎఫ్ డీ టీమ్ డీఎస్పీ తిరుపతి యాదవ్, సీఐ నాగరాజ్ సిబ్బంది, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఇందిరా ప్రియదర్శిని, అన్వేష్‌లు మంగళవారం నాచారంలోని హైమా సింథసిస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నిషేధితమైన ఎన్‌బెంజిల్‌పైపెరజైన్ డ్రగ్‌ను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ డ్రగ్‌ను గుజరాత్ నుంచి తెప్పించి హైదరాబాద్, బెంగళూరు, ముంబై నగరాలకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు ప్రాథమిక విచారణలో గుర్తించారు.దుకాణంలో ఉన్న 5.860 కిలోల నిషేధిత డ్రగ్‌ను స్వాధీనం చేసుకుని, సంస్థకు చెందిన మదుగొండ ఈశ్వర్‌పై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని, స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను నాచారం ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం ఈ తరహా నియంత్రిత సైకోట్రోపిక్ పదార్థాలను అనుమతి లేకుండా తయారు చేయడం, కొనుగోలు చేయడం, విక్రయించడం, నిల్వ చేయడం, రవాణా చేయడం శిక్షార్హమైన నేరమని అధికారులు హెచ్చరించారు. ఈ డ్రగ్స్ సరఫరా వ్యవహారంపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

# నేటి నుంచి పిజి ఎంట్రన్స్ పరీక్షలు

### 44 కోర్సుల్లో ప్రవేశాలకు 53 వేల దరఖాస్తులు

### ప్రతిరోజు మూడు షిఫ్టుల్లో పరీక్షలు

**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 9 యూనివర్సిటీల్లో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే కామన్ పీజీ ఎంట్రన్స్ టెస్ట్ (సీపీజీఈటీ)–2026 పరీక్షలు నేటి(బుధవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 15 వరకు పరీక్షలు కొనసాగుతాయి. పరీక్షలను ప్రతి రోజు మూడు సెషన్‌లలో నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 1 గంటల నుంచి 2.30 వరకు, చివరి సెషన్ సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు జరుగుతాయి. సీపీగెట్‌ను గత ఏడాది వరకు ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించగా... ఈ ఏడాది ఆ బాధ్యతను ఉన్నత విద్యామండలి కాకతీయ యూనివర్సిటీకి అప్పగిం చింది. సీపీగెట్–2026కి ఈ ఏడాది సుమారు 53 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు, జేఎన్‌టీయూహెచ్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎడ్ సైన్సెస్ విశ్వ విద్యాలయాల్లో పీజీ ప్రవేశాలకు సీపీగెట్‌ను నిర్వహిస్తున్నారు. ఎంఏ, ఎం కామ్, ఎమ్మెస్సీ, పీజీ డిప్లొమా కోర్సులతోపాటు 44 కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నారు. హైదరాబాద్‌తోపాటు వరంగల్, ఖమ్మం, కోదాడ, కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

# పొట్టకూటి కోసం వెళ్తే కబళించిన మృత్యువు

### ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరు కూలీల దుర్మరణం

### మరోనలుగురికి తీవ్రగాయాలు

**చింతలమానేపల్లి, జులై 7, ప్రభాతవార్త:** రెక్కాడితే గాని డొక్కాడని ఆ పేద కుటుంబాల్లో తెల్లవారితే కూలి పనులకు వెళ్లడం నిత్యకృత్యం. ఎప్పటిలాగే పొట్టకూటి కోసం కూలి పనులకు వెళ్లిన ఆ కూలీలను మృత్యువు కబలించింది. సిమెంట్ స్తంభాల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు కూలీలు అక్కడికక్కడే దుర్మరణం పాలవగా.. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘోర రోడ్డు ప్రమాదం చింతలమానేపల్లి మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కెరమెరి నుంచి చింతలమానేపల్లి వైపు సిమెంట్ స్తంభాల లోడ్‌తో ఒక ట్రాక్టర్ బయలుదేరింది. బాబాసాగర్ డబ్బా ప్రధాన రహదారిపైకి రాగానే వాహనం అదుపుతప్పి ఒక్కసారిగా రోడ్డుపై బోల్తా పడింది. ట్రాక్టర్‌లో ఉన్న భారీ సిమెంట్ స్తంభాలు మీద పడటంతో, వాటి కింద నలిగి ఇద్దరు కూలీలు సెల్ల అశోక్(49)దండుకు పండిత్ (50)అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో నలుగురు కూలీలను స్థానికులు తక్షణమే స్పందించి 108 అంబులెన్స్‌లో అత్యవసర చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

సమాచారం అందుకున్న చింతలమానేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి,దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.కూలి పనులకు వెళ్లిన వారు శవాలవ్వడంతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంద కృష్ణమాదిగ

# వర్గీకరణతోనే ఉద్యమం ఆగిపోలేదు

### ప్రజాసంక్షేమ వైపు ప్రయాణం కొనసాగిస్తాం: మంద కృష్ణమాదిగ

**సికింద్రాబాద్, జులై 7, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణను సాధించుకోవడం జరిగింది కనుక ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఆగిపోదని సమాజంలో అణగారిపోయిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ,వికలాంగులు, అగ్రకుల పేద సంక్షే మం కోసం, ఆ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం ముందుకు కొనసాగుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ వేడుకలను సికింద్రాబాద్ పార్సిగుట్టలోని జాతీయ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. మాదిగ అమరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ దేశంలో 32 సంవత్సరాల ఉద్యమ ప్రయాణం కొనసాగించడం సాధారణమైన విషయమేమీ కాదని అన్నారు. ఉద్యమానికి ఎన్నో, సమస్యలు, ఇబ్బందులు, కష్టాలు, నష్టాలు, కుట్రలు. వెన్నుపోట్లు ఎదురైనా మాదిగ ప్రజలు, సమాజం ఉద్యమాన్ని వెన్నంటే ఉన్నారని అన్నారు. అందువల్ల ఉద్యమ శక్తిని జాతి ప్రయోజనాల కోసం, సమాజ ప్రయోజనాల కోసం ఉపయోగించిందని అన్నారు. దేశంలో ఎన్నో కుల సంస్థలు ఉన్నప్పటికీ అవి వారి కుల హద్దుల వరకే పరిమితంగా పని చేశాయని, ఎమ్మార్పీఎస్ తన పరిధిని దాటి ఎన్నో సామాజిక మానవీయ పోరాటాలు చేసి సమాజంలోని అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందించిందని అన్నారు. అందువల్ల ఉద్యమాన్ని నేడు అన్ని కుల సంఘాలు, ఉద్యమ సంఘాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని అన్నారు. భవిష్యత్ తరాలు గర్వంగా చెప్పుకునేలా ఎమ్మార్పీఎస్ చరిత్ర నిర్మిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ, ఇంజం వెంకటస్వామి, సోమశేఖర్, నరసింహారావు, అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ మాదిగ, శ్రీకిషన్, ఇతర నేతలు పాల్గొన్నారు.

### 10న ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో

# 'రైతు ఆశీర్వాద సభ'

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 7:** రాష్ట్రంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం మరో భారీ బహిరంగ సభకు సిద్ధమైంది. ఈనెల 10వ తేదీన ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో ప్రతిష్టాత్మక రైతు ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానున్న ఈ భారీ సభలో సిఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం సాయంత్రం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సభాస్థలాన్ని స్వయంగా పరిశీలించారు. సభకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పర్యవేక్షి ంచారు.

# మద్నూరులో బాలిక కిడ్నాప్ సుఖాంతం

### బాధితురాలిని రక్షించి, కిడ్నాపర్‌ను పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లా మద్నూరులో సోమవారం ఉదయం కిడ్నాప్‌కు గురైన ఆరేళ్ల బాలిక ఉదంతం సుఖాంతమయ్యింది. మద్నూరులో జరిగే వారంతరపు సంతకు తన తండ్రి హనుమంతుతో కలిసి వచ్చిన ఆరేళ్ల దుర్గను గుర్తు తెలియని వ్యక్తి తండ్రిని ఏమార్చి కిడ్నాప్ చేశాడు. హనుమంతు సరుకులు కొంటుండగా బాలిక బజ్జీలు తింటున్న సమయంలో కిడ్నాప్‌కు గురయ్యింది. దీనిపై బాలిక త ండ్రి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారంతరపు సంతలో జనం రద్దీగా వున్న సమయంలో బాలిక కిడ్నాప్ కావడం కలకలం రేపింది. దీనిపై వెంటనే రంగంలో దిగిన మద్నూరు పోలీసులు సంతలో వున్న సిసి కెమెరాల ఫుటేజిలను పరిశీలించారు. దీని తరువాత ఆ బాలికను మహారాష్ట్రకు చెందిన ఓ కిడ్నాపర్ ఎత్తుకెళ్లినట్లు ఆధారాలు సేకరించిన పోలీసులు మహారాష్ట్రలోని దెగ్లూరులో గాలింపు చేబట్టి సోమవారం రా త్రి నిందితుడిని పట్టుకున్నారు. అతని ఇంట్లో వున్న బాలికను రక్షించి మద్నూరుకు తీసుకువచ్చారు. బాలిక ఆరోగ్యం బాగానే వుందని పోలీసులు తెలిపారు. నిందితుడి అరెస్టు, కిడ్నాప్‌కు దారితీసిన పరిస్థితులపై బుధవారం జిల్లా ఎస్పి రాజేష్ చంద్ర మీడియాకు వివరించనున్నారని తెలిసి ంది.

# సన్నవడ్ల బోనస్ అక్రమార్కులకు చెక్

### చెల్లింపుల్లో కీలక మార్పులు.. స్పష్టం చేసిన వ్యవసాయ శాఖ

**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం సన్న వడ్ల బోనస్‌కు సంబంధించి అక్రమార్కులకు చెక్ పెట్టాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు గాను సన్న వడ్ల బోనస్ పథకంలో కీలక మార్పులు చేసినట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. రైతులు పండించిన సన్న రకం వడ్లకు మార్కెట్ ధరతో పాటు అదనంగా క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ అందిస్తున్నారు. డబ్బును నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేస్తున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్ నుండి సరికొత్త మార్గదర్శకాలను అమలు చేయాలని వ్యవసాయ శాఖ డిసైడ్ అయింది. తెలంగాణ ప్రభుత్వం రైతులు విక్రయించిన సన్న వడ్లకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ జమ చేస్తోంది. వీటిని నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం వేస్తోంది. అయితే ఈ బోనస్ అందించేందుకు పలు విధివిధానాలు మార్చింది. ఇక నుంచి ప్రభుత్వం ప్రకటించిన 7 రకాల సన్న రకం విత్తనాలు వేసి పండించిన రైతులకు మాత్రం బోనస్ అందుతుంది. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన 7 ప్రత్యేక రకాల సన్న వరి విత్తనాలను వేసి పండించిన రైతులకు మాత్రమే క్వింటాకు రూ.500 బోనస్ సొమ్ము అందుతుంది. ఈ పథకానికి అర్హత సాధించాలంటే రైతులు కొనుగోలు చేసే విత్తనాల రికార్డులు ఆన్‌లైన్‌లో కచ్చితంగా నమోదవ్వాలి. ఇందుకోసం వ్యవసాయ శాఖ ప్రత్యేక ఆన్‌లైన్ ప్రక్రియను అందుబాటులోకి తెచ్చింది. కాగా, ఇక నుంచి ప్రభుత్వ అనుమతి పొందిన విత్తన డీలర్లు తాము రైతులకు విక్రయించే ప్రతి సన్న వరి విత్తన రకం వివరాలను వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేసారు. సన్న వరి రకం విక్రయాల ఆప్షన్‌ను ఎంచుకుని విత్తనాలు కొనుగోలు చేసిన రైతు పేరు, తండ్రి పేరు, విత్తన రకం, కంపెనీ పేరు, లాట్ నంబర్, సీడ్ ప్యాకెట్ సైజ్, కొనుగోలు చేసిన తేదీ లాంటి వివరాలు నమోదు చేయాలని స్పష్టం చేసారు. వానాకాలం సీజన్‌లో విక్రయించే విత్తనాలకు మాత్రమే ఈ డిజిటల్ విధానం అమల్లో ఉంటుంది. ర్ఎన్ఆర్15048, బీపీటీ5204, కేఎన్ఎం1638, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, డబ్ల్యుజీఎల్44, కేఎన్ఎం7715 రకాలు పండించిన రైతులకు మాత్రమే బోనస్ అందిస్తారు. అక్రమాల నియంత్రణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి.

# డ్రగ్స్ కంట్రోల్ బోర్డులో ఆహార కల్తీ నిరోధక విభాగం విలీనం

### సీనియర్ ఐపిఎస్ అధికారిని బాస్‌గా నియమించేందుకు సర్కారు నిర్ణయం

**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆహార కల్తీ నానాటికి పెరిగిపోతుండడంతో దీనిని పూర్తిగా అరికట్టేందుకు సర్కారు నిర్ణయించిం ది. ఇందులో భాగంగా డ్రగ్స్ కంట్రోల్ విభాగంలో ఆహార కల్తీ నిరోధక విభాగాన్ని విలీనం చేయాలని సర్కారు నిర్ణయం తీసుకుంది. రెండు వి భాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి అదనపు డిజి స్థాయి అధికారిని బాస్‌గా నియమించాలని సర్కారు నిర్ణయించినట్లు సమాచారం. ప్ర స్తుతం డ్రగ్స్ కంట్రోల్‌కు ఐపిఎస్ అధికారి బాస్‌గా వుండగా ఈ విభాగంలో కొందరు పోలీసులు మరికొందరు ఔషధ నియంత్రణ విభాగం సిబ్బంది వున్నారు. ఇక ఆహార కల్తీ నిరోధక విభాగం పూర్తిగా మున్సిపాలిటీల ఆధ్వర్యంలో వున్నాయి. ఇటీవల కాలంలో ఆహార కల్తీ అతిపెద్ద స మస్యగా మారడం తెలిసిందే. రాష్ట్రంలో ఎక్కడ చూసినా కల్తీ ఆహారం పట్టుబడడం నిత్యకృత్యంగా మారింది. శాఖాహారం మొదలుకొని మాం సాహారం వరకు అన్నింటిలో కల్తీ రాజ్యమేలుతుండగా ఆహారం తయారీలో వాడే మసాలా దినుసులు, బియ్యం, ఉప్పు, పప్పు, కారం సహా అ న్నింటిలో కల్తీ సరుకు వాడుతుండడం పెరిగిపోయింది. గ్రేటర్ పరిధిలో కల్తీ ఆహారాన్ని పోలీసులు, బల్దియా అధికారులు పెద్ద సంఖ్యలో పట్టు కోవడంతో పాటు పదుల సంఖ్యలో నేరగాళ్లను అరెస్టు చేశారు.

# భారత బ్రిడ్జ్‌మ్యాన్ పద్మశ్రీ గిరీష్ భరద్వాజ్ కన్నుమూత

**బెంగళూరు, జులై 7:** పద్మశ్రీ పురస్కార గ్రహీత, దేశవ్యాప్తంగా తక్కువ వ్యయంతో వేలాడే వంతెనల నిర్మాణానికి ప్రసిద్ధి చెందిన భారత



బ్రిడ్జ్ మ్యాన్ డాక్టర్ గిరీష్ భరద్వాజ్ మంగళవారం తెల్లవారుజామున స్వల్ప అస్వస్థతతో కర్ణాటకలోని సుళ్లియాలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూశారు. ఆయన వయస్సు 76 సంవత్సరాలు. కర్ణాటక రాష్ట్రంలోని దక్షిణ కన్నడ జిల్లా సుళ్లి యాకు చెందిన మెకానికల్ ఇంజినీర్ అయిన గిరీష్ భరద్వాజ్, మూడు దశాబ్దాలకుపైగా మారుమూల గ్రామాలను ప్రపంచంతో అనుసంధానిం చేందుకు అంకితభావంతో పనిచేశారు. దేశవ్యాప్తంగా అందుబాటులోకి రాని ప్రాంతాల్లో 140కిపైగా తక్కువ వ్యయంతో నిర్మించిన వేలాడే కాలిబాట వంతెనల ద్వారా వేలాది మంది గ్రామీణుల జీవితాల్లో వెలుగులు నింపారు.ఆయన రూపొందించిన వినూత్న వంతెనల వల్ల పాఠశాలలు, ఆస్పత్రులు, మార్కెట్లు వంటి కీలక సేవలకు గ్రామీణ ప్రజలకు ఏడాది పొడవునా సులభంగా చేరుకునే అవకాశం లభించింది. వర్షాకాలంలో రవాణా సమస్యలతో ఇబ్బందులు పడే అనేక గ్రామాలకు ఈ వంతెనలు జీవనాధారంగా మారాయి.

# సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపుసిపి

**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త:** నగర సైబర్‌క్రైం పోలీసు స్టేషన్‌ను అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్) ఎం.శ్రీనివాస్ మం గళవారం ఆకస్మి కంగా తనిఖీ చేశారు. బషీర్‌బాగ్‌లో సిసిఎస్ కార్యాలయంలో వున్న సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఆయన ఈ స ందర్భంగా అక్కడ ఇటీవల కాలంలో వచ్చిన ఫిర్యాదులు, నమోదైన కేసులు, కేసుల విచారణ తీరు తెన్నులను క్షుణ్ణంగా పరిశీలించారు. సైబర్ నేరాల పరిశీలకు వాడుతున్న ల్యాబ్‌ను ఆయన పరిశీలించి అక్కడి పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అదనపు పోలీసు కమిషన ర్ శ్రీనివాస్ వెంట సైబర్ క్రైం డిసిపి అరవింద్ బాబు సహా ఇతర అధికారులు వున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సైబర్ నేరా లు ఇటీవల కాలంలో బాగా పెరిగిపోయాయని, ఈ నేపథ్యంలో కేసుల విచారణ వేగవంతం చేయాలని, అంతా పారదర్శకంగా వుండాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం జరగాలని ఆయన తెలిపారు.

ఫిర్యాదుల కోసం వచ్చే బాధితుల పట్ల ఇక్కడి సిబ్బంది గౌరవంగా వ్యవహరిం చాలని ఆయన ఆదేశించారు, నేరాలను విచారించే అధికారులు తమకు కేటాయించిన కేసులను నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి, దోషులకు శిక్షలు పడేలా చేయాలని ఆయన తెలిపారు. నగర సైబర్‌క్రైం పోలీసుస్టేషన్ సిబ్బంది పనితీరును ఆయన అభినందించారు. సైబర్‌క్రైం పోలీసుస్టేషన్ సాధిస్తున్న ఫలితాలపట్ల శ్రీనివాస్ సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ ఇదేవిధంగా రాణిం చాలని ఆయన కోరారు.

# చంచల్‌గూడ జైలుకు భీంరెడ్డి

**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త:** ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో ఏసిబి అధికారులు సోమవారం రాత్రి అరెస్టు చేసిన పోలీసు కంప్యూటర్ సర్వీసెస్ విభాగం డిఎస్పి భీంరెడ్డిని మంగళవారం ఉదయం చంచల్‌గూడ జైలుకు తరలించారు. వాస్తవానికి సోమవారం రాత్రే భీంరెడ్డిని చంచల్‌గూడకు జైలుకు తరలించేందుకు ఏర్పాట్లు చేసిన ఏసిబి అధికారులు సాంకేతిక కారణాల వల్ల వాయిదా వేశారు. మంగళవారం ఉదయం ఏసిబి కోర్టుల న్యాయమూర్తి ఆదేశాల మేరకు రెండు వారాల రిమాండు నిమిత్తం జైలుకు తరలించారు. గత గురువారం అక్రమాస్తుల కేసులో ఆయనను ఏసిబి అదుపులోకి తీసుకోవడం తెలిసిందే. 200 కోట్ల రూపాయల అక్రమాస్తులు భీంరెడ్డి వద్ద వున్నట్లు నిర్ధారించిన ఏసిబి అరెస్టు చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఆయన హఠాత్తుగా అస్వసతకు లోనవడంతో దీనిని వాయిదా వేయడం విదితమే. భీంరెడ్డి ఆ రోగ్యం కుదుట పడడంతో అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

# భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నరసింహారెడ్డి కన్నుమూత

### రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసినా సొంత ఇల్లు కూడా లేని గొప్పనేత

### నేడు బ్రాహ్మణపల్లిలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

### సిఎం రేవంత్‌రెడ్డి, మాజీ సిఎం కెసిఆర్ ప్రగాఢ సంతాపం


**హైదరాబాద్ (ఉప్పల్ /యాదాద్రి భువనగిరి బ్యూరో), జులై 7, ప్రభాతవార్త :** భువనగిరి మాజీఎమ్మెల్యే, విలువలతో కూడిన రాజకీయాలకు నిలువెత్తు రూపమైన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొమ్మిడి నరసింహారెడ్డి (85) మంగళవారం ఉదయం హైదరాబాద్‌లో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైద రాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొం దుతూ తెల్లవారుజామున 5 గంటలకు తుదిశ్వాస విడిచారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా పని చేసినా సొంత ఇల్లు కూడా లేకుండా, ఒక పాత స్కూటర్ మినహా ఎలాంటి ఆస్తులు కూడబెట్టకుండా నిరాడంబరంగా జీవించిన ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ నేతలు నివాళులర్పించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నా రు. ఆయన పార్థివదేహాన్ని హబ్సిగూడ రవీంద్ర నగర్‌లోని కుమార్తె ఇంట్లో ఉంచారు. బుధవారం బ్రాహ్మణపల్లిలో అధికార లాంఛనాలతో అంత్య క్రియలు నిర్వహిస్తారని కుటుంబసభ్యులు తెలి పారు. ఆయన పార్థివదేహాన్ని రెడ్డి జాగృతి రాష్ట్ర నాయకులు కాంతాల నారాయణరెడ్డి, గుండు రాజన్న, మాలు నాయక్ తదితరులు నివాళులు అర్పించారు.

**రాజకీయ నేపథ్యం**

నరసింహారెడ్డి కేవలం 19 యేళ్ల వయసులోనే 1962లో బ్రాహ్మణపల్లి సర్పంచ్‌గా ఎన్నికై ప్రజా జీవితాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత భువనగిరి సమితి అధ్యక్షుడిగా పనిచేశారు. 1978లో కాంగ్రెస్ తరపున భువనగిరి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన 1983లో ఎన్టీఆర్ ప్రభంజనాన్ని తట్టుకొని రెండోసారి కూడా కాంగ్రెస్ నుంచే ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకునే రోజుల నుంచే రాజకీయాల్లో చురుగ్గా ఉన్న ఆయన మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డికి ప్రియశిష్యుడిగా మారి 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. తెలంగాణ సాగునీటి రంగంపై అపార అధ్యయనం చేసిన ఆయన, గోదావరి జలాలను మూసీ నదిలోకి మళ్లించి లక్ష ఎకరాలకు సాగునీరు అందించవచ్చని బ్లూప్రింట్లతో సహా ప్రతి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ నిరంతరం పోరాడారు. భువనగిరి ప్రాంత అభివృద్ధి కోసం సీసీఎంబీ ఏర్పాటుకు, అలాగే బీబీనగర్ నిమ్స్ అభివృద్ధికి ఆయన ఎంతో శ్రమించారు. నిమ్స్ పనులు ఆలస్యం కావడాన్ని నిరసిస్తూ వృద్ధాప్యంలోనూ ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా ఆస్పత్రి ఎదుట నిరాహార దీక్ష చేయగా, అప్పటి ప్రభుత్వం స్పందించి రూ.60 కోట్ల నిధులు మంజూరు చేసింది.

**సిఎం రేవంత్‌రెడ్డి సంతాపం**

భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహా రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. 1969 తొలి దశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న నర్సిం హారెడ్డి తుదిశ్వాస వరకు నీతినిజాయితీతో జీవిం చారని కొనియాడారు. గోదావరి జలాల సాధన, మూసీ పరిరక్షణ ఉద్యమాలను నిర్వహించి నిత్యం ప్రజల పక్షాన నిలిచారని గుర్తుచేశారు. భూదానోద్యమానికి తన 300 ఎకరాల భూమిని దానం చేసిన గొప్ప మానవతావాదిగా స్మరించు కున్నారు. 1978, 1983 సంవత్సరాల్లో రెండు సార్లు భువనగిరి నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహించారని పేర్కొన్నారు. నిరాడంబర జీవితాన్ని గడుపుతూ, అనునిత్యం ప్రజాసమస్యలపై పోరాడిన నర్సింహారెడ్డి నేటి తరానికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, కొమ్మిడి నర్సింహారెడ్డి కుటుంబసభ్యులకు సిఎం ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



కొమ్మిడి నరసింహారెడ్డి (ఫైల్)

**మాజీ సిఎం కెసిఆర్ సంతాపం**

తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. రాజకీయాల్లో నిరాడంబరత, నీతి నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన ప్రజల మనిషి నర్సింహారెడ్డి అని, వారి కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
షాద్‌నగర్ మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా
లేఖ నెం. E1/2081/2026, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 06.07.2026
షాద్‌నగర్ మునిసిపాలిటీలో సోలిపూర్‌లో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం (వెబ్‌సైట్ tender.telangana.gov.in) పై డ్రైన్ నిర్మాణం నిమిత్తం టెండర్ పిలువబడుతోంది. టెండర్ యొక్క షెడ్యూల్: 1) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 06.07.2026 సా.5.30 గం. 2) బిడ్ దాఖలు ముగింపు తేది: 13.07.2026 ఉ.11.00 గం. 3) బిడ్ తెరచు తేది: 13.07.2026 ఉ.11.01 గం. వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ (వెబ్‌సైట్ tender.telangana.gov.in) సంప్రదించండి.
సం/- మునిసిపల్ కమిషనర్, షాద్‌నగర్ మునిసిపాలిటీ
DIPR.No.5658-PP/CL/Advt/1/2026-27, తేది: 07.07.2026

NMDC Limited
(A Government of India Enterprise)
Regd. Office: Khanij Bhavan, 10-3-311/A, Castle Hills, Masab Tank, Hyderabad – 500 028, CIN: L13100TG1958GOI001674;
Phone: +91 040-23538757; E-mail: ims@nmdc.co.in
Website: https://www.nmdc.co.in/

NOTICE TO SHAREHOLDERS

OPENING OF SPECIAL WINDOW FOR TRANSFER AND DEMATERIALISATION OF PHYSICAL SECURITIES

Pursuant to SEBI Circular No. SEBI/HO/ 38/13/11(2) 2026-MIRSD-POD/I/3750/2026 dated January 30, 2026, shareholders of NMDC Limited are hereby informed that a one year special window has been opened to facilitate the transfer and dematerialisation ("demat") of physical securities sold or purchased prior to April 1, 2019 and also cover transfer requests that were submitted earlier but were rejected, returned or remained unattended due to incomplete documentation, process deficiencies or other reasons.

- The special window will remain open for a period of one year from February 05, 2026 to February 04, 2027
- All such transfers of securities shall be mandatorily credited to the transferee, only in dematerialised form
- Securities so transferred shall be subject to a lock-in period of one year from the date of registration of transfer. Such securities shall not be transferred, pledged or lien-marked during the said lock-in period.

Investors are encouraged to take this opportunity to submit their share transfer requests along with requisite documents to the Company's Registrar and Transfer Agent, M/s Aarthi Consultants Pvt Ltd, 1-2-285, Domalguda, Hyderabad-500029, Telangana. Contact: 040-27638111, 27634445, Fax: 040-27632184, Email: info@aarthiconsultants.com

Details of this notice and list of requisite documents are available on the website of NMDC Limited www.nmdc.co.in under Investors section - Dividend and Shares.

Place: Hyderabad
Date : 08.07.2026

For NMDC Limited
Sd/-
Pravin Shekhar
Company Secretary

వార్త

చెడు మంత్రి వల్ల రాజు, చెడు సహవాసం వల్ల మంచి అలవాట్లు, చరిత్రహీనత వల్ల సంపదలు నాశనమవుతాయి.

- ఇబ్బన్

# దుష్కృత్యానికి చెంపదెబ్బ!

దేశం యావత్తును తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన అహ్మదాబాద్ బాంబు పేలుళ్ల కేసులో కింది కోర్టు తీర్పును గుజరాత్ హైకోర్టు ఖాయం చేసింది. 38 మందికి ఉరిశిక్ష, 11 మందికి జీవితఖైదును ఖాయపరుస్తూ తీర్పు చెప్పింది. సుమారు 70 నిమిషాల వ్యవధిలో అహ్మదాబాద్ నగరాన్ని అతలాకుతలం చేసిన 21వరుస బాంబు పేలుళ్ల దుర్ఘటనలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 46 మంది గాయపడ్డారు. భారతదేశ చరిత్రలో అత్యంత భయానక ఉగ్రదాడిగా నిలిచిపోయింది. స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా 'సిమి' మాజీ నాయకుడు సఫ్దర్ నాగోరి, మరికొందరితో ఏర్పాటు చేసిన ఇండియన్ ముజాహిదీన్ ఈ పేలుడు సంఘటనలకు సూత్రధారులు. కాగా శిక్షపడిన నేరస్థులందరూ హైకోర్టులో అప్పీల్ చేసుకుని వాదించుకోవడం విశేషం. 2002 గోద్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు పోలీసు దర్యాప్తులో తేలింది. కొందరు నిందితులు సమర్థించుకున్నారు కూడా. వీరిపై దేశద్రోహం, ఉగ్రవాద కార్యకలాపాలు, పేలుడు పదార్థాల చట్టం, హత్యాకావించడం వంటి నేరారోపణలపై వారం దరి మీద అహ్మద్ పోలీసులు 35 ప్రాథమిక సమాచార నివేదికలు దాఖలు చేయగా ఒకే మూస కేసులుగా విచారణ జరిగింది. మొత్తం 78 మంది నిందితులపై విచారణ జరుగగా 49 మందిని దోషులుగా నిర్ధారించింది. తగిన ఆధారాలు లేవన్న కారణంగా 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఒకరు అప్రూవర్‌గామారారు. దాదాపు 13ఏళ్లపాటు విచారణ అనంతరం అహ్మదాబాద్ ప్రత్యేక సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎ.ఆర్.పటేల్ ఫిబ్రవరి 8, 2022న తీర్పు వెలువరించి అదే నెల 18న శిక్షలు ఖరారు చేశారు. 38 మందికి ఉరిశిక్ష, 11 మందికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు. ఒక ఉగ్రవాద కేసులో ఇంత పెద్ద సంఖ్యలో ఉరిశిక్షలు విధించడం భారత న్యాయ చరిత్రలోనే అరుదైన విషయం. 7వేలకుపైగా పేజీల తీర్పులో ప్రస్తావించిన ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకొని శిక్షలు విధించారు. ఈ కేసులో నిందితులను సభ్యసమాజంలో తిరుగనివ్వడమంటే మానవ మాంసానికి తహతహలాడే చిరుతను వారిపైకి వదిలి పెట్టినట్లే అవుతుందని కోర్టున్యాయమూర్తి వ్యాఖ్యానించారు. భారత రాజ్యాంగం పట్ల ఏమాత్రం గౌరవభావం లేని నిందితులు ప్రజాస్వామ్యవ్యవస్థను కూల్చివేయాలనే ఉద్దేశంలోనే ఈ దురాగతానికి పాల్పడ్డారని కోర్టు అభిప్రాయానికి వచ్చింది. ఇలాంటి నేరాలను అతిసాధారణ నేరాలుగా ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని కోర్టు అభిప్రాయపడింది. దేశంలో ఉగ్రవాదాన్ని, వాటి ఛాయల్ని తుడిచిపెట్టాలన్న సంకల్పంతో, ఇతరులకు ఇలాంటి కేసుల్లో శిక్షలే భయపెట్టించాలని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. కేవలం నిందితులను శిక్షించడం ద్వారా వారిని సత్ప్రవర్తన వైపు మళ్లించాలన్నది న్యాయవ్యవస్థ ప్రధాన సిద్ధాంతం. కానీ అహ్మదాబాద్ ఘోరకలికి బాధ్యులైనవారు క్షమార్హులు కాదనే సందేశాన్ని ఈ తీర్పు స్పష్టంచేస్తోంది. వందమంది దోషులు తప్పించుకున్నా పర్వాలేదు, కానీ ఒక్క నిర్దోషికి కూడా శిక్ష పడకూడదన్న' న్యాయ సిద్ధాంతం నేపథ్యంలోనే ఈ అంశంపై దోషులను గుర్తించి సిద్ధపడడానికి బాగా సమయం తీసుకోవాల్సి వచ్చింది. సంఘటనకు బాధ్యులుగా భావించి గుర్తించిన నిందితుల్లో 28 మంది నిందితులను కోర్టు నిదానంగా ఒక్కొక్కరి పాత్రను సమీక్షించింది. ఉగ్రవాదం వంటి అత్యంత హీనమైన కేసుల్లో కేవలం సందేహాల కారణంగా శిక్ష విధించరాదని కోర్టు అభిప్రాయపడుతూనే బలమైన సాక్ష్యాధారాలుఉన్నవారినే నిందితులుగా నిర్ధారించింది. సుదీర్ఘకాలం సాగిన దర్యాప్తులో కేసులో ప్రధాన సాక్ష్యాల గుర్తింపు, పేలుడు పదార్థాలు, ఆయుధాల స్వాధీనం వంటి అంశాల్లో దర్యాప్తులో కొన్ని లోపాలున్నాయని ప్రతివాద న్యాయవాదులు ఈ కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించారు. అయినా నిజమైన నిందితులను గుర్తించడంలో కిందికోర్టు బాగా ప్రయాసపడినట్లే! సాక్ష్యాల సమగ్ర పరిశీలన అనంతరమే నిందితుల పాత్రను నిర్ధారించుకున్న తర్వాతనే వారిపై అభియోగాల ఖరారు, పాత్ర, శిక్షార్హతపై పలు చర్చలు కూడా నడిచాయి. ప్రత్యేక కోర్టులు ఉరిశిక్ష విధిస్తే న్యాయప్రక్రియలో హైకోర్టు శిక్షలు ధృవీకరించాల్సి ఉంటుంది. అదే ఇప్పుడు జరిగింది. దీనికి మరో మజిలీ సుప్రీంకోర్టు. ఏ నిరపరాధి శిక్షించబడకూడదు. ఏ అపరాధీ తప్పించబడకూడదనే న్యాయసూత్రంతో న్యాయప్రక్రియమిళితమై ఉంది. దుస్సంఘటన, దురాగతం ఏ స్థాయిలో ఉన్నా, ఎవరు నిందితులెవరైనా ఏదో ఒకనాడు శిక్షలను అనుభవించాల్సిందే. ఉగ్రవాదంపై రాజీ ఉండబోదన్న సంకల్పానికి ప్రతీకగా గుజరాత్ అహ్మదాబాద్ పేలుళ్ల సంఘటన విచారణ చట్టబద్ధంగా సాగింది. సాక్ష్యాధారాల సేకరణ, నిందితుల హక్కుల పరిరక్షణ కూడా ఈ కేసులో ప్రధానంగా పాటించారు. ఇలాంటి ఉదంతాలు జరగకుండా నిఘా వ్యవస్థ మరింత పటిష్టంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని కూడా ఈ సంఘటన గుర్తు చేస్తోంది. ఆనాటి దుర్ఘటనకు బలైన కుటుంబాలకు హైకోర్టు పరిహారాలను ప్రకటించడం మానవతా దృక్పథంతో కూడినదే. విచారణ కాలంలో 9 మంది న్యాయమూర్తుల ముందు 1163 మంది సాక్షులను విచారించగా చివరకు ప్రత్యేక కోర్టు తీర్పును గుజరాత్ హైకోర్టు ఆ శిక్షలను సమర్థించడం ఆహ్వానించదగినది. ఆనాటి ఘటనలు ఎంతో అమానుష కృత్యంగా భావించి యావత్తుభారతదేశం తల్లడిల్లిపోయింది. జస్టిస్ అల్పేష్ కోగీ, జస్టిస్ సమీర్ జె దవే కూడిన అహ్మదాబాద్ డివిజన్ బెంచి స్పెషల్ కోర్టు తీర్పును కూలంకషంగా పరిశీలించింది. దుష్కృత్యాలు ఏ రూపంలో జరిగినా వాటి వెనుక ఉన్న ముష్కరులకు శిక్షలు తప్పవని నేటి తీర్పు తేటతెల్లం చేస్తోంది.

కష్టాల్లో ఉన్నాననీ, తాను హీనుడనీ, ఏమీ సాధించలేననీ, పగలూ రాత్రి అనుకుంటూ ఉండే మనిషి ఎందుకూ కొరగాడు.



వివేకానందుడు

మనిషి గుణాలన్నిటికీ సాహసం మొదలు, సాహసం ఇతర గుణాలకు బాధ్యత వహిస్తుంది.



చర్చిల్

# యుద్ధాలకు దూరం వ్యూహాత్మక సంబంధాలే!

*భారత్ వ్యూహాత్మకంగా సమదూరం పాటించటమే కాకుండా చైనా లాంటి దేశాన్ని న్యూట్రల్గా కొన్నాళ్ళయినా చేయగలుగుతే పాకిస్థాన్ కవ్వింపులు, ఉగ్రవాదాల దాడులను తేలిగ్గా అధిగమించ గలదు! పాకిస్థాన్ బెలూచిస్థాన్ తలనొప్పిని ఎదుర్కొంటూనే పాక్ ఆక్రమిత కాశ్మీర్ తిరుగుబాటుతో అతలాకుతలమవుతున్నది! అందుకనే అంతర్జాతీయంగా దృష్టిమరల్చటానికి మన దేశం మీద ఏదైనా పన్నాగం పన్నే అవకాశం వుంది! మొన్నటి ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ప్రధానమంత్రి జాగ్రత్తగా వ్యవహరించి దౌత్యపరంగా మెరుగైన విధానాలతో భారత్‌కు గౌరవస్థానాన్ని, ఇతర దేశాలు మెచ్చుకొనే విధంగా కల్పించ గలగటంలో కృతకృత్యులయ్యారు! అదే విధంగా ఇప్పుడున్న అనిశ్చిత శాంతి పరిస్థితులలో తప్పటడుగులు మన దేశం వేయదనే నమ్మకం క్రమేపీ బలపడుతున్నది!.*



రావులపాటి సీతారాంరావు

విదేశాంగ వ్యవహారాలు ఎప్పుడు ఏ మలుపు తిరుగుతాయో చెప్పటం ప్రఖ్యాతిగాంచిన విదేశీవ్యవహారాల పండితులకు, విశ్లేషకులకూ సాధ్యపడదు! దానికి కారణం పరిస్థితులు దేశాల నాయకుల చేతుల్లో వుండవు! ఏ క్షణంలో ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేని పరిస్థితులల్లో దేశాల నాయకులు ఎప్పటికి ఏది ప్రస్తుతమో, ఏది అవసరమో చేసుకుంటూ పోకతప్పదు! భారతదేశానికి ఇబ్బందికరమైన పరిస్థితే వచ్చిపడింది! (ఫిబ్రవరి 25-26) అంటే అమెరికా, ఇజ్రాయిల్ కలిసి కట్టుగా ఇరాన్ మీద దాడి చేయకమునుపు (కొద్ది రోజుల తేడా ఫిబ్రవరి 28 నాడు దాడులు మొదలయ్యాయి), యాదృచ్ఛికంగా ప్రధాని మోడీ ఇజ్రాయిల్ రాజధాని టెల్ ఎవివ్‌ను సందర్శించారు! దాడుల తర్వాత ప్రధాని ఇజ్రాయిల్ పర్యటన ప్రత్యక్ష ఇబ్బందులు తెచ్చిపెట్టక పోయినా అనూహ్యంగా ఇజ్రాయిల్, ఇరాన్ దేశాల సంఘర్షణలలో ఎటు మొగ్గాలో (విధిలేని పరిస్థితులలో) అన్న నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందా ఆ పరిస్థితి తప్పదా? అని మన విదేశాంగ శాఖ ఆలోచన చేయక తప్పలేదు! అదృష్టవశాత్తు భారత్ ఆ సంఘర్షణలల్లో భాగంగా మారే పరిస్థితి కలగలేదు! ప్రధాని మోడీ మౌనంగా పరిస్థితులను ఆకళింపు చేసుకొని జాగ్రత్తగా వ్యవహరించటం వల్ల ఆ గండం నుంచి ఒక విధంగా భారత్ బయటపడింది! అయితే ప్రస్తుతానికి ఇబ్బందికరమైన నిర్ణయాలు దాటవేయటం జరిగింది కానీ ముందు ముందు మరింత క్లిష్టంగా ఇజ్రాయిల్ ఇరాన్ సంబంధాలు మారితే భారత్ ఏవిధంగా వ్యవహరించాల్నో, ఆలోచన చేయాల్సిన అవసరం మాత్రం వుంది! ఇరాన్ ప్రధాని అయతుల్లా అలీ ఖొమైనీ అంతిమ సంస్కారాల కార్యక్రమానికి హాజరుకాకపోవటం దేశంలో ఎవరికీ ఆశ్చర్యాన్ని అందుకే కలిగించలేదు. భారత్ పంపిన డెలిగేషన్లో విదేశాంగ శాఖ మినిష్టర్ ఆఫ్ స్టేట్ పబిత్రా మార్గరిటా, బీహార్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అటా హస్నియాన్ (రిటైర్డ్) వుండటం రాజకీయంగా ఇరాన్‌కు నమ్మకం కలిగించటంతో పాటు భారత్ విధానం కూడా చెప్పకనే చెప్పినట్లయింది! ఇరాన్‌తో ఇజ్రాయిల్ సంఘర్షణలు ఈ మధ్య యుద్ధ స్థాయికి రాకమునుపు, ఇండియా ఇజ్రాయిల్ స్నేహ సంబంధాలు బాగానే వుండేవి! ఇరాన్, అమెరికా, ఇజ్రాయిల్ దేశాల మధ్య ఏర్పడిన పరిస్థితుల దృష్ట్యా ఇజ్రాయిల్ తోనూ ఇరాన్ తోనూ సంబంధాలు చాలా దగ్గరగానూ చాలా దూరంగానూ వుండకుండా న్యూట్రల్గా వుండే విధంగా విదేశాంగ విధాన అమలులో చిన్నపాటి మార్పులు చేసుకోక తప్పలేదు! నిజానికి ఇజ్రాయిల్ దేశం మిలటరీ టెక్నాలజీ, ఇంటలిజెన్స్ ఎక్స్పర్టైజ్ ఇండియాకు అందజేసినట్లు, అంతేగాకుండా కౌంటర్ ఇన్‌సర్జెన్సీ, సాంకేతిక నైపుణ్యాన్ని మన దేశ నిపుణులకు తర్ఫీదు లాంటిది ఇచ్చినట్లు మీడియా వార్తలు వున్నాయి! ఈ సంఘర్షణల నేపథ్యంలో అలాంటివి సంబంధాలు బహిర్గతపర్చటం, ఇండియాకు మంచిది కాదు. సమదూరం పాటిస్తున్న వైఖరిని ప్రదర్శించటమే విదేశాంగ విధానంలో అవలంబించాల్సిన పద్ధతి! ఒక విధంగా ఇజ్రాయిల్‌ను కొంచెం దూరంగా పెట్టటం నష్టమైనా తప్పని పరిస్థితి! ఆర్థిక ప్రగతి ఈ యుద్ధాల వల్ల ముఖ్యంగా చమురు దిగుమతుల విషయంలో ఇతర దేశాలలోనే కాదు మన దేశంలో కూడా కుంటుపడిన విషయం అందరికీ తెలిసినదే! మన దేశంతో ఇరాన్‌కు వున్న సంబంధాలు ప్రాచీన నాగరికతకు సంబంధించినవి! ఈ రెండు దేశాలకే ఆ పేరు వుంది. ఈమధ్యకాలంలో దక్షిణ ఆసియా రాజకీయాలలో భారతదేశం ఆచితూచి అడుగు వేస్తుంది



కాబట్టి ఇరాన్‌కు మరింత దగ్గరగా వుండలేక పోయిన వాస్తవాన్ని దాయాల్సిన పనిలేదు! అంతమాత్రాన ఇరాన్‌తో అనేక కారణాల వల్ల అంటీముట్టనట్లుగా వుండాల్సిన అగత్యమూ లేదు! ముఖ్యంగా జలసంధి (హార్ముజ్)లో మన చమురు నౌకల రాకపోకలన్నీ సుహృద్భావ వాతావరణంలో బలపడినవే! అందువల్లే చమురు కొరత సంభవించినా మన దేశం ఆ విషయంలో చాలా తక్కువగానే నష్టపడింది! ఇతర దేశాలతో పోల్చుకోవటం అనవసరం. ఎంతగా పాకిస్థాన్‌మధ్యవర్తిత్వం నెరిపి ఇరాన్ తనకు అత్యంత సన్నిహిత దేశంగా బయటి ప్రపంచానికి తెలియజేసేందుకు ఆదుర్దా పడుతున్నా ఇరాన్, ఇండియా సంబంధాలకు పాకిస్థాన్ అడ్డుతగలలేక పోయింది! ఇండియా స్నేహ సంబంధాలను పాకిస్థాన్ వల్ల ఇరాన్ వొదులుకునే పరిస్థితి లేదు! ఎంతవరకు నిజమో కానీ భారత్‌లో ఇరాన్‌లో వున్న షియా మతస్థుల సంబంధాల నేపథ్యంలో శతృత్వం లేనిమాట నిజం! ప్రతిక్షణం పరిస్థితులు మారేది ప్రపంచ దేశాల మిత్రత్వం వల్లనో శతృత్వం వల్లనో అన్న సత్యం చరిత్ర ప్రతిసారీ జ్ఞాపకం చేస్తూనే వుంటుంది! ఇజ్రాయిల్‌తో అమెరికా సంబంధాలలో తేడాలు వుండకపోవటం వల్లే, ఇరు దేశాల నాయకులు ఇరాన్ దేశాన్ని ఒక పట్టుపట్టాలని చూసారు. సంఘటితంగానే అప్రకటిత యుద్ధం ఘర్షణల రూపంలో మొదలుపెట్టారు! నిజానికి అమెరికా పాలసీ ఈ విషయంలో మారుతుందని ఎవరూ ఊహించలేదు! యుద్ధం మధ్యలో వాషింగ్టను టెల్ ఎవివ్‌కు పొరపొచ్చాలు లెబనాన్ విషయంలో, డోనాల్డ్ ట్రంప్ ఇంటా బయటా యుద్ధం విషయంలో ఎదుర్కొన్న విమర్శల వల్లనో, ఇరాన్ అప్రతిహతంగా ప్రతిఘటించటం వల్లనో ఇప్పుడు సంబంధాలు బెడిసికొట్టాయి! ట్రంప్ ఇరాన్‌ను తేలిగ్గా తీసుకొని, ఇజ్రాయిల్ పి.యం మాటలు నమ్మి అకారణంగా ఇరాన్‌తో వైరాన్ని తెచ్చుకొని, మింగలేని, కక్కలేని పరిస్థితులు ఎదుర్కోవటంతో నెతన్యాహూ (ఇజ్రాయిల్ ప్రైమ్ మినిష్టర్)ను బాహాటంగానే విమర్శించసాగాడు. చివరకు అనేక దేశాల ఆర్థికనష్టాలు హార్ముజ్ జలసంధిపై విధించిన నిబంధనల వల్ల పెరిగిపోయి చమురు, ఇతరఉత్పత్తుల కరవుతో పెక్కుదేశాల్లో యు.యస్.ఏ ఆధిపత్యం బలహీనపడింది! ఇలాంటి పరిస్థితులలో భారత్‌కు వేరే దారిలేదు! కేవలం దౌత్యపరంగా, వ్యూహాలను మార్చుకుంటూ సమన్వయంతో కాలగమనాన్ని వీక్షించటం తప్ప! ఇండియా ఒక విధంగా మెరుగైన స్థితిలో వుండటానికి కారణం అరబ్‌గల్ఫ్ దేశాలకు వెళ్ళినవారు అక్కడ సంపాదించిన డబ్బును మన దేశానికి పంపటం వల్ల సంబంధాలు రోజురోజుకూ ఈ యుద్ధపు నీడలు పడేంతవరకూ చాలా బాగా వుండేవి! ఒక్క సౌదీ అరేబియా మాత్రం పాకిస్థాన్‌తో ఈ మధ్య దగ్గరవుతున్న మాటనిజం! అయినా యునైటెడ్ అరబ్ ఇమరేటస్‌తో మన దేశ సంబంధాలు ఇంకా దృఢంగానే వున్నాయి! ఇప్పుడు భారత్, యూరప్ దేశాలతో పాటు చైనా, జపాన్లతో దగ్గర కాకతప్పదు! చైనాతో ఈమధ్య ఆర్థిక సంబంధాలు పవర్ గ్రిడ్ డీల్స్‌తో పాటు ఎగుమతి దిగుమతులవాణిజ్యం మెరుగుపర్చుకుంటున్నట్లు మీడియాలో వార్తలువస్తున్నాయి. ప్రధాని జపాన్, ఫ్రాన్స్, స్కాండనేవియన్ దేశాలతో సంబంధాలు మరింతగా పెంచుకొనే దిశలో వున్నట్లు వార్తలు వస్తున్నాయి! అమెరికాను మన దేశం అన్నివేళలా నమ్మే పరిస్థితి చాలా తక్కువ. రష్యా, ఉక్రెయిన్ సమస్యతో తీరికలేకుండా వున్నది. పాకిస్థాన్ మాత్రం రష్యా, అమెరికా మాదిరి దగ్గరకు తీసే పరిస్థితి లేదు. రష్యా ఎప్పటికీ భారత్ స్నేహాన్ని వదులుకోదు! ఇరాన్, ఇజ్రాయిల్ దేశాల్లో ఎవరికి దగ్గర కావాలన్నది భారత్ ఆలోచించే ప్రసక్తే లేదు! భారత్ వ్యూహాత్మకంగా సమదూరం పాటించటమే కాకుండా చైనా లాంటిదేశాన్ని న్యూట్రల్గా కొన్నాళ్ళయినా చేయగలుగుతే పాకిస్థాన్ కవ్వింపులు, ఉగ్రవాదాల దాడులను తేలిగ్గా అధిగమించ గలదు! పాకిస్థాన్ బెలూచిస్థాన్ తలనొప్పిని ఎదుర్కొంటూనే పాక్ ఆక్రమిత కాశ్మీర్ తిరుగుబాటుతో అతలాకుతలమవుతున్నది! అందుకనే అంతర్జాతీయంగా దృష్టిమరల్చటానికి మన దేశం మీద ఏదైనా పన్నాగం పన్నే అవకాశం వుంది! మొన్నటి ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ప్రధానమంత్రి జాగ్రత్తగా వ్యవహరించి దౌత్యపరంగా మెరుగైన విధానాలతో భారత్‌కు గౌరవస్థానాన్ని, ఇతర దేశాలు మెచ్చుకొనే విధంగా కల్పించ గలగటంలో కృతకృత్యులయ్యారు! అదే విధంగా ఇప్పుడున్న అనిశ్చిత శాంతి పరిస్థితులలో తప్పటడుగులు మన దేశం వేయదనే నమ్మకం క్రమేపీ బలపడుతున్నది!. ●

# డిజిటల్ మౌలిక వసతుల భద్రతకు జాతీయ కార్యాచరణ

సి.హెచ్.ప్రతాప్

భారత్ వేగంగా డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతోంది. బ్యాంకింగ్, విద్యుత్ పంపిణీ, రైల్వేలు, విమానయానం, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ పరిపాలన, డిజిటల్ చెల్లింపులు, ఇ-వాణిజ్యం వంటి రంగాలు సమాచార సాంకేతికతపై అధికంగా ఆధారపడుతున్నాయి. ఈ మార్పు ప్రజలకు సౌలభ్యం, పారదర్శకత, వేగవంతమైన సేవలను అందిస్తున్నప్పటికీ, సైబర్ ముప్పులు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. అందువల్ల డిజిటల్ మౌలిక వసతుల భద్రత ఇప్పుడు కేవలం సాంకేతిక అంశం మాత్రమే కాదు, జాతీయ భద్రత, ఆర్థిక స్థిరత్వం, ప్రజా విశ్వాసంతో ముడిపడిన అత్యంత కీలక అంశంగా మారింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ గ్రిడ్‌లు, విమానాశ్రయాలు, రైల్వే నియంత్రణ వ్యవస్థలు, బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లు, ఆరోగ్య సమాచార వ్యవస్థలపై సైబర్ దాడులు పెరుగుతున్నాయి. ఇలాంటి దాడులు సేవలకు అంతరాయం కలిగించడమే కాకుండా కోట్లాది ప్రజల వ్యక్తిగత సమాచారం, ఆర్థిక లావాదేవీలు, ప్రభుత్వ సమాచారాన్ని ప్రమాదంలో పడేస్తాయి. డిజిటల్ సేవలపై ప్రజల విశ్వాసం నిలవాలంటే భద్రతా ప్రమాణాలు కాలానుగుణంగా బలోపేతం కావాలి. దేశంలోని కీలక మౌలిక వసతులకు బహుళస్థాయి సైబర్ రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయడం అత్యవసరం. విద్యుత్ పంపిణీ కేంద్రాలు, చమురు, వాయువు నెట్‌వర్క్‌లు, రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థలు, విమానయాన నియంత్రణ కేంద్రాలు, ఆసుపత్రుల డిజిటల్ వేదికలు వంటి వ్యవస్థల్లో క్రమం తప్పకుండా భద్రతా తనిఖీలు నిర్వహించాలి. సైబర్ ముప్పులను ముందుగానే గుర్తించేందుకు నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలు, అత్యవసర స్పందన కేంద్రాలు, భద్రతా ప్రమాణాల నవీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. సాంకేతిక లోపాలను వేగంగా గుర్తించి సరిదిద్దే విధానాలు ప్రతి సంస్థలో తప్పనిసరి కావాలి. ఈ దిశగా క్రమానుగతసైబర్ భద్రతా ఆడిట్‌లు, అత్యవసర పరిస్థితులపై మాక్‌డ్రిల్లులు, ప్రమాద మదింపు కార్యక్రమాలు నిర్వహించడం అవసరం. కీలక మౌలిక వసతులను నిర్వహించే ప్రతిసంస్థకు స్పష్టమైన సైబర్ అత్యవసర స్పందన ప్రణాళిక ఉండాలి. దాడి జరిగిన సందర్భంలో సేవలు ఎంతవేగంగా పునరుద్ధరించగలమనే సామర్థ్యాన్ని కూడా తరచూ పరీక్షించాలి. డేటా బ్యాకప్ వ్యవస్థలు, ప్రత్యామ్నాయ నియంత్రణ కేంద్రాలు, సురక్షిత క్లౌడ్ మౌలిక వసతులు కూడా ఈ వ్యూహంలో భాగం కావాలి. స్వదేశీ సైబర్ భద్రతా సాంకేతికత అభివృద్ధి కూడా కాలానుగుణ అవసరంగా మారింది. విదేశీ సాఫ్ట్‌వేర్‌పై పూర్తిగా ఆధారపడకుండా స్వదేశీ భద్రతా పరిష్కారాలు, గుప్తీకరణ విధానాలు, భద్రతా పరికరాల అభివృద్ధికి పరిశోధనను ప్రోత్సహించాలి. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, సాంకేతిక సంస్థలు, పరిశ్రమలు కలిసి నూతన భద్రతా పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం ద్వారా దేశ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చు. ఈదిశగా నైపుణ్యం కలిగిన సైబర్ భద్రతా నిపుణులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు, ఉన్నత విద్యాకోర్సులు విస్తరించాల్సిన అవసరం ఉంది. కృత్రిమ మేధస్సు ఆధారిత భద్రతా వ్యవస్థలు సైబర్‌రక్షణలో కొత్త అవకాశాలను తెరుస్తున్నాయి. అసాధారణ కార్యకలాపాలను క్షణాల్లో గుర్తించడం, అనుమానాస్పద లావాదేవీలను విశ్లేషించడం, దాడుల నమూనాలను ముందుగానే అంచనా వేయడం వంటి అంశాల్లో కృత్రిమ మేధస్సు సమర్థవంతంగా ఉప యోగపడుతోంది. అదే సమయంలో సైబర్ నేరగాళ్లుకూడా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నందున భద్రతావ్యవస్థలు నిరంతరం నవీకరించబడుతూ ఉండాలి. డిజిటల్ భద్రత ప్రభుత్వ బాధ్యతతో మాత్రమే పరిమితం కాదు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం, సమాచార మార్పిడి, సంయుక్త భద్రతా విన్యాసాలు, అంతర్జాతీయ సహకారం, బలమైన చట్టపరమైన వ్యవస్థ మరింత బలోపేతం కావాలి. ప్రజల్లో కూడా సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించడం అత్యంత ముఖ్యం. బలమైన పాస్‌వర్డ్‌లు వినియోగించడం, అనుమానాస్పద లింకులను నివారించడం, డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండడం వంటి అలవాట్లు వ్యక్తిగత భద్రతకు తొలి రక్షణగా నిలుస్తాయి. సాంకేతిక పురోగతికి సమానంగా భద్రతా ప్రమాణాలను పెంపొందించినప్పుడే డిజిటల్ భారత్ మరింత విశ్వసనీయంగా, సురక్షితంగా, ప్రపంచ స్థాయిలో పోటీపడగల ఆర్థిక శక్తిగా ఎదుగుతుంది. ●

# ప్రజావాక్కు

## వినియోగదారుల రక్షణ నైతిక బాధ్యత

**వాట్సాప్** ప్రతిపాదించిన యూజర్‌నేమ్ ఫీచర్‌పై దేశవ్యాప్తంగా జరుగుతున్న చర్చ ఒకకీలక అంశాన్ని వెలుగులోకి తెచ్చింది. వినియోగదారుల సౌలభ్యం ఎంత ముఖ్యమో, వారి భద్రత అంతకంటే ముఖ్యమనే విషయాన్ని ఈ వివాదం గుర్తు చేస్తోంది. ఫోన్ నంబర్‌కు బదులుగా యూజర్‌నేమ్ ఆధారంగా సంభాషించే అవకాశం కల్పించడం గోప్యతకు మేలు చేసినా, అదే సమయంలో నకిలీ గుర్తింపులు, వ్యక్తుల పేర్లను అనుకరించడం, ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలకుఅవకాశం కల్పిస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈనేపథ్యంలో కేంద్రప్రభుత్వం భద్రతాపరమైన అంశాలపై వివరణ కోరుతూ జాగ్రత్త వైఖరిని అవలంబించడం సముచితమే. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న భారతదేశంలో సామాజిక మాధ్యమ వేదికలు కేవలం చట్టపరమైన నిబంధనలను పాటించడం మాత్రమేకాకుండా, వినియోగదారుల రక్షణను తమ నైతిక బాధ్యతగా భావించాలి. పారదర్శకత, జవాబుదారీతనం, గుర్తింపు ధ్రువీకరణ వంటి ప్రమాణాలను పాటించాలి.

- సి.హెచ్.సాయిరుత్విక్, శ్రీకాకుళం

## అందరికీ విద్యాశక్తి పథకం

**కార్పొరేటివ్** ప్రైవేటు, ప్రభుత్వపాఠశాలలకు చాలా వ్యత్యాసంఉంది. ఉంటుంది, ఉండాలి కూడా. నిజమైన మానవ వికాసం ప్రభుత్వ పాఠశాలల్లోనే జరుగుతుంది. అక్కడ మాత్రమే కరికులర్ ఎగ్స్ట్రా కరికులర్ యాక్టివిటీస్ విశాలమైన పాఠశాల ప్రాంగణంలో ఆహ్లాదకరమైన గ్రామీణ వాతావరణంలో స్వేచ్ఛను ఆస్వాదించగలిగేలా విద్యా బోధన జరుగుతుంది. ఇక్కడ కోచింగ్ కంటే టీచింగ్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యాశాఖ మాత్యులు ఈనాటి కాలానికి తగినట్టుగా విద్యార్థిని విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా విద్యాబోధన జరగాలని భావిస్తూ మార్పులను ఆహ్వానిస్తూ ఒత్తిడి లేకుండా సూచిస్తూ ఉన్నారు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## సర్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

**రాష్ట్రవ్యాప్తంగా** చేపట్టిన ఓటరు ప్రక్షాళన జాబితాను ఓటర్ సవరణలతో పాటు చనిపోయిన వారి ఓట్లు, అనర్హత ఓట్లను తొలగించాలి .ఎన్యూమరేషన్ ఫారం పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత బీఎల్‌ఓలదే. ఫారాలు నింపాల్సిన బాధ్యత కూడా వాళ్లదే.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## రచయితలను ఆదుకోవాలి

ఒక అక్షరం వేయి గుండెలను మేలుకొలుపుతుంది. ఒకపాట ఒక నియంతను గద్దె దింపుతుంది. ఒక పుస్తకం సమాజాన్ని జాగృతం చేసి దేశ ప్రగతికి అవసరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బాటలు వేస్తుంది. పుస్తకాన్ని ఎటువంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయం లేకుండా ఎక్కడైనా ఎప్పుడైనా పాఠకుడు చదవటానికి అవకాశంఉంది. సమాజాన్ని సరైన పంథాలో పెట్టడానికి రాబోయే కాలంలో ప్రజలకు ఎదురయ్యే కష్టాలను ఏకరువు పెట్టడానికి రచయిత తన కాలాన్ని కత్తిలా ఉపయోగించి అక్షరయజ్ఞం చేస్తాడు. ప్రతిఫలాన్ని ఆశించకుండా తన విజ్ఞానాన్ని ఆర్థిక స్థోమతను వినియోగించి రచనలు చేసి ముద్రించి గ్రంథాలను విఫణివీధిలోకి తెస్తున్నాడు. కాని ఆపుస్తకాలు కొనేవారు కరవైపోయారు. ఒక్కో పుస్తకాన్ని ఆవిష్కరించాలంటే కనీసం యాభైవేల రూపాయలు ఖర్చు అవుతుంది. అమ్మకాలు లేక వంద రూపాయలకు కనీసం పదిరూపాయల సొమ్ము కూడా తిరిగి రావడం లేదు. ప్రభుత్వాలు రచయిత గ్రంథాల ముద్రణకు ఎంతో కొంత సహాయం చేయాలి.

- జాన్నభట్ల నరసింహప్రసాద్, నాగారం

## జీవన ప్రమాణాన్ని పెంచే ఉపాధిహామీ

**ఉపాధి** హామీ కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమేనా ప్రజల జీవన ప్రమాణాలను పెంచే శక్తి ఏమైనా ఉందా అని ఆలోచిస్తే ఇది సంక్షేమంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను కచ్చితంగా పెంచుతుందిఅని చెప్పవచ్చు. ఉపాధి హామీ ద్వారా ఆస్తుల సృష్టితో పాటు రైతులఆస్తుల సృష్టి కూడా కచ్చితంగా చెప్పవచ్చు. ఇలాంటి పథకాలు కేవలం సంక్షేమం అనే మూస ధోరణిలో కాకుండా అత్యవసర సమయాలలో కూడా పని చేస్తుంది అని చెప్పవచ్చు. ముఖ్యంగా లాక్‌డౌన్ ఉదంతం తీసుకుంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉండడానికి ఈ పథకమే ముఖ్య కారణం. అందువల్ల ఉపాధి హామీ కేవలం సంక్షేమం మాత్రమే కాదు జీవన ప్రమాణ రేటును పెంచే స్కీమ్ అని నిశ్చితంగా చెప్పొచ్చు.

- భారత అవినాష్, జనగామ

## ఆర్ట్స్ కాలేజీని తరలించవద్దు

మానుకోటలో ప్రస్తుతం నడుస్తున్న రెడ్యాల ఆర్ట్స్ జూనియర్ కాలేజీని అదే ప్రాంతంలో నడపాలి. రెడ్యాల ప్రాంతానికి తరలించవద్దు. గిరిజన పిల్లలు జిల్లాకేంద్రంలో ఉండి చదువుకోవాలి. గ్రామాలకు తరలించడం వలన విద్యార్థులకు టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బందికి ఇబ్బందికరంగా ఉంటుంది.

-కదురు శ్రీనివాస్, వరంగల్


గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# 'వెయిటేజీ'తో ప్రమాణాలకు 'పరీక్ష'!

తిప్పర్తి శ్రీనివాస్

దేశ విద్యా వ్యవస్థలో ప్రవేశ పరీక్షల చుట్టూ చర్చ కొత్తది కాదు. అయితే ఇటీవల నీట్, జేఈఈ వంటి జాతీయ ప్రవేశ పరీక్షలకు 50 శాతం, ఇంటర్మీడియట్ లేదా బోర్డు పరీక్షల మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇవ్వాలనే ప్రతిపాదన మళ్లీ విద్యా రంగంలో చర్చకు దారి తీసింది. ఇది కేవలం ప్రవేశాల విధానానికి సంబంధించిన అంశంమాత్రమే కాదు. దేశంలో పాఠశాల విద్య భవిష్యత్తు, కోచింగ్ సంస్కృతి, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, సామాజిక న్యాయం, ప్రభుత్వ విద్యావ్యవస్థ వంటి అనేక అంశాలను తాకే కీలకమైన సంస్కరణ. గత పదేళ్లుగా దేశంలో ప్రవేశ పరీక్షలే విద్యార్థుల జీవితాన్ని శాసిస్తున్నాయి. వైద్య విద్య కావాలంటే నీట్, ఇంజినీరింగ్‌లో ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చేరాలంటే జేఈఈ. ఈ రెండు పరీక్షల్లో వచ్చిన ర్యాంకులే విద్యార్థి భవిష్యత్తును నిర్ణయిస్తున్నాయి. ఫలితంగా పాఠశాలలు, కళాశాలల్లో జరిగే బోధన కంటే కోచింగ్ సెంటర్లే ప్రధాన విద్యా కేంద్రాలుగా మారిపోయాయి. 'చదువు' అనే పదానికి అర్థమే మారిపోయింది. పుస్తకాలను అర్థం చేసుకోవడం కాదు, ప్రశ్నలను గుర్తించడం. విజ్ఞానం కాదు, వేగం. అవగాహన కాదు, మార్కులు ఇదే నేటి పరిస్థితి. ఇంటర్మీడియేట్ చదివే విద్యార్థి కళాశాలకు వెళ్లేది హాజరుకోసంమాత్రమే. అసలు చదువు కోచింగ్ కేంద్రాల్లోనే జరుగుతోంది. కొందరు విద్యార్థులు రెండు సంవత్సరాల పాటు కుటుంబానికి దూరంగా హాస్టళ్లలో ఉంటూ రోజుకు 14 నుంచి 16 గంటల వరకు కోచింగ్ తీసుకుంటున్నారు. ఇది విద్యకాదు, యాంత్రిక శిక్షణ. విద్యార్థుల బాల్యం, సృజనాత్మకత, ఆలోచనా శక్తి, సామాజిక జీవితం అన్నీ ఈ పోటీలో కనుమరుగైపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బోర్డు పరీక్షలకు 50 శాతం వెయిటేజీ ఇవ్వాలనే ప్రతిపాదనలో సహజంగానే ఆకర్షణ కనిపిస్తుంది. ఎందుకంటే అలా చేస్తే విద్యార్థి ఏడాది పొడవునా చదవాల్సి ఉంటుంది. తరగతి గదిలో బోధనకువిలువ పెరుగుతుంది. ఉపాధ్యాయుల పాత్ర బలపడుతుంది. పాఠశాల విద్య మళ్లీ కేంద్ర బిందువుగా మారుతుంది. కేవలం ఒక రోజు నిర్వహించే పరీక్షతోనే భవిష్యత్తు నిర్ణయమవుతుందనే అన్యాయం కొంతవరకు తగ్గుతుంది. ఒక్కరోజు పరీక్షలో అనారోగ్యం, ఒత్తిడి లేదా ఇతర కారణాల వల్ల విద్యార్థి ఆశించిన ఫలితం సాధించకపోవచ్చు. అంత మాత్రాన అతని రెండేళ్ల శ్రమను కొట్టిపారేయడం సమంజసం కాదు. బోర్డు పరీక్షల మార్కులకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల విద్యార్థి నిరంతర అధ్యయనానికి ప్రోత్సాహం లభిస్తుంది. ఇది విద్యా తత్వశాస్త్రం పరంగా కూడా సముచితమైన ఆలోచనే. అయితే ఈ ప్రతిపాదనకు మరో కోణం కూడా ఉంది. దేశంలో ఒకే విధమైన విద్యా ప్రమాణాలు లేవు. ఒక రాష్ట్ర




బోర్డులో 98 శాతం మార్కులు సాధించడం సాధారణమైతే, మరొక బోర్డులో 90శాతం కూడా సాధించడం కష్టమవుతుంది. కొన్ని బోర్డులు మార్కులను ఉదారంగా ఇస్తుంటే, మరి కొన్ని కఠినంగా మూల్యాంకనం చేస్తాయి. ఈ అసమాన పరిస్థితుల్లో బోర్డు మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇవ్వడం కొత్త అన్యాయాలకు తావివ్వవచ్చు. అదే విధంగా మార్కుల ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం కూడా ఉంది. ఇప్పటికే 95 శాతానికి పైగా మార్కులు సాధించే విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. వెయిటేజీ పెరిగితే ఈ పోటీ మరింత తీవ్రరూపం దాల్చుతుంది. విద్యాప్రమాణాలు మెరుగుపడకపోయినా మార్కులు మాత్రం పెరిగే పరిస్థితి ఏర్పడే ప్రమాదాన్ని విస్మరించలేం. ఈ సందర్భంగా కోచింగ్ పరిశ్రమ గురించి కూడా మాట్లాడాల్సిందే. నేడు వేల కోట్ల రూపాయల వ్యాపారంగా మారిన కోచింగ్ రంగం దేశవిద్యా విధానాన్నే ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంది. తల్లిదండ్రుల ఆర్థిక స్థోమతే కొన్నిసార్లు విద్యార్థి అవకాశాలను నిర్ణయిస్తోంది. లక్షల రూపాయలు ఖర్చు చేయగలిగిన కుటుంబాలకు మెరుగైన కోచింగ్ లభిస్తే, గ్రామీణ ప్రాంతాల్లోని సాధారణ కుటుంబాల పిల్లలు వెనుకబడుతున్నారు. ఇది రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాల స్ఫూర్తికివిరుద్ధం. బోర్డు పరీక్షలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తే ఈ అసమానత కొంతవరకు తగ్గేఅవకాశం ఉంది. ప్రభుత్వ కళాశాలల్లో చదివే ప్రతిభావంతులైన విద్యార్థులకుకూడా అవకాశం పెరుగుతుంది. కానీ దీనికి ముందు దేశవ్యాప్తంగా బోర్డు పరీక్షల్లో ఒకే ప్రమాణాలను అమలు చేయాలి. లేకపోతే ఒక రాష్ట్ర విద్యార్థికి లభించేప్రయోజనం మరో రాష్ట్రవిద్యార్థికిఅందదు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని కూడా ఈ చర్చలో విస్మరించరాదు. ప్రవేశ పరీక్షల ఒత్తిడి కారణంగా ప్రతి సంవత్సరం అనేక మంది విద్యార్థులు తీవ్రమైన ఆందోళన, నిరాశ, మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. విద్య అనేది వ్యక్తిత్వ వికాసానికి దోహదపడాలి తప్ప, జీవితాన్ని భారంగా మార్చకూడదు. దేశవ్యాప్తంగా ఒకేస్థాయి మూల్యాంకన విధానం, మార్కుల సాధారణీకరణ, పారద ర్శక పరీక్షా వ్యవస్థ అమలు చేయడం అత్యవసరం. విద్యా విధానం ఎవరినీ శిక్షించే విధంగా ఉండకూడదు. ప్రతిభను వెలికితీసే విధంగా ఉండాలి. కోచింగ్ కేంద్రాల విజయాన్ని కాదు, పాఠశాల విద్య విజయాన్ని కొలిచే వ్యవస్థను నిర్మిం చాలి. తరగతి గదిలో బోధించే ఉపాధ్యాయుడికి విలువ లేకుండా, కోచింగ్ సెంటర్‌లో బోధించే అధ్యాపకుడే భవిష్యత్తును నిర్ణయించే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ విద్యా వ్యవస్థ క్రమంగా బలహీనపడుతుంది. నీట్, జేఈఈలకు 50 శాతం వెయిటేజీ ఇవ్వాలా వద్దా అన్నది కంటే, దేశానికి ఎలాంటి విద్యా వ్యవస్థ అవసరమన్నదే అసలు ప్రశ్న. విద్యను మార్కుల పోటీ నుంచి జ్ఞాన సాధన దిశగా మళ్లించగలిగితేనే దేశ భవిష్యత్తు బలపడుతుంది. అదే నిజమైన విద్యా సంస్కరణకు తొలి అడుగు. ●

## కేరళలో కొండచరియలు విరిగిపడి ఐదుగురు మృతి

## కేరళ నుంచి కాశ్మీర్ దాకా

# పలు రాష్ట్రాల్లో వర్ష బీభత్సం

### జమ్ముకాశ్మీర్‌లోని కిస్త్వార్ జిల్లాలో వరదలతో అతలాకుతలం

### మూడురోజులుగా మహారాష్ట్రలో జనజీవనం అస్తవ్యస్తం

**ముంబయి,శ్రీనగర్,వాయనాడ్, జులై 7:** దేశంలోని ఉత్తరాది రాష్ట్రాలతోపాటు దక్షిణాది ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు వరద విలయాన్ని సృష్టిస్తున్నాయి. మహారాష్ట్ర, జమ్ముకాశ్మీర్, కేరళల్లో మూడురోజుల నుంచి కురుస్తున్న ఎడతెగని వర్షాలతో జనజీవనం అతలాకుతలం అయింది. ప్రత్యేకించి మహారాష్ట్ర రాజధాని లోతట్టుప్రాంతాలన్నీ జలమయం అయి ఇతర నగర ప్రాంతంతో సంబంధాలు తెగిపోవడంతో ద్వీపంలా మారింది. ముంబైపుణె, ముంబైఅహ్మదాబాద్, ముంబైకొంకణ్‌రహదారులు పూర్తిగా మూసుకుపోయాయి. రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇక ముంబైపుణె ఎక్స్‌ప్రెస్ వేపై కొండచరియలు విరగపడ్డాయి. దాంతో ఆ మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. ముంబైపుణె ఎక్స్‌ప్రెస్ వేలో ట్రాఫిక్ అంతరాయాలను తొలగించేందుకు మిస్సింగ్ లింక్ పేరుతో 13.3 కిలోమీటర్ల బైపాస్‌ను రూ.6,695 కోట్లతో నిర్మించారు. ఇందులో రెండు సొరంగాలు (1.6 కి.మీ., 8.9 కి.మీ.) ఉన్నాయి. ఈ సొరంగ మార్గాన్ని 9 వారాల కిందట ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రారంభించారు. సొరంగం సమీపంలో కొండ చరియలు విరిగిపడ్డాయి. విపత్తు నిర్వహణ సిబ్బంది ఏకంగా 18 గంటల పాటు శ్రమించి ఈ మార్గాన్ని పునరుద్ధరించారు. రుతుపవనాల ప్రభావంతో సోమవారం పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిశాయి. గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వానలు, బలమైన ఈదురుగాలుల కారణంగా రాష్ట్రవ్యా ప్తంగా 13 మంది మరణించగా, మరో 10 మంది గాయపడ్డారు. వందకు పైగా ఇళ్ల దెబ్బతినడంతో వందలాది మంది నిరాశ్రయులయ్యారని రాష్ట్ర విపత్తు నిర్వహణ కేంద్రం తెలిపింది. గడిచిన 48 గంటల్లో రాష్ట్రంలోని తీరప్రాంత, పశ్చిమ ప్రాంతాల్లో వర్షాల తీవ్రత అత్యధికంగా ఉంది. పర్యాటక ప్రాంతమైన లోనావాలాలో గత 48 గంటల్లో ఏకంగా 625 మిల్లీమీటర్ల రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. రాయ్‌గఢ్‌లో 236 మి.మీ., థాణేలో 161 మి.మీ., రత్నగిరిలో 152 మి.మీ., ముంబైలో 100 నుంచి 161 మి.మీ.



భారీ వర్షాలకు జమ్ముకాశ్మీర్‌లో కొండచరియలు విరిగిపడిన దృశ్యం

వరకు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ వర్షాల ధాటికి రాష్ట్రంలోని జలాశయాలు వేగంగా నిండిపోతున్నాయి. అంబా, సావిత్రి, కుండలిక, పాతాళగంగ, ఉల్హాస్ సహా పలు నదులు ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. దీంతో బద్లాపూర్, మోహనే, జాంభూల్‌పాడ ప్రాంతాల్లో వరద హెచ్చరికలు జారీ చేశారు. వర్షాల కారణంగా పలుచోట్ల విషాద సంఘటనలు చోటుచేసుకున్నాయి. ముంబైలోని మాన్‌ఖుర్ద్ ప్రాంతంలో ఓ భవనం మురికివాడపై కూలిపోవడంతో ఆరుగురు మరణించగా, మరొకరు గాయపడ్డారు. చెట్టు కూలి ఒకరు, నీట మునిగి పాల్ఘర్, సింధుదుర్గ్‌లలో చెరొకరు ప్రాణాలు కోల్పోయారు. సతారాలో కొండచరియలు విరిగిపడటంతో ఒకరు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు. భారీ వర్షాల నేపథ్యంలో మాథెరన్, లోనావాలా, ఖోపోలి వంటి హిల్ స్టేషన్లలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో రెడ్ అలర్ట్ ప్రకటించారు. సహాయక చర్యల కోసం రెండు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) బృందాలను మోహరించారు. తలేగావ్‌దాభాడే సమీపంలో వరద నీటిలో చిక్కుకున్న 25 మంది ప్రయాణికులతో ఉన్న బస్సును ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. రాయ్‌గఢ్ జిల్లాలో ఇంటి పైకప్పుపై చిక్కుకుపోయిన ఆరుగురు కుటుంబ సభ్యులను పడవల సాయంతో రక్షించారు. ముంబైగోవా, ముంబైపుణె ఎక్స్‌ప్రెస్‌వేలపై కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మహారాష్ట్రలోని ఒక భాగం ఇలా జలవిలయంతో అల్లాడుతుండగా, మరోవైపు విదర్భ ప్రాంతం మాత్రం వర్షాల కోసం ఎదురు చూస్తోంది. వార్ధా, అకోలా, అమరావతి, యవత్ మాల్, చంద్రపూర్ జిల్లాల్లో ఇప్పటివరకు వర్షాలు కురవకపోవడం గమనార్హం. ముంబై మహానగ రాన్ని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వానలతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. ముఖ్యంగా తూర్పు శివారు ప్రాంతాల్లో గత 48 గంటల్లో ఏకంగా 380 మిల్లీమీటర్ల రికార్డు స్థాయి వర్షపాతం నమో దైంది. ఈ పరిణామాల నేపథ్యంలో బృహన్ ముంబైమున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం అప్రమత్తమై హై అలర్ట్ ప్రకటించింది.

ముంబయి నగరంలో 300మి.మీ.,పశ్చిమ శివార్లలో 345 మి.మీ.వర్షపాతం నమోదైంది. గంటకు 70నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. భారత వాతావరణశాఖ జులై 4నుంచి 6వరకు గతంలో జారీ చేసిన రెడ్ అలర్ట్‌ను మంగళవారం నాటికి ఆరెంజ్ అలర్ట్‌గాసవరించింది. నగరంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. బీఎంసీ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టింది. విపత్తు నిర్వహణ బృందాలు క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తు న్నాయి. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని తొలగించేందుకు హై కెపాసిటీ పంపులను ఏర్పాటు చేశారు.

**కేరళలో టన్నెల్‌వద్ద కొండచరియలు పడి ఐదుగురు మృతి :** కేరళలోని వయనాడ్ జిల్లాలో దారుణ ప్రమాదం జరిగింది. టన్నెల్ వద్ద కొండ చరియలు విరిగిపడిన ఘటనలో ఐదుగురు మరణించారు. మట్టిదిబ్బల కింద మరికొందరు చిక్కుకున్నారు. ఈ ఘటన కేరళలోని వయనాడ్ జిల్లా, మెప్పాడి సమీపంలోని కల్లాడి వద్ద మంగళవారం జరిగింది. స్థానిక మీనాక్షి బ్రిడ్జి వద్ద ఒక టన్నెల్ కోసం తవ్వాలు, నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఆ మట్టిదిబ్బలు, రాళ్ల కింద పలువురు చిక్కుకుపోయారు. వీరిలో ముగ్గురు మరణించారు. ఘటనపై సమాచారం అందుకున్న ఫైర్, రెస్క్యూ బృందాలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు ప్రారంభించాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ ఘటనపై కేరళ సీఎం వీడీ సతీషన్ కూడా స్పందించారు. వయనాడ్ జిల్లా అధికారులతో మాట్లాడారు. తక్షణమే సహాయక చర్యలు ప్రారంభించి బాధితుల్ని కాపాడాలని, వ్యవస్థల్ని సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సహాయక చర్యల్ని పర్యవేక్షించాల్సిందిగా మంత్రులు ఏపీ అనిల్ కుమార్, టీ సిద్ధిఖ్‌లను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా ఇక్కడ టన్నెల్ నిర్మాణ పనుల్ని సోమవారం నుంచే నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో గడిచిన 24 గంటల్లో 265 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**జమ్ముకాశ్మీర్‌ను కుదిపేస్తున్న భారీ వర్షాలు వరదలు**

జమ్మూ కాశ్మీర్‌లోకూడా ఈ భారీ వర్షాలు వరద బీభత్సం సృష్టిస్తున్నాయి. దోడా జిల్లాలో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు జనజీవనాన్ని కకావికలంచేసాయి. రోడ్లు జలమయ మయ్యాయి. థాత్రి, గండోహ్, బలేస్సా ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.


కొండచరియలు విరిగిపడటం, వరద నీరు ఇళ్లల్లోకి చేరడం వల్ల రోడ్లు ధ్వంసమై సాధారణ జనజీవనం స్తంభించింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు సంభవించి వాగులు పొంగిపొర్లడంతో బండరాళ్లు, శిథిలాలు కొట్టుకుపోయి అనేక ఇళ్లు, వాహనాలు దెబ్బతిన్నాయి. వరదల కారణంగా థాత్రి వద్ద దోడాకిష్త్వార్ జాతీయ రహదారి కూడా మూసివేశారు. దీంతో ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.




# టిక్‌టాక్ వల్లే గెలిచా..

### అత్యధిక ఫాలోవర్లు ఉన్న వాడిని నేనే: ట్రంప్

**వాషింగ్టన్,జులై 7:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తన ఘనవిజయానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ టిక్‌టాక్ ఎంతగానో దోహదపడిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చైనా యాజమాన్యంలోని ఈ యాప్ వల్ల జాతీయ భద్రతకు ముప్పు ఉందంటూ వాషింగ్టన్ రాజకీయ వర్గాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నప్పటికీ, ఈ ప్లాట్‌ఫామ్‌లో తనకు ఉన్న ఆదరణే దాని ప్రభావానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో సోమవారం పిల్లల కోసం ట్రంప్ అకౌంట్స్ పథకాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడిన ట్రంప్ టిక్‌టాక్‌లో అత్యధిక ఫాలోవర్లు ఉన్న ఏకైక రాజకీయ నాయకుడిని తానేనని చెప్పుకొచ్చారు. టిక్‌టాక్‌లో నేనే అందరికంటే చాలా ముందున్నాను. నిజం చెప్పాలంటే ఈ యాప్ వల్లే నేను ఎన్నికల్లో ఏకపక్షంగా ఘనవిజయం సాధించానని భావిస్తున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. చైనా యాజమాన్యం కారణంగా ఈ యాప్ వల్ల గూఢచర్య ముప్పు పొంచి ఉందంటూ ఒక టీవీ షోలో చర్చించడాన్ని తాను చూశానని చెప్పారు. పాలసీ మేకర్లు దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయాన్ని ఆయన అంగీకరించారు. అయితే, ఆ వాదనను తోసిపుచ్చుతూ ఒకవేళ ఈ యాప్ అంతగా ప్రభావితం చేయగలిగితే నేను దేశాన్ని ప్రేమిస్తున్నానని, దేశం కోసం ఎన్నో పనులు చేయబోతున్నానని ఇందులో చెబుతున్నాను కదాఅని ట్రంప్ పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన ఆడియన్స్ ర్యాంకింగ్స్‌లో ప్రముఖ సెలబ్రిటీల కంటే తానే ముందున్నానని ట్రంప్ ఈ సందర్భంగా వెల్లడించారు. తాజా గణాంకాల ప్రకారం ప్రముఖ సింగర్ టేలర్ స్విఫ్ట్ 11వ స్థానంలో ఉంటే, నేనే నంబర్ వన్ స్థానంలో ఉన్నానని చెప్పారు. ఇదే సమయంలో టిక్‌టాక్ వ్యవహారంపై తాను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మాట్లాడినట్లు ట్రంప్ బహిర్గతం చేశారు.




## ఇండోనేసియాలో బెంగళూరు ఐఐఎం క్యాంపస్

**జకార్తా,జులై 7:** ఇండోనేసియాలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీమంగళవారం వెల్లడించారు. ప్రస్తుతం మోడీఇండోనేసియాలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఇండోనేసియా ప్రెసిడెంట్ ప్రబోవో సుబియాంటోతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. మోడీ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య ఏఐ, టెలికమ్యూనికేషన్స్, డిజిటల్ వంటి టెక్నాలజీలో యువతకు సహకారానికి ఈ రోజు ఇండోనేసియా, ఇండియా మధ్య ఒప్పందం కుదిరింది. రెండు దేశాల మధ్య స్టార్టప్‌ల సహకారాన్ని కూడా ప్రారంభించబోతున్నాం. ఇండియాలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థ ఐఐఎం బెంగళూరు క్యాంపస్‌ను ఇండియాలో ప్రారంభించబోతున్నామని అన్నారు. ఐఐఎంలకు సంబంధించి విదేశాల్లో ప్రారంభించబోతున్న రెండో క్యాంపస్ ఇది. గతంలో ఐఐఎం అహ్మదాబాద్ క్యాంపస్‌ను దుబాయ్‌లో ఏర్పాటు చేశారు. ఐఐఎంలతోపాటు ఐఐటీ క్యాంపస్‌లు కూడా కొన్ని విదేశాల్లో ఉన్నాయి. ఐఐటీ మద్రాస్ క్యాంపస్‌లు టాంజానియాలోని జాంజిబర్‌లో ఉండగా, ఐఐటీ ఢిల్లీ క్యాంపస్ అబుదాబిలో 2024లో ప్రారంభమైంది. ఎన్ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్ ప్రకారం ఐఐఎంలలో ఐఐఎం అహ్మదాబాద్ మొదటి స్థానంలో ఉండగా, ఐఐఎం బెంగళూరు రెండో స్థానంలో ఉంది. క్యాట్ స్కోర్ ఆధారంగా ఐఐఎంలలో ప్రవేశపరీక్ష నిర్వహిస్తారు. సాధారణంగా క్యాట్ పరీక్ష నవంబర్ చివరి వారంలో జరుగుతుంది. క్యాట్ నోటిఫికేషన్ జూలైలో విడుదలై, ఆగష్టులో ముగుస్తుంది. బ్యాచిలర్ డిగ్రీ పొంది, కనీసం 50 శాతం మార్కులున్న వారు ఐఐఎంలలో ప్రవేశానికి అర్హులు. రిజర్వేషన్ కేటగిరీల వారికి 45 శాతం మార్కులు వస్తే చాలు. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ విభాగాలకు చెందిన విద్యార్థులకు ఫీజు రూ.1,300 కాగా, ఇతరులకు రూ.2,600.



### టిసిఎస్ మతమార్పిడి కేసులో

## నిందితురాలు నిదాఖాన్‌కు బెయిల్

**నాసిక్,జులై 7:** టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అనుబంధ బీపీవో యూనిట్‌లో జరిగిన మత మార్పిడి, లైంగిక వేధింపుల కేసులో ప్రధాన నిందితురాలైన నిదాఖాన్‌కు నాసిక్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అరెస్ట్ అయిన దాదాపు రెండు నెలల తర్వాత ఆమెకు ఈ చట్టపరమైన ఊరట లభించింది. నాసిక్ రోడ్ కోర్టు అదనపు సెషన్స్ జడ్జి కె.జి.జోషి ఈ ఉత్తర్వులు జారీ చేశారు. నిదా ఖాన్‌తో పాటు ఈ కేసులో సహ నిందితుడిగా ఉన్న తౌసిఫ్ అత్తార్‌కు కూడా కోర్టు బెయిల్ ఇచ్చింది. అయితే, ఇదే కేసులో ఉన్న మరో కీలక నిందితుడు డానిష్ షేక్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను మాత్రం న్యాయస్థానం తీవ్రంగా తిరస్కరించింది. టీసీఎస్ నాసిక్ బీపీవో యూనిట్‌లో టెలికాలర్‌గా పని చేసిన నిదాఖాన్, ఈ కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత దాదాపు 42 రోజుల పాటు పోలీసులకు దొరకకుండా పరారయ్యారు. అనంతరం మే నెలలో ఛత్రపతి శంభాజీనగర్‌లో పోలీసులు ఆమెను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.తాను ప్రస్తుతం గర్భవతిగా ఉన్నానని, జైలులోఇబ్బందులు పడుతున్నానని పేర్కొంటూ వైద్యకారణాల రీత్యా ఆమెబెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. బాధితురాలికి నిదాఖాన్ బురఖా, ఇస్లామిక్ మతపరమైన పుస్తకాలను ఇవ్వడంతోపాటు, ఫోన్‌లో మతపరమైన యాప్స్ ఇన్‌స్టాల్‌చేసి మతమార్పిడికి ప్రేరేపించిందని,వాట్సాప్ గ్రూపులద్వారా ఒత్తిడి తెచ్చిందని పోలీసులుఆరోపించారు. చార్జ్‌షీట్ దాఖలు కావడం,ఆమె గర్భందాల్చిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుని కోర్టుబెయిల్ మంజూరు చేసింది.

## ట్రస్టు అధీనంలో 30 కిలోల బంగారు ఆభరణాలు

### 1518 కిలోల వెండి వస్తువులు: కోశాధికారి గోవింద్‌దేవ్ గిరి వెల్లడి

**అయోధ్య,జులై 7:** శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఇవాళ కీలక ప్రకటన చేసింది. తమ ట్రస్టు ఆధీనంలో సుమారు 30 కిలోల బంగారు వస్తువులు ఉన్నట్లు తెలిపింది. సుమారు 1518 కేజీల వెండి వస్తువులు ఉన్నట్లు ఆ ట్రస్టు ట్రెజరర్ స్వామి గోవింద దేవ్ గిరి తెలిపారు. అయోధ్య రామాలయంలో విరాళాలను చోరీ చేసిన ఘటనలో 8 మంది అరెస్టు అయిన విషయం తెలిసిందే. ఆ కేసులో ఇంకా దర్యాప్తు జరుగుతున్నది. భక్తులు సమర్పించిన విరాళాలను చోరీ చేసినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఇవాళ స్పందించింది. దేవాలయానికి ఇప్పటి వరకు 2926 విలువైన వస్తువులను కానుకలుగా సమర్పించారని, అవన్నీ సురక్షితంగా ఉన్నాయని, వాటికి సంబంధించిన రికార్డులను కూడా మెయిన్‌టేన్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. బంగారంతో తయారు చేసిన రామచరితమానస్, డైమండ్ నెక్లెస్ కూడా అదృశ్యమైనట్లు వచ్చిన వార్తలను ట్రస్టు



కొట్టిపారేసింది. ఆ కానుకలను మీడియా ముందు ప్రదర్శించింది. స్వామివారికి చెందిన వెండి చరణ పాదుకలు, కాకభుషుండి కళాకృతి మిస్సైనట్లు సోషల్ మీడియాలో వ్యాపిస్తున్న వార్తలను ట్రస్టు కొట్టిపారేసింది. ఆ కానుకలను కూడా మీడియా ముందు ట్రస్టు ప్రదర్శించింది. ప్రతి వస్తువు వివరాలను ఇన్వెంటరీలో పొందుపరిచామని, ఆ వస్తువును విరాళం ఇచ్చిన దాత పేరు కూడా తమ వద్ద ఉన్నట్లు గిరి తెలిపారు. వెండి కాకభుషుండి వస్తువు ఆలయ ఆధీనంలో ఉన్నట్లు గిరి చెప్పారు. 2024 మార్చి 31వ తేదీ వరకు రామమందిరానికి సుమారు 16.765 కిలోల బంగారు వస్తువులు కానుకలుగా వచ్చినట్లు ఆయన తెలిపారు.

ఇక 2024-25లో 10.445 కిలోల బంగారం, 2025-26లో 5.050 కిలోల బంగారం కానుకల రూపంలో వచ్చిందన్నారు. 2026 మార్చి 31వ తేదీ వరకు ఆలయానికి మొత్తం 32.259 కిలోల బంగారం అందినట్లు గిరి వెల్లడించారు. వెండి వస్తువులను కరిగించిన తర్వాత ఆలయం వద్ద మొత్తం 849 కేజీల రిఫైన్డ్ సిల్వర్ ఉన్నట్లు ఆయన చెప్పారు. ఇక ఈ ఏడాది మార్చి 31 వరకు మొత్తం 1518 కిలోల వెండి ఆలయం వద్ద ఉన్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఏడాది చార్టెడ్ అకౌంట్‌తో ఆ వస్తువులను వెరిఫై చేయిస్తున్నట్లు గిరి తెలిపారు.


## ఈ25 ఇథనాల్ పెట్రోల్‌పై అపోహాలు నమ్మొద్దు

### ప్రచారంపై స్పష్టత ఇచ్చిన కేంద్రం

**న్యూఢిల్లీ,జులై 7:** దేశవ్యాప్తంగా 25 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ25)ను త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అటువంటి ప్రతిపాదన ఏదీ ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ వదంతుల నేపథ్యంలో వాహనదారుల్లో నెలకొన్న ఆందోళనలను నివృత్తి చేసే ప్రయత్నం చేసింది. ఈ25 ఇంధనాన్ని తక్షణమే అందుబాటులోకి తీసుకువస్తున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని కేంద్రం ఉద్ఘాటించింది. వివిధ వాహన మోడళ్లపై ఈ25 మిశ్రమం యొక్క అనుకూలతపై ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతున్నాయని, పూర్తిస్థాయి నివేదికలు అందిన తర్వాతే దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఈ20 (20 శాతం ఇథనాల్) పెట్రోల్ సురక్షితమైనదని, అది సమర్థవంతంగా పనిచేస్తోందని వారు తెలిపారు.

ముడి చమురు దిగుమ తులు తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ, మరి యు చెరకు రైతులను ఆదుకోవడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే నిర్ణీత గడువు కంటే ముందే భారత్ ఈ20 లక్ష్యాన్ని చేరుకుంది. ఈ20 పెట్రోల్ వాడకం వల్ల మైలేజీ తగ్గడం, పాత వాహనాల ఇంజిన్ల పనితీరు దెబ్బ తినడం వంటి ఆందోళనలు సామాజిక మాధ్య మాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమం లోనే ఈ25 వస్తుందనే వార్తలు వాహనదారుల్లో మరింత ఆందోళన రేకెత్తించాయి. ఇటీవల ప్రభుత్వం ఈ22 నుంచి ఈ30 వరకు ఇథనాల్ మిశ్రమాలపై ఎక్సైజ్ సుంకం మినహాయింపు ఇవ్వడంతో ఈ25 త్వరలోనే వస్తుందనే ఊహాగానాలు పెరిగాయి.

ఈ20 తర్వాత ఏ నిర్ణయం తీసుకున్నా అది దశలవారీగా ఉంటుందని, వాహన తయారీ సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం ఉంటుందని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ధృవీకరించని సమాచారాన్ని నమ్మి ఆందోళన చెందవద్దని కేంద్రం ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.



# సంక్షిప్త వార్తలు

## సింధూ జలాల్లో వాటా కోసం గట్టి చర్యలు: పాక్ ఆర్మీ

**ఇస్లామాబాద్, జులై 7:** సింధూ జలాల ఒప్పందాన్ని (ఐడబ్ల్యుటి) భారత్ పక్కనబెట్టడంతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ ఒప్పందం ప్రకారం తమ దేశానికి రావాల్సిన సింధూ జలాల వాటాను పొందేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని 276వ కోర్ కమాండర్ల సమావేశంలో పాక్ తన నిర్ణయాన్ని వెల్లడించింది. ఆ దేశ రక్షణ దళాల అధిపతి అసిమ్ మునీర్ అధ్యక్షతన జరి గిన ఈ సమావేశంలో ప్రభుత్వ ఆదేశాలు, దేశ ప్రజల ఆకాంక్షల మేరకు సింధూ జలాల కోసం పోరాడుతామని సైన్యం తెలిపింది. 2025 ఏప్రిల్ 24 నాటి జాతీయ భద్రతా కమిటీ (ఎన్ఎస్‌సి) ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం సింధూ జలాలను ఆపే ఎటువంటి ప్రక్రియనైనా యుద్ధ చర్యగా పరిగణిస్తామని తెలిపింది.

## సిఎం విజయ్‌కి హైకోర్టు నోటీసులు

**చెన్నై, జులై 7:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఎన్నికను సవాల్ చేస్తూ డిఎంకె అభ్యర్థి ఇనిగో ఇరుదయరాజ్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, మంగళవారం విచారణకు వచ్చింది. విజయ్‌తోపాటు మంత్రి ఆదవ్ అర్జున గెలుపుపై వచ్చిన పిటిషన్లను కూడా జస్టిస్ వి.లక్ష్మీనారాయణన్ ధర్మాసనం విచారణకు స్వీకరించింది. పిటిషన్లలో ఉన్న కొన్ని సాంకేతిక లోపాలను వారం రోజుల్లోగా సరిదిద్దాలని కోర్టు ఆదేశించింది. ఆ ప్రాసెస్ పూర్తి కాగానే విజయ్‌తో పాటు మంత్రికి మూడువారాల గడువిస్తూ రిజిస్ట్రీ నోటీసులు జారీ చేయనుంది. అయితే, ఈ వ్యవహారంలో హైకోర్టు జడ్జి ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా యేళ్ల తరబడి సాగే ఈ ఎన్నికల పిటిషన్ల విచారణను అత్యంత వేగంగా, కేవలం ఆరు నెలల లోపే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.


## కాక్రోచ్ పార్టీ 'ఎక్స్' ఖాతాను పునరుద్ధరించండి: ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, జులై 7:** 'కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) 'ఎక్స్' ఖాతాను పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దేశంలో తమ ఖాతాను నిలిపివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం విచారిస్తూ జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఈ ఆదేశాలు జారీ చేశారు. కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, జూన్ 21న జరిగిన నీట్ రీఎగ్జామ్‌కు ముందు ముందస్తు జాగ్రత్త చర్యగా ఆ ఖాతాను నిలిపివేసినట్లు కోర్టుకు తెలిపారు. ఆ ప్లాట్‌ఫారమ్‌లోని కొన్ని పోస్టులు లక్షలాది మంది అభ్యర్థులు, వారి తల్లిదండ్రులలో గందరగోళం, ఆందోళనను కలిగించే అవకాశం ఉందని ఆయన వాదించారు. పరీక్ష పూర్తయినందున, ఆ 'ఎక్స్' ఖాతాపై ఆంక్షలు తొలగించడానికి ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరం లేదు అని మెహతా పేర్కొన్నారు.

## లోక్‌సభ ముందుకు జస్టిస్ యశ్వంత్ వర్మ కేసు నివేదిక

**న్యూఢిల్లీ, జులై 7:** అవినీతి ఆరోపణల నేపథ్యంలో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన అలహాబాద్ హైకోర్టు మాజీన్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు కమిటీ రూపొందించిన నివేదికను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ స్పీకర్ ఓంప్రకాష్ బిర్లా నిర్ణయించారు. అయితే, అప్పటికే రాజీనామా చేసిన న్యాయమూర్తిపై పార్లమెంట్ ఎలాంటి చర్యలు తీసుకోగలదనే అంశంపై ఇప్పుడు సరికొత్త రాజ్యాంగపరమైన చర్చ తెరపైకి వచ్చింది. గతంలో జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో లెక్కల్లో చూపని నగదు కట్టలు దహనమైన వ్యవహారం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. దీంతో ఒత్తిడికి గురైన ఆయన, ఏప్రిల్ 9వ తేదీన తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

## అవినీతికేసులో చైనా మాజీ అధికారికి మరణశిక్ష




**బీజింగ్,జులై 7:** చైనాలో భారీ అవినీతి కేసులో మాజీ ఆర్థికాభివృద్ధి అధికారి యాంగ్ యూలిన్‌కు కోర్టు మరణశిక్ష విధించింది. మూడు దశాబ్దాల పాటు అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ.2,800 కోట్లు లంచాల రూపంలో స్వీకరించినట్లు కోర్టు తేల్చింది. ఇటీవలి కాలంలో చైనాలో వెలుగుచూసిన అతిపెద్ద అవినీతి కేసుల్లో ఇదొకటిగా నిలిచింది.యాంగ్ యూలిన్ 1993 నుంచి 2023 వరకు పలు ప్రాజెక్టులు, వ్యాపార అనుమతులు, భూముల కేటాయింపులు, వర్కింగ్ క్యాపిటల్‌కు సంబంధించిన అంశాల్లో సాయం చేస్తూ భారీగా లంచాలు తీసుకున్నట్లు చాంగ్‌జౌ ఇంటర్మీడియట్ పీపుల్స్ కోర్టు వెల్లడించింది.

## సియా,చేతన్‌ల రహస్య వివాహం

### కేతన్ హత్యకేసులో రోజుకో ట్విస్ట్

**పూణె,జులై 7:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పుణె బిజినెస్‌మ్యాన్ కేతన్ అగర్వాల్ హత్య కేసులో మరో ట్విస్ట్ బయటపడింది. ఈ కేసులో నిందితురాలు సియా, ఆమె ప్రియుడు చేతన్‌ను రహస్యంగా పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. దాంతో ఈ కేసు కొత్త మలుపు తిరిగింది. కేతన్‌తో నిశ్చితార్థం జరిగిన తర్వాతే వీరు వివాహం చేసుకున్నట్లు దర్యాప్తులో తేలిందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కేతన్ అగర్వాల్‌తో సియాకు ఈ ఏడాది ఫిబ్రవరిలో నిశ్చితార్థం జరిగింది. నవంబరులో వివాహం జరిపించేందుకు ఇరు కుటుంబాలు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ పెళ్లి ఇష్టంలేని సియా ఇంట్లో వాళ్లకు చెప్పకుండా నాలుగు నెలల కిందటే పుణెలోని స్థానిక రిజిస్ట్రార్ ఆఫీసులో ప్రియుడు చేతన్‌ను పెళ్లి చేసుకుందట. దీనికి ఇద్దరు స్నేహితులు సాక్షి సంతకాలు చేసినట్లు సమాచారం. కేసు దర్యాప్తులో భాగంగా సియా, చేతన్ ఫోన్లలోని వాట్సప్ సంభాషణలను



పరిశీలించడంతో ఈ విషయం బయటపడినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. దాంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక వివాహ చట్టం కింద వీరికి వివాహ ధ్రువీకరణ పత్రం జారీ అయ్యిందా అనేది వెరిఫై చేస్తున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఈ పెళ్లి ఫొటోలను సియా తన ప్రైవేట్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిందట. ఆ తర్వాత వాటిని డిలీట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. సాంకేతిక బృందాల సాయంతో ఆ ఫొటోలను రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. జూన్ 18న కేతన్ అగర్వాల్ లోయలోపడి ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

## సిఎంను నియంత్రించడమేంటి?

### డిఎంకె పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

**న్యూఢిల్లీ, జులై 7:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను తాము నియంత్రించాలని కోరడమేంటని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కరూర్ తొక్కిసలాట కేసు నేపథ్యంలో డిఎంకె పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి పర్యటనలు, ప్రసంగాలపై ఆంక్షలు విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం, రాజకీయ విభేదాలను పరిష్కరించుకోవడానికి సుప్రీంకోర్టును వేదికగా మార్చొద్దని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలతో డిఎంకె వెనక్కి తగ్గి తన పిటిషన్‌ను ఉపసంహరించుకుంది. కరూర్ తొక్కిసలాట కేసులో సిబిఐ దర్యాప్తు కొనసాగుతున్న సమ యంలో ముఖ్యమంత్రి విజయ్ జులై 10న అక్కడ పర్యటించనున్నారని డిఎంకె కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. మృతుల కుటుంబాలకు ఉద్యోగ నియామక పత్రాలు, ఆర్థిక సాయం అందించే కార్యక్రమం దర్యాప్తులో ఉన్న సాక్షులపై ప్రభావం చూపే



అవకాశం ఉందని వాదించింది. అంతేకాదు టివికె నేత ఆదవ్ అర్జున చేసిన వ్యాఖ్యలపైనా అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రసంగాలు, పర్యటనలపై ఆదేశాలు ఇవ్వాలని కోరింది.అయితే ఈవాదనలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. 'ముఖ్యమంత్రి ఏం చేయాలో కూడా సుప్రీంకోర్టే చెప్పాలా? ఆయన ఈ కేసులో నిందితుడు కాదు. స్వేచ్ఛగా మాట్లాడే హక్కుపైనా ఆంక్షలు కోరుతున్నారా?రాజకీయ ప్రత్యర్థుల వ్యాఖ్యలపై ఈ కోర్టు ఎలాఆదేశాలు ఇస్తుంది? అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. దీంతో డిఎంకె తన పిటిషన్‌ను వెనక్కి తీసు కునేందుకు అనుమతి కోరగా కోర్టు అంగీకరించింది.

## 10 నుంచి దోస్త్ ఇంట్రా కాలేజ్ ఫేజ్

### 13 వరకు అవకాశం.. 14న సీట్ల కేటాయింపు

### దోస్త్ కన్వీనర్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త:** డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)- 2026 ద్వారా ఇప్పటికే మూడో విడతల్లో సీట్ల కేటాయింపును పూర్తి చేశారు. సీట్లు పొందిన వారు కాలేజీల్లో చేరడానికి అవకాశం ఈ నెల 4తో ముగిసింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కాలేజీల్లో చేరిన విద్యార్థులకు అదే కాలేజీలో మరో కోర్సులో చేరేందుకు అవకాశం కల్పిస్తూ ఇంట్రా కాలేజ్ ఫేజ్‌కు అవకాశం కల్పించారు. ఈ నెల 10 నుంచి 13 వరకు ఇంట్రా కాలేజ్ ఫేజ్‌కి అవకాశం కల్పించినట్టు దోస్త్-2026 కన్వీనర్, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంట్రా కాలేజ్ ఫేజ్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 14న సీట్ల అలాట్‌మెంట్‌ను చేయనున్నారు. మెరిట్, రిజర్వేషన్ల అధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని స్పష్టం చేశారు. దోస్త్-2026 మూడు విడత సీట్ల కేటాయింపు పూర్తియి.. విద్యార్థులు కాలేజీల్లో చేరడానికి గడువు ముగిసే నాటికి 1,17,658 మంది కాలేజీల్లో చేరారు. మూడో విడత కేటాయింపు సందర్భంగా కాలేజీల్లో చేరడానికి ఈ నెల 4(శనివారం) వరకు అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం వరకు రాష్ట్రవ్యాప్తంగా దోస్త్ ద్వారా 1,17,658 మంది కాలేజీల్లో చేరినట్టు తెలిసింది. నాన్ దోస్త్ కాలేజీల్లో 21,034 మంది చేరారు. 2026-27 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో 1,38,692 మంది చేరారు.



విద్యార్థుల నిరసన ప్రదర్శనలో ప్రసంగిస్తున్న మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ తదితరులు

## ఫీజుల రీయింబర్స్‌మెంట్ పథకంపై ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలి

### 14న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి:

### మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్ (సైఫాబాద్), జులై 7, ప్రభాతవార్త:** విద్యార్థుల ఫీజుల రీయింబర్స్ మెంట్ పథకంపై నెలకొన్న గందరగోళానికి సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. కళాశాలల యాజమాన్యాల కోర్టు కేసుల మధ్య నలిగిపోతున్న విద్యా ర్థుల భవిష్యత్తుతో చెలగాటమాడరాదని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర విద్యార్థి జెఎసి ఛైర్మన్ వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో ఆనేక మంది విద్యార్థులు మంగళవారం నల్లబ్యాడ్జిలు ధరించి గన్‌పార్కు వద్ద భారీగా నిరసన ప్రదర్శన చేపట్టిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకం ప్రభుత్వ పథకమా? లేక ప్రైవేటు ఫైనాన్స్ పథకమా?, ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించేది ప్రభుత్వం ఇచ్చే బిక్షం కాదని ఇది వారి హక్కు అని స్పష్టం చేశారు. జివొల పేరిట, కమిషన్‌ల పేరిట ప్రభుత్వం కాలయాపన చేయరాదని, వారి జీవితాలతో చెలగాటమాడరాదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి జెఎసి కో-కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు నందగోపాల్, నరసింహ నాయక్, సానియా, నరేష్, సతీష్, ప్రవీణ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## బోగస్ విద్యార్థి సంఘాలు వేధిస్తున్నాయి

### రక్షణ కల్పించాలని డిజిపికి ఫిర్యాదు

### ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్‌రెడ్డి

**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గుర్తింపు పొందిన ప్రైవేటు స్కూల్స్‌లో కొందరు బోగస్ విద్యార్థి సంఘాల పేరుతో వేధిస్తున్నారని, ఆర్‌టీఐ యాక్ట్‌ను భూతంలా చూపుతూ వేధిస్తున్నారని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(ట్రస్మా) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు అసోసియేషన్ మంగళవారం హైదరాబాద్‌లో జనరల్‌బాడీ సమావేశం నిర్వహించి అనంతరం మీడియాతో మాట్లాడారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కె అనిల్ కుమార్, ట్రెజరర్ కె శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ .. స్వచ్ఛందంగా మధ్యతరగతి విద్యార్థులకు విద్యా బోధన అందిస్తున్న ఎకనామికల్ విద్యాసంస్థల పట్ల బోకస్ విద్యార్థి సంఘాలు ఒక శాపంలా మారాయని, మెరుగైన విద్యాబోధన అందించాలా లేకపోతే బోకస్ సంఘాలను ఎదుర్కోవాలా అని ప్రశ్నించారు. గతంలో విద్యార్థి సంఘాల్లో పనిచేసిన వారు బోకస్ విద్యార్థి సంఘాలను పెట్టుకొని ఆర్‌టీఐ యాక్ట్‌ని భూతంలా చూపిస్తూ విద్యాసంస్థలలో ప్రమాణాలు లేవని పేర్కొంటూ అక్రమాలకు పాల్పడుతూ అదే వారి జీవన ఆధారంగా పెట్టుకుని అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారే కాకుండా కుల సంఘాలా పేరు పెట్టుకుని కొని స్కూల్స్‌కి ఎలాంటి సంబంధం లేనప్పటికీ.. వారు కూడా ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. కొందరు స్థానిక ఎంఈవోలను బెదిరించి వారితో ప్రైవేటు స్కూల్స్‌కి లెటర్స్ సర్వ్ చేయించి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని మండిపడానడరు. కొంతమంది జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) అవతారం ఎత్తి ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి వారిని తట్టుకోలేక కొన్ని విద్యాసంస్థలు మూత పడిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.



సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి సమక్షంలో స్టేట్ నోడల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కె.విద్యాసాగర్.

## సిఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన విద్యాసాగర్

**హైదరాబాద్ (బేగంపేట) జులై 7, ప్రభాతవార్త:** సిఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా కె.విద్యాసాగర్ మంగళవారం బాధ్యతలు స్వీకరిం చారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.జి.చిన్నారెడ్డి సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సిఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా బాధ్యతలు నిర్వహించిన దివ్యదేవరాజన్ పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్‌గా బదలీకావడంతో కొత్తగా పోస్టింగ్ అయిన విద్యాసాగర్ కు బాధ్యతలు స్వీకరించారు. ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో డా.జి. చిన్నారెడ్డి వారిద్దరికీ శుభాకాంక్షలు తెలియ జేసారు. దివ్యదేవరాజన్ ఇప్పటివరకు సిఎం ప్రజావాణికి అందించిన సేవలను చిన్నారెడ్డి కొనియాడారు. నూతన స్టేట్ నోడల్ అధికారి కె.విద్యా సాగర్ ఆధ్వర్యంలో సిఎం ప్రజావాణి కార్యక్రమం మరింత సజావుగా సాగుతుందని చిన్నారెడ్డి ఆశాభావం వ్యక్తం చేసారు.

# బిసి స్టడీ సర్కిళ్ల పటిష్టానికి ప్రత్యేక కమిటీ



### 16 నుంచి కులవృత్తుల మేళా

### స్కిల్ డెవలప్‌మెంట్‌తో బిసిలకు మరిన్ని ఉపాధి అవకాశాలు

### ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై అధ్యయనం చేయాలి

### బిసి సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బీసీ స్టడీ సర్కిల్స్ బలోపేతానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 16 నుంచి కులవృత్తుల మేళాను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై అధ్యయనం చేయాలని, స్కిల్ డెవలప్‌మెంట్‌తో బీసీలకు మరిన్ని ఉపాధి అవకాశాలు దక్కేలా చూడాలన్నారు. బీసీ గురుకులాలు, హాస్టళ్ల ప్రారంభమై 20 రోజులు పూర్తయిన నేపథ్యంలో గత సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై బీసీ సంక్షేమ శాఖకు సంబంధించిన కార్యక్రమాలపై సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురుకులాలు, హాస్టళ్ల పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన క్లీన్ అండ్ గ్రీన్ వాతావరణంలో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూను అన్ని గురుకులాలు, హాస్టళ్లలో తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారులు (డీబీసీవోలు) క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు తరచూ గురుకులాలు, హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని సూచించారు. స్టడీ సర్కిల్స్‌లో మరింత నాణ్యత పెంపొందించేందుకు, సివిల్స్‌తోపాటు వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఢిల్లీ, అహ్మదాబాద్ వంటి ఇతర రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న స్టడీ సర్కిల్స్ విధానాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 16 నుంచి హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న కులవృత్తుల మేళాలో అన్ని కులాల సంప్రదాయ వృత్తిదారులకు సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడే కుట్టు మిషన్ పథకం అమలు కోసం సమగ్ర విధి విధానాలను రూపొందించాలని ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి ఉపాధి అవకాశాలను పెంచాలన్నారు. ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై సమగ్ర అధ్యయనం చేసి అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించిన గురుకుల విద్యార్థులకు అందించే ల్యాప్‌టాప్‌ల పంపిణీపై సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ కమిషనర్, గురుకులాల కార్యదర్శి ఆకస్మికంగా గురుకులాలు, హాస్టళ్లను తనిఖీ చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు అందుతున్నాయో లేదో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కాటమయ్య రక్షణ కవచాల శిక్షణ పూర్తి చేసుకొని కిట్లు అందని జిల్లాల్లో వెంటనే పంపిణీ పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమాయదేవి, గురుకులాల కార్యదర్శి సైదులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, మామిడి హరికృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాముని ట్రస్ట్ పేరుతో కోట్లు కాజేశారు

### భక్తుల వద్ద అయోధ్య ట్రస్టు అక్రమాలపై చర్చ జరుపుదాం: విహెచ్

**హైదరాబాద్, జులై 7, ప్రభావార్త:** రాముని ట్రస్ట్ పేరుతో కోట్ల రూపాయలు కాజేశారు బిజెపి కి హిందూ దేశం కావాలి అనే ఆలోచన మాత్రమే ఉంది రాముడిపై భక్తీ లేదని ప్రభుత్వ సలహా దారు వి.హనుమంత రావు విమర్శించారు. మంగళవారం గాంధీభవన్ వి.హనుమంతు రావు మాట్లాడుతూ రాముని గుడిలో ఇంత అన్యాయం జరిగితే బిజెపి నాయకులు ఎందుకు స్పందించడం లేదనీ ప్రశ్నించారు. రాముడు ఒక్క అయోధ్యలోనే ఉన్నాడు అనే ప్రచారం బిజెపి చేసిందే కానీ ఇంతపెద్ద స్కామ్ జరుగుతుంటే మోదీ విదేశాల్లో అవార్డు తీసుకుంటున్నారనీ నిందించారు. అమిత్ షా మోదీ దీనిపై నోరు మెదపడంలేదని అన్నారు. రాముడి విషయం లో కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లు ఎందుకు వ్యవహరి స్తుందనీ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గుళ్ళలో భక్తుల వద్ద అయోధ్యట్రస్టు అక్రమాలపై చర్చ జరుపుదాం మనీ ఆయన పిలుపునిచ్చారు. తిరుపతి దేవస్థానం లో లడ్డూ కల్తీకి సిబిఐ విచారణ జరిగిందనీ తెలిపారు. ఇన్ని వేల కోట్ల అవినీతి జరిగితే బిజెపి ఎందుకు మాట్లాడటం లేదు నా లాంటి భక్తులు అడుగుతున్నారనీ అన్నారు. భద్రాచలం కూడా వెళ్లి దీనిపై చర్చ చేస్తా అని ఆయన ఆగ్రహంతో అన్నారు. రాముని డబ్బుతో అందరూ బంగ్లాలు విల్లాలు కొంటున్నారనీ, బిజెపి మొన్నటి దాకా సీటు చోరీ , ఇప్పుడు పైసా చోరీ , బంగారం చోరీ చేస్తోందని ఆరోపించారు. విదేశాలకు పోవడానికి మోదీ కి టైం ఉంది , రాముని గుడికి పోవటానికి ఎందుకు టైం లేదనీ ప్రశ్నించారు ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ, బిజెపి పరిషత్ ఎంత దోచుకుందో రాముని పేరుతో తెలియాలన్నారు. సిబిఐ ఎంక్వరీ వెయ్యాలి లేదు అంటే దేశం మొత్తం రాముని గుళ్ల లో ఈ చర్చ జరగాలని అన్నారు.

## లేబర్ కోడ్‌పై కార్మికులు, యాజమాన్యం సూచనలతో

# నిబంధనల రూపకల్పన

### సమతుల్య విధానంతోనే పారిశ్రామిక ప్రగతి

### కార్మికులు పరిశ్రమల ప్రయోజనాలు లేబర్ కోడ్ లక్ష్యం

### కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి




**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త:** కార్మికుల సంక్షేమంతోపాటు పరిశ్రమల ప్రయోజనాలను పరిరక్షించేలా సమతుల్య విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని కార్మిక, ఉపాధి, శిక్షణ ఫ్యాక్టరీస్ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. పరిశ్రమలు సజావుగా, లాభదాయకంగా కొనసాగితేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, కార్మికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్మిక చట్టాల పై హైదరాబాద్‌లోని ఎంసిహెచ్ ఆర్‌డి లో మంగళవారం నిర్వహించిన భాగస్వాముల సంప్రదింపుల సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొని మాట్లాడారు. కార్మిక న్యాయస్థానాలకు సంబంధించిన అంశాలు, రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలు, కేంద్ర ప్రభుత్వానికి చేయాల్సిన సిఫార్సులు, రూపొందించాల్సిన నిబంధనలపై విస్తృతంగా చర్చ జరగాలని సూచించారు. యాజమాన్యాలు, కార్మికులు పరస్పరం చర్చించుకొని సహేతుకమైన నిర్ణయాలకు వస్తే పరిశ్రమలకు సానుకూల వాతావరణం ఏర్పడుతుంది. పరిశ్రమలు బాగా నడిస్తే కార్మికులు సంతోషంగా ఉంటారు. పరిశ్రమల విస్తరణతోపాటు కార్మికులకు మరిన్ని సౌకర్యాలు అందించవచ్చని మంత్రి పేర్కొన్నారు. లేబర్ కోడ్స్‌పై పారిశ్రామిక వర్గాలు, కార్మిక సంఘాలు ఎలాంటి సంకోచం లేకుండా తమ సూచనలు, అభిప్రాయాలను వెల్లడించాలని కోరారు. అదే సమయంలో కార్మికుల ప్రయోజనాలను తప్పనిసరిగా దృష్టిలో ఉంచుకోవాలన్నారు.

కార్మికులు, పరిశ్రమలు ఇరువర్గాలకు మేలు చేసే సమతుల్య విధానమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా పరిశ్రమల అవసరాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను సిద్ధం చేసేందుకు పారిశ్రామిక సంఘాలతో నెలలుగా చర్చలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమలకు ఏయే రంగాల్లో, ఎలాంటి నైపుణ్యాలు అవసరమో గుర్తించి యువతకు శిక్షణ ఇచ్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు. కనీస వేతనాల అంశంలోనూ ప్రభుత్వం ఇదే సంప్రదింపుల విధానాన్ని అనుసరించిందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. పారిశ్రామిక సంఘాలు, ఇతర భాగస్వాములతో విస్తృతంగా చర్చించిన తర్వాతే నిర్ణయానికి వచ్చినట్లు చెప్పారు.

గత పదేళ్లుగా కనీస వేతనాల్లో పెంపు లేకపోవడంతో కార్మికుల నుంచి అనేక డిమాండ్లు వచ్చాయని గుర్తుచేశారు. కార్మికుల అవసరాలు, పరిశ్రమల పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని సమతుల్య ప్రతిపాదనను రూపొందించామని తెలిపారు. ప్రభుత్వ ప్రతిపాదనకు సహకరించిన పారిశ్రామిక సంఘాలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. లేబర్ కోడ్స్‌ను హడావుడిగా అమలు చేయాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేదు. ప్రతి అంశంపై సమగ్రంగా చర్చ జరగాలి. అవసరమైతే నిర్దిష్ట అంశాలపై సూచనలను లిఖితపూర్వకంగా ఇవ్వండి. వాటిపై మరోసారి చర్చించి, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయానికి వస్తాం అని కార్మిక సంఘాల నేతలకు, పారిశ్రామిక వర్గాలకు మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించిన పారిశ్రామిక సంస్థల ప్రతినిధులకు, కార్మిక సంఘాల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంజినీరింగ్ బి-కేటగిరీ సీట్లను ఆన్‌లైన్‌లో భర్తీ చేయాలి

### మేనేజ్‌మెంట్ కోటా పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలి

### ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌కు ఎస్ఎఫ్ఐ విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 7, ప్రభావార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో బి కేటగిరీ సీట్లను పూర్తిగా ఆన్‌లైన్‌లో భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని, మేనేజ్‌మెంట్ కోటా పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు నేతృత్వంలో ఎస్ఎఫ్ఐ బృందం మంగళవారం ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో బికేటగిరీ (మేనేజ్‌మెంట్ కోటా) సీట్ల భర్తీని పూర్తిగా పారదర్శకంగా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో బీపీఏ రెండో సెమిస్టర్ పరీక్షల టైమ్‌టేబుల్‌ను విద్యార్థులకు తగిన ప్రిపరేషన్ సమయం కల్పించేలా సవరించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీలో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయన్నారు. బి కేటగిరీ సీట్ల వివరాలు, సీట్ల సంఖ్య, దరఖాస్తుల ప్రక్రియ, ఎంపిక విధానం వంటి సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంచడం లేదన్నారు.

అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉన్నప్పటికీ, అనేక కళాశాలలు ఇప్పటికే బి కేటగిరీ సీట్లను విక్రయించినట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కొన్ని కళాశాలలు పత్రికల్లో ప్రకటనలు ఇస్తున్నప్పటికీ దరఖాస్తు చేసుకునే లింకులను యాక్టివ్‌లో ఉంచడం లేదని, మరికొన్ని కళాశాలలు ఎలాంటి ప్రకటనలు కూడా ఇవ్వకుండా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

అర్హత కలిగిన అనేక మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కన్వీనర్ కోటాలో 70 శాతం సీట్లు ఈఏపీసెట్ ర్యాంకుల ఆధారంగా భర్తీ చేస్తుండగా, మిగిలిన 30 శాతం మేనేజ్‌మెంట్ కోటా సీట్లను మెరిట్ ఆధారంగా భర్తీ చేయాల్సి ఉందని గుర్తు చేశారు. అయితే వాస్తవానికి మెరిట్‌కు బదులుగా భారీ మొత్తంలో ఫీజులు, డొనేషన్లు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చారని విమర్శించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు బి కేటగిరీ సీట్లలో ప్రవేశం కోసం కళాశాలలను సంప్రదిస్తే రూ.8 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఫీజులు, అదనంగా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు డొనేషన్లు డిమాండ్ చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## వర్సిటీలు, డిగ్రీ గెస్ట్‌లెక్చరర్ల వేతనం రూ.50 వేలకు పెంచాలి

### ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జాన్‌వెస్లీ లేఖ

**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని యూనివర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లు, ఫ్యాకల్టీల వేతనం రూ.50వేలకు పెంచాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ ఆయన మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రంలోని యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో గెస్ట్‌లెక్చరర్లుగా, గెస్ట్ ఫ్యాకల్టీగా, పార్ట్ టైమ్‌గా సుమారు 1,240 మంది 20యేళ్లుగా ఎంతో అంకితభావంతో పని చేస్తున్నారని, వారికి కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సాధారణ సెలవులు లేవన్నారు. నెలకు రూ.28వేల వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని, వారు పొందుతున్న తక్కువ వేతనాలతో తమ కుటుంబాలను పోషించుకోలేక, ఇంటి అద్దెలు కట్టలేక, పిల్లలను చదివించుకోలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. నెలకు రూ.50వేల వేతనం పెంచుతామని ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, గెస్ట్ ఫ్యాకల్టీ మంత్రులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం నుండి స్పందన లేదన్నారు. తక్షణమే జోక్యం చేసుకొని వేతనం పెంచాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని సిఎంకు రాసిన లేఖలో జాన్‌వెస్లీ కోరారు. గత ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ పార్టీ, గెస్ట్ లెక్చరర్ల వేతనాన్ని నెలకు రూ.50,000లకు పెంచుతామని హామీ ఇచ్చిందని, కానీ ప్రభుత్వం ఏర్పడి 31 నెలలు దాటినా ఇంకా అమలు కాలేదన్నారు. ప్రస్తుతం అందుతున్న రూ.28వేల వేతనంతో పెరుగుతున్న ధరల వల్ల వారి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవడం అసాధ్యగా మారిందన్నారు.



ఎఐజి ఆస్పత్రి లోపలికి వెళ్తున్న మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తదితరులు

## కెటిఆర్ కుమారుడు హిమాన్షురావుకు గాయం

### ఎఐజి ఆస్పత్రిలో మనవడిని పరామర్శించిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జులై 7, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటి రామారావు కుమారుడు హిమాన్షురావు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆసుపత్రికి చేరుకొని మనుమడిని పరామర్శిం చారు. కేటీఆర్ కుమారుడు హిమాన్షురావు సోమవారం రాత్రి జిమ్‌లో వర్కవుట్ చేస్తూ గాయపడ్డాడు. దీంతో హిమాన్షురావు ముక్కుకు గాయం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం హిమాన్షు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారని, చికిత్స అనంతరం కొన్నిరోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారని హిమాన్షురావు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. కాగా హిమాన్షుకు గాయం జరిగిన విషయం తెలుసుకున్న తండ్రి కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు హరీష్‌రావులు ఆస్పత్రికి చేరుకొని పరామర్శించారు. మనుమడికి జరిగిన గాయం విషయం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవెల్లి ఫాంహౌజ్ నుంచి నేరుగా మంగళవారం మధ్యాహ్నం ఆసుపత్రికి చేరుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మనుమడు హిమాన్షురావును పరామర్శించారు. హిమాన్షుకు జరిగిన గాయం తీ వ్రత, ఆరోగ్య పరిస్థితిని అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం హిమాన్షు ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరంలేదని వైద్యులు సూచించారని కుటుంబసభ్యులు తెలిపారు.

## వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

### జయంతి సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ నివాళి

**హైదరాబాద్, జులై 7, ప్రభావార్త:** ప్రజల సంక్షేమమే ప్రభుత్వ పాలనకు కేంద్రబిందువుగా ఉండాలని ఆచరణలో చూపించిన అరుదైన నాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆయన సేవలు చిరస్మరణీయం అని వైఎస్ జయంతి సందర్భంగా నివాళి తెలుపుతూ టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రజా ప్రస్థానం పాదయాత్ర ద్వారా2004వరకు సాగిన ప్రజాకంటక పాలనలో ప్రజలు అనుభవించిన కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటికి అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలను రూపొం దించి అమలు చేయడం వైఎస్సార్ నాయకత్వ విశిష్టత అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, 108 అత్యవసర అంబులెన్స్ సేవలు, ఫీజు రీయిం బర్స్‌మెంట్, ఇందిరమ్మ గృహాలు, జలయజ్ఞం వంటి పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో మార్పు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రజానేత వైఎస్సార్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కట్టుబడి పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



అంబేద్కర్ విగ్రహం ఎదుట నినాదాలు చేస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

## ఫీజుల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), జులై 7, ప్రభాతవార్త:** లక్షలాది మంది నిరుపేద విద్యార్థులకు చెల్లించే ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తి వేయాలనే కుట్రను ప్రభుత్వం విరమించుకోవాలని, తక్షణమే 8వేల కోట్ల బకాయిలను చెల్లించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆనేక మంది విద్యా ర్థులు లిబర్టి చౌరస్తా నుంచి ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్. అంబేద్కర విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ నిరుపేద కులాల విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడం రాష్ట్ర ప్రభుత్వానికి ఇష్టం లేదని, అందువల్లనే ఫీజుల రీయంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్నదని ఆరోపించారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి ఒక్క విద్యార్థికి ర్యాంకులతో సంబంధం లేకుండా ఫీజులు మంజూరు చేస్తున్నదని, పైగా ప్రతి విద్యార్థికి 15 వేల రూపాయలు స్కాలర్‌షిప్‌లు చెల్లిస్తున్నదని, కాని మన రాష్ట్రంలో ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయకుండా విద్యార్థులను రకరకాల వేధింపులకు గురి చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం కన్వీనర్ నిఖిల్‌పటేల్, నాయకులు శివకుమార్‌యాదవ్, నీల వెంకటేష్, సి.రాజేందర్ ముదిరాజ్ అనంతయ్య, బాలయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.




## ఏఐలో ప్రపంచానికి దిక్సూచిగా తెలంగాణ

### సాంకేతికతకు కేరాఫ్ అడ్రస్ హైదరాబాద్

### డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త :** ఆర్టిఫిషియల్లీ ఇంటిలెజెన్స్ (ఏఐ) రంగంలో ప్రపంచ దేశాలకు తెలంగాణ సరికొత్త దిశానిర్దేశం చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ, సామాజిక ప్రయోజనాలను జోడించి ఏఐ ప్రమాణాలకు దిక్సూచిగా తెలంగాణ నిలుస్తోందని చెప్పారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన గ్రీన్ గ్రోత్ ఎకానమిక్ సమ్మిట్ ది హైదరాబాద్ కలెక్టివ్ కార్యక్రమాన్ని, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమ్మిట్ కు వివిధ దేశాల నుంచి హాజరైన ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ ఏఐ అంటే కేవలం క్లౌడ్ కంప్యూటింగ్, సర్వర్లు మాత్రమే కాదని, దీని వెనుక విద్యుత్, నీరు, భూమి మరియు మానవ వనరుల భాగస్వామ్యం ఉంటుందని ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఏఐ వద్దు అనడం లేదు, కానీ అది ఎలా ఉండాలో ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తున్నామని తెలిపారు. ప్రకృతి వనరులను, ముఖ్యంగా నీరు, విద్యుత్తును హరిస్తూ ఏఐని నిర్మించడం కాకుండా, పునరుత్పాదక ఇంధనం మరియు బాధ్యతాయుతమైన వనరుల నిర్వహణతో తెలంగాణ ఏఐకి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోందని పేర్కొన్నారు. పెట్టుబడులను ఆహ్వానించడంలో తెలంగాణ దూకుడుగా ఉన్నప్పటికీ, అది పర్యావరణానికి మరియు స్థానిక ప్రజలకు మేలు చేసే విధంగా ఉండాలని స్పష్టం చేశారు.

## సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపుపై

### కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపిన డిప్యూటీ సీఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 7:** సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను కేంద్రం కేటాయించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది. మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం కృషి ఫలించిందని అన్నారు. మరో 40 ఏళ్ల పాటు మైనింగ్‌కు అవకాశం ఉందని పేర్కొన్నారు. 340 మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీతకు అవకాశం కలిగిందని చెప్పారు. తాడిచర్ల2లో 434.14 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని వివరించారు ఏడాదికి 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.




ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

## ప్రభుత్వ పాఠశాలల మూసివేత ఆలోచన తగదు

### ప్రైవేటు విద్యాసంస్థలను నియంత్రించాలి.. బడులను బలోపేతం చేయాలి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విద్యావేత్తలు, మేధావుల బహిరంగ లేఖ

**హైదరాబాద్ (చిక్కడపల్లి) జులై 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను కుదించాలనే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని విద్యావేత్తలు, మేధావులు, పౌర సమాజ నేతలు డిమాండ్ చేశారు. బెంగళూరులో జరిగిన ద హిందూ హడల్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదిస్తామని చేసిన ప్రకటనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు 100 మందికి పైగా వివిధ రంగాల ప్రముఖులు సంతకాలు చేసిన బహిరంగ లేఖను మంగళవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో విడుదల చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని 23 వేల బడులను మూసివేసే ఆలోచనను ఉపసంహరించుకోవాలని, ప్రైవేటీకరణను అరికట్టాలని డిమాండ్ చేశారు. సీనియర్ సంపాదకులు కే. రామచంద్రమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వాలు అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలకు భిన్నంగా నడుచుకోవడం సరికాదన్నారు. నాక్ మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ వి.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగం సంక్షోభంలో పడిందని, సామాజిక అవసరాలను గుర్తించకుండా పాఠశాలల మూసివేత ప్రకటన చేయడం దురదృష్టకరమన్నారు. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందనే నెపంతో వాటిని మూసివేయడం తగదని పేర్కొన్నారు. కేంద్ర సమాచార కమిషన్ మాజీ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ సీఎం స్వయంగా విద్యాశాఖను పర్యవేక్షిస్తూ ఇలాంటి తిరోగమన నిర్ణయాలు తీసుకోవడం ఆక్షేపణీయమని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల మూసివేత ప్రకటనను ప్రముఖ కవి, రచయిత డాక్టర్ నందిని సిద్ధారెడ్డి తప్పుబట్టారు.




ఓయులో నిరుద్యోగ జెఏసి, విద్యార్థి సంఘాల భారీర్యాలీ నిర్వహించిన దృశ్యం

## రెండు లక్షల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు ఇవ్వాలి

### ఓయులో నిరుద్యోగ జెఏసి, విద్యార్థి సంఘాల భారీ ర్యాలీ

**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని, అలాగే ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ.1000 కోట్ల నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ జేఏసీ, వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఓయూలో భారీ ర్యాలీ నిర్వహించారు. విశ్వవిద్యాలయ ప్రధాన గ్రంథాలయం నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు విద్యార్థులు, నిరుద్యోగులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఆర్.ఎల్. మూర్తి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా నిరుద్యోగులకు ఇచ్చిన ప్రధాన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బిస్వాల్ కమిటీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో రెండు లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ నియామకాలను ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రకటిస్తామన్న జాబ్ క్యాలెండర్ ఇప్పటికీ రాకపోవడం నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురి చేస్తోందని, వెంటనే పారదర్శకమైన నియామక ప్రక్రియ చేపట్టాలని కోరారు.

# భారత్-ఇండొనేసియాల మధ్య వేల యేళ్ల వారసత్వ బంధం

### ఇండొనేసియా పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం

**జకార్తా, జులై 7:** భారత్ ఇండోనేసియా దేశాలమధ్య బంధం సముద్రంతో కాకుండా వేల ఏళ్ల చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వంతో ముడిపడి ఉందని ప్రధానిమోడీ అన్నారు. ఇండోనేసియా పర్యటనలో ఉన్న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆ దేశ పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించారు. రెండుదేశాల సంబంధాల చారిత్రక, సాంస్కృతిక, వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సముద్రం ఎప్పుడూ రెండు దేశాల్ని విడదీయలేదని, అది ఎప్పటికీ రెండు దేశాల అనుబంధానికి వారధిగా నిలిచిందని చెప్పారు. ప్రధాని ప్రబోవో సుబియాంటోతో జరిగిన చర్చలు ఇరు దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని చెప్పారు. 2018లోనే ప్రారంభమైన ఈ భాగస్వామ్యం ఇప్పుడు అభివృద్ధి, భద్రత, సాంకేతికత, విద్య, సంస్కృతి వంటి ఎన్నో రంగాలకు విస్తరించిందన్నారు. ఈ సందర్భంగానే రామాయణం, మహాభారతం రెండు దేశాల బంధానికి పునాది అని వ్యాఖ్యానించారు. భారత్ ఇండోనేసియాను కేవలం సముద్రం మాత్రమే కలపలేదు. మనకు ఉమ్మడి చరిత్ర ఉంది. రామాయణం, మహాభారతం, నలందా విజ్ఞాన సంపద మన బంధానికి పునాది. వయాంగ్ కళారూపం, నృత్యం, సంగీతం, బొరోబుదూర్, ప్రంబనన్ వంటి అద్భుత కట్టడాలు మన సాంస్కృతిక అనుబంధానికి నిదర్శనం. ఇండోనేసియా జాతీయ చిహ్నమైన గరుడ, బాలి యాత్ర ఉత్సవం కూడా మన



మధ్య ఉన్న బంధాన్ని గుర్తు చేస్తాయని ప్రధాని ఎర్కొన్నారు. భారత్ రాజధాని, ఇండోనేసియా రాజధాని మధ్య వేల కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికీ సముద్ర మార్గంలో కేవలం 150 కిలోమీటర్ల దూరమే ఉందని గుర్తు చేశారు. చాలా దేశాలకు సముద్రమే సరిహద్దు అని, కానీ భారత్ ఇండోనేసియా మధ్య సముద్రం ఎప్పుడూ విభజనకు చిహ్నం కాదన్నారు. అదే మనల్ని కలిపే వంతెన అని, అదే మన భవిష్యత్తుకు కేంద్ర బిందువని ప్రధాని వ్యాఖ్యానించారు. ఇక భారత్ ఎప్పుడూ విస్తరణ వాదాన్ని అనుసరించలేదని, అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుందని ప్రధాని స్పష్టం చేశారు. సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ అనే సిద్ధాంతంతో అందరి భాగస్వామ్యంతో అందరి అభివృద్ధే భారత్ లక్ష్యం అనే సందేశంతో నేను మీ ముందుకు వచ్చానని మోడీ పేర్కొన్నారు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వానికి ఆసియాన్‌లో కీలక పాత్రకు భారత్ ఎప్పుడూ ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిందని మోడీ స్పష్టం చేశారు. సముద్ర భద్రత, ప్రాంతీయ స్థిరత్వం, ఆర్థిక సహకారంతో ఇరు దేశాలు కలిసి పనిచేస్తాయని చెప్పారు.

## అయోధ్య రామాలయంలో 70 సార్లు చోరీ

### సిట్ నివేదికలో ప్రస్తావన

**అయోధ్య, జులై 7:** అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయంలో భక్తులు సమర్పించిన విరాళాల దుర్వినియోగం కేసులో నిందితులు సుమారు 70సార్లు నగదు,ఆభరణాలచోరీకి పాల్పడినట్లు ఆధారాలు లభించినట్లు సిట్ తన నివేదికలో వెల్లడించింది. ఈకేసులో సిట్ దర్యాప్తు మరింత వేగం పుంజుకుంది. ఈ కేసులో మరింత లోతుగా విచారణ చేపట్టేందుకు మరో ముగ్గురు నిందితులను కస్టడీలోకి తీసుకునేందుకు అయోధ్య పోలీసులు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు. పోలీసుల వివరాల ప్రకారం కరుణేశ్ పాండే, అనుకల్ప్ మిశ్రా, లవ్ కుష్ మిశ్రాలను కస్టడీలోకి తీసుకుని విస్తృతంగా విచారించేందుకు కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. ఈ విచారణ ద్వారా విరాళాల మాయంపై మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి ప్రత్యేక



దర్యాప్తు బృందం (ఎస్ఐటీ) సమర్పించిన ప్రాథమిక నివేదికలో ఆలయంలో విరాళాల లెక్కింపు సమయంలో నగదు చోరీ, అక్రమంగా నగదు మళ్లింపు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించినట్లు వెల్లడించింది. దర్యాప్తులో భాగంగా సీసీటీవీ దృశ్యాలు, ట్రస్ట్ అధికారుల వాంగ్మూలాలు, బ్యాంకు అధికారుల ప్రకటనలు, భద్రతా సిబ్బంది, నగదు లెక్కింపు సిబ్బంది వాంగ్మూలాలు, బ్యాంకు రికార్డులు, స్వాధీనం చేసుకున్న పత్రాలు, ట్రస్ట్‌తో కుదిరిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ), ప్రామాణిక నిర్వహణ విధానాలు (ఎస్ఓపీ) తదితర అంశాలను ఎస్ఐటీ పరిశీలించింది. సిట్ నివేదిక ప్రకారం ఏప్రిల్ 27 నుంచి జూన్ 5 వరకు అందుబాటులో ఉన్న సీసీటీవీ దృశ్యాల్లో పలుమార్లు నగదు లెక్కింపు సిబ్బందిలో కొందరు కరెన్సీ కట్టలు, విడి నగదును తమ దుస్తుల్లో, జేబుల్లో, చెప్పుల్లో, ఇతర రహస్య ప్రదేశాల్లో దాచుకుంటున్న దృశ్యాలు నమోదయ్యాయి. అలాగే మరికొందరు ఉద్యోగులు ఈ చర్యలకు సహకరించడం లేదా అటువంటి చర్యలను కప్పిపుచ్చే ప్రయత్నం చేసినట్లు కూడా విడియోల్లో కనిపించినట్లు నివేదిక పేర్కొంది.




## చిన్నారులే దేశ సంపద

### అందుబాటులో మొబైల్ అంగన్వాడీలు

### మహిళా, శిశు సంక్షేమ మంత్రి సీతక్క

**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త :** చిన్నారులే దేశ సంపద, దేశ భవిష్యత్తని, తెలంగాణ-2047 లక్ష్య సాధనలో వీరే కీలక పాత్ర పోషిస్తారని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రి సీతక్క అన్నారు. అందుకే ఏ ఒక్క చిన్నారికీ అంగన్వాడి సేవలు అందకుండా ఉండకూడదనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ అంగన్వాడి కేంద్రాలను ప్రారంభిస్తోందని తెలిపారు. హైదరాబాద్ ఎంసీఆర్ హెచ్ఆర్డీలో మరో మంత్రి వివేక్‌తో కలిసి మహిళా, శిశు సంక్షేమ శాఖ రూపొందించిన మొబైల్ అంగన్వాడి వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు సాంప్రదాయ అంగన్వాడి కేంద్రాలకు వచ్చే చిన్నారులకే పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రీస్కూల్ విద్య, తల్లి శిశు సంక్షేమ సేవలు అందుబాటులో ఉంటున్నాయన్నారు. అయితే అంగన్వాడి కేంద్రాలు లేని ప్రాంతాల్లో నివసించే చిన్నారులు, ముఖ్యంగా పనుల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వలస వచ్చే కార్మికుల పిల్లలు ఈ సేవలకు దూరమవుతున్నారని అన్నారు. అలాంటి ఒక్క చిన్నారి కూడా ప్రభుత్వ సేవలకు దూరం కాకూడదనే లక్ష్యంతో ఈ మొబైల్ అంగన్వాడి కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. అంగన్వాడి కేంద్రాల్లో లభించే అన్ని సేవలు మొబైల్ అంగన్వాడి కేంద్రాల్లో కూడా అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు. పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు, ఎదుగుదల పర్యవేక్షణ, ప్రీస్కూల్ విద్యతో పాటు తల్లి శిశు సంక్షేమానికి సంబంధించిన అన్ని సేవలను ఈ వాహనాల ద్వారా అందిస్తామని చెప్పారు.

## డిల్లీ హైకోర్టులో కవిత పిటిషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జులై 7:** టిఆర్ఎస్ పేరు విషయంలో ఎన్నికల కమిషన్ అభ్యంతరాలపై కల్వకంట్ల కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. టీఆర్ఎస్ పేరును తన పార్టీ పేరుగా ఖరారు చేయాలని పిటిషన్‌లో ఆమె విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్‌తో పాటు ఇతర పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈసీ తెలంగాణ రక్షణ సేన బదులు మరో పేరు తీసుకోవాలని ఇటీవల లేఖ రాసింది. దీనిపై కవిత కోర్టును ఆశ్రయించారు. అయితే ముందుగా జూన్ 23న ఈసీ ఇచ్చిన నోటీసుకు సమాధానం చెప్పాలని దిల్లీ హైకోర్టు సూచించింది.

## ఎల్‌నినోకు ప్రత్యామ్నాయ కార్యాచరణ

### మహిళా సంఘాల ద్వారా ఎరువుల విక్రయాలు

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త :** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ కార్యాచరణ అమలు చేయాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలో వానాకాలం వ్యవసాయ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రైతులకు విత్తనం నుంచి పంట విక్రయం వరకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆయిల్ పామ్ మొక్కల కొరత తలెత్తడం, సరఫరాలో ఆలస్యం జరగడం సరికాదని చెప్పారు. రైతులకు కేటాయించిన మొక్కలు ఆలస్యంగా చేరడం వల్ల సాగు దెబ్బతినకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. డ్రిప్ పరికరాల సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చూడాలన్నారు. మొక్కజొన్న రైతులు తమ పంటను విక్రయించిన తర్వాత చెల్లింపుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఉండకూడదని సకాలంలో నగదు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ అధికారులను తెలిపారు. రైతులకు అవసరమైన సమయంలో యూరియా అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, ఎక్కడైనా



కొరత లేదా రవాణా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని చెప్పారు. అలాగే మహిళా సంఘాల ద్వారా ఎరువుల విక్రయాల సాధ్యాసాధ్యాలను సమగ్రంగా పరిశీలించాలన్నారు. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం ప్రకటించిన మేరకు రైతు భరోసా ప్రయోజనం అందేలా చూడాలని వెల్లడించారు. వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశమున్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతు భరోసా కింద మంగళవారం 7 నుండి 8 ఎకరాలకు వరకు భూమి కలిగిన రైతులకు రూ. 259.73 కోట్లను జమ చేసినట్లు వెల్లడించారు. ఈ విడతలో 58,831 మంది రైతులు, 4.32 లక్షల ఎకరాలకు భరోసా సాయాన్ని పొందారని తెలిపారు.

## రూ.360 కోట్లతో రెవెన్యూ శాశ్వత భవనాలు

### 10 ఆర్డీవో, 107 తహాశీల్దార్, 53 సబ్‌రిజిస్ట్రార్ భవనాల నిర్మాణం

### రెవెన్యూ మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 7:** రాష్ట్రంలో రెవెన్యూ పరిపాలనను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు ఆధునిక, గౌరవప్రదమైన సేవలు అందించాలనే లక్ష్యంతో దశలవారీగా తహాసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. భవనాల నిర్మాణాలపై మంగళవారం నాడు అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలివిడతలో అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న 107 తహసీల్దార్ కార్యాలయాలు, 10 ఆర్డీవో కార్యాలయాలకు 263 కోట్ల రూపాయిలతో అలాగే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి రూ.97 కోట్ల రూపాయిలతో 48 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో డీఐజీ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మొత్తం భవనాల కోసం రెండు విభాగాలకు సంబంధించి 360 కోట్ల రూపాయిలతో పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సౌకర్యాలతో నిర్మించి ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేలా రూపొందిస్తామని చెప్పారు. వీటి నిర్మాణ బాధ్యతను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. హౌసింగ్ అధికారులు జిల్లా స్థాయిలో రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని కొత్త భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సేవలందించే కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మించబడతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఐదు సంవత్సరాల నిర్వహణా బాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన చేయగా నిర్మాణపనులు చురుగ్గా సాగుతున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు.

## టాప్ 5 ఆదాయ రాష్ట్రాల్లో తెలంగాణకు చోటు

### రూ.5,15,297తో మూడో స్థానం

### రూ.93,767.97తో అత్యంత పేద రాష్ట్రంగా బీహార్

**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త:** తలసరి ఆదాయం అత్యధికంగా కలిగిన టాప్ 5 రాష్ట్రాల్లో తెలంగాణకు చోటుదక్కింది. ప్రపంచ బ్యాంకు తలసరి ఆదాయ ప్రమాణం ఆధారంగా ఎగువ మధ్య ఆదాయ వర్గంలోకి వచ్చిన దేశంలోని ఐదు రాష్ట్రాలలో తెలంగాణ ఒకటిగా నిలిచింది. ప్రపంచ బ్యాంకు, తలసరి ఆదాయం రూ.1,1,947.24 కంటే తక్కువ ఉన్న దేశాలను అల్ప ఆదాయ దేశాలుగా, రూ.1,11,983.96 నుండి రూ. 4,41,618.17 మధ్య ఉన్న దేశాలను దిగువ మధ్య ఆదాయ దేశాలుగా, రూ.13,69,798.06 కంటే ఎక్కువ ఉన్న దేశాలను అధిక ఆదాయ దేశాలుగా వర్గీకరిస్తుంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ రూ.5,92,428.81 తలసరి ఆదాయంతో ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలవగా, కర్ణాటక రూ.5,31,633.23 తర్వాతి స్థానంలో నిలిచింది. అలాగే తెలంగాణ రూ.5,15,297.37 తో మూడవ స్థానాన్ని దక్కించుకోగా, తమిళనాడు రూ.5,07,876.61, గుజరాత్ రూ.4,51,190.91 వరుసగా నాలుగవ మరియు ఐదవ స్థానాలను ఆక్రమించాయి. ఈ ఐదు రాష్ట్రాలు కూడా ఈ విభాగానికి సంబంధించి ప్రపంచ బ్యాంకు నిర్దేశించిన కనీస ప్రమాణాన్ని అధిగమించాయి. ఇక మహారాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,41,096 గా, హర్యానా రూ.4,40,813.80గా నమోదు చేయగా, కేరళ రూ.4,39,194.24 తో తలసరి ఆదాయాన్ని నివేదించింది. బీహార్ తలసరి ఆదాయం రూ.93,767.97 కలిగి ఇది భారతదేశంలోనే అత్యంత పేద రాష్ట్రంగా నమోదైంది.

## హత్యగా తేలిన మియాపూర్ వ్యక్తి మిస్సింగ్

### 7నెలల తర్వాత వెలుగుచూసిన సంచలన మర్డర్ మిస్టరీ

### ప్రియుడితో కలిసి భర్తను హత్యచేసిన భార్య

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జులై 7, ప్రభాతవార్త:** మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 7నెలల క్రితం కనిపించకుండా పోయిన వ్యక్తి దారుణ హత్యకు గురైనట్లు పోలీసులు తేల్చారు. మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకున్న మృతుడి భార్య ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసినట్లు గుర్తించారు. అన్నంలో నిద్రమాత్రలు కలిపి, భర్త పడుకున్న తరువాత ప్రియుడితో కలిసి హత్య చేసింది. అనంతరం ప్రియుడు, అతని స్నేహితులతో కలిసి మృతదేహాన్ని పక్క రాష్ట్రానికి తీసుకువెళ్లి పూడ్చి పెట్టింది. అనంతరం ఏమీతెలియనట్టు తన భర్త కనిపించకుండా పోయాడని మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. భార్య వ్యవహారంపై అనుమానం వచ్చిన పోలీసులు కాల్‌డేటా ఆధారంగా కూపీ లాగడంతో హత్య విషయం 7 నెలల తరువాత వెలుగుచూసింది. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మియాపూర్ అంబేద్కర్ నగర్‌లో నివాసముండే మల్లాని పెంటేష్(56) మొదటి భార్యతో విభేదాల కారణంగా విడాకులు తీసుకున్నాడు. ఇతనికి అంబేద్కర్‌నగర్‌లోనే నివాసం ఉంటున్న మహిళతో పరిచయం ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ అనకాపల్లికి చెందిన ఆ మహిళ సైతం భర్తతో ఏర్పడిన విభేదాలతో భర్తకు దూరంగా ఉంటూ నగరానికి వచ్చింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయంతో ఇద్దరు పెళ్లి చేసుకున్నారు. వీరికి ఓ కుమారుడు ఉండగా, పెంటేష్ పటాన్‌చెరు సమీపంలో వ్యవసాయం చేస్తున్నాడు. కాగా గత సంవత్సరం నవంబరు 19న పటాన్‌చెరులోని వ్యవసాయ క్షేత్రానికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన పెంటేష్ తిరిగి రాలేదని, ఫోన్ చేసినా స్పందన లేదంటూ 25న పెంటేష్ రెండో భార్య మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మియాపూర్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా విచారణలో పోలీసులు సంచలన విషయాలు తెలుసుకున్నారు. పెంటేష్ భార్యకు మధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ప్రియుడితో కలిసి ఉండేందుకు భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన ఆమె ఎలాగైనా భర్త అడ్డు తొలగించుకోవాలని



పెంటేశ్ (ఫైల్)

పథకం వేసింది. ఇందులో భాగంగా మధుసూదన్‌రెడ్డితో కలిసి భర్తను హత్య చేయాలని నిర్ణయించుకుంది. 2025 నవంబరు 19న రాత్రి భర్త తినే ఆహారంలో నిద్రమాత్రలు కలిపింది. ఆహారం తిన్న పెంటేష్ ఆపస్మారక స్థితికివెళ్లడంతో ప్రియుడు మధుసూదన్‌రెడ్డిని పిలిచి ముఖంపై దిండుతో ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి స్నేహితుడితో కలిసి పెంటేష్ మృతదేహాన్ని మియాపూర్ నుంచి మహారాష్ట్ర తుల్జాపూర్‌కు కారులో తరలించారు. అక్కడ నిర్మానుష్య ప్రాంతంలో పెంటేష్ మృతదేహాన్ని తగులబెట్టి నగరానికి తిరిగి వచ్చారు. అనంతరం వారంరోజుల తరువాత భర్త కనిపించడం లేదని ఆ మహిళ మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు 7 నెలల విచారణ అనంతరం పెంటేష్ భార్యను అనుమానించారు. దీంతో ఆమె కాల్ డేటాను పరిశీలించగా, మధుసూదన్‌రెడ్డితో ఎక్కువగా ఫోన్ మాట్లాడుతుందని గుర్తించారు. పోలీసుల విచారణలో మధుసూదన్‌రెడ్డికి సదరు మహిళతో వివాహేతర సంబంధం ఉందని తేలడంతో సిసి కెమెరాలను పరిశీలించిన పోలీసులకు కొన్ని ఆధారాలు లభించాయి. దీంతో నిందితురాలిని అదుపులోకి తీసుకొని విచారించడంతో 7నెలల క్రితం జరిగిన హత్య విషయం వెలుగుచూసింది. దీంతో నిందితురాలితోపాటు ప్రియుడు మధుసూదన్‌రెడ్డి, అతని స్నేహితుడు రాజేష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది. ఈ కేసు పూర్తి వివరాలను బుధవారం పోలీసులు వెల్లడించనున్నట్లు సమాచారం.

## ‘బతుకు జట్కా బండి’ కోసం వచ్చిన మహిళపై ఇద్దరు అత్యాచారం

**హైదరాబాద్ (బేగంపేట) జులై 7, ప్రభాతవార్త:** భర్తతో ఉన్న సమస్య పరిష్కారం కోసం ఓ టీవీ ఛానల్ నిర్వహిస్తున్న బతుకు జట్కాబండి కార్యాక్రమం కోసం వచ్చిన ఓ మహిళను టీవీ షోకు తీసికెళతామంటూ నమ్మించిన ఇద్దరు వ్యక్తులు ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టిన ఘటన మహంకాళీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ లోని ఓ తండాకు చెందిన మహిళ(43)కు 9 యేళ్ల క్రితం సిరిసిల్లకు చెందిన వ్యక్తితో వివాహమైంది. వీరికి ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. కొద్ది రోజుల నుంచి ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో మూడురోజుల క్రితం ఆమె తన పుట్టింటికి వెళ్లింది. ఓ టీవీఛానల్‌లో ప్రసారమయ్యే బతుకు జట్కాబండి కార్యక్రమానికి వెళ్లి సమస్య పరిష్కరించుకోవచ్చని భావించిన ఆమె ఈ నెల 6న మహబూబాబాద్‌లో రైలెక్కి నగరానికి వచ్చింది. టీవీ ఛానల్ కార్యాలయం కోసం నగరంలోని వివిధ ప్రాంతాల్లో తిరిగిన ఆమె మంగళవారం తెల్ల వారుజామున సికిందరాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. అదే సమయంలో ఒక గుర్తుతెలియని వ్యక్తి ఆమె దగ్గరకు వచ్చి ఎక్కడికి వెళ్లాలని అడిగి తాను తీసికెళతానంటూ ఆమెను నమ్మించాడు. ఇద్దరు కలిసి ఎంజీ రోడ్డులోని హైదర్ కాంప్లెక్సు వద్దకు వచ్చారు. అదే కాంప్లెక్సులో నిర్మానుష్యంగా ఉన్న చోటుకి తీసికెళ్లి ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టాడు. అంతే కాకుండా నిందితుడు తన స్నేహితుడిని పిలిపించడంతో అతను కూడా ఆమెపై అత్యాచారం చేసాడు. ఆ తర్వాత ఆమె గట్టిగా కేకలు వేయడంతో వారిద్దరు అక్కడి నుంచి పరారయ్యారు. వెంటనే ఆమె స్థానికుల సహాయంతో మహంకాళీ పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పంటల బీమా పథకాలు కొనసాగింపు

- అర్హులైన ప్రతి రైతు నమోదు చేసుకోవాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- రుణ రైతులకు ఆప్ట్‌అవుట్ విధానం యథాతథం
- రుణేతర రైతులు కూడా స్వచ్ఛందంగా నమోదు చేసుకోవచ్చు
- అగ్రిస్టాక్ ఫార్మర్ ఐడి, ఇపంట ధ్రువీకరణకు ప్రాధాన్యం
- రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం సబ్సిడీ భారం భరిస్తుంది

**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని రైతులకు పంటల భద్రత కల్పించేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలను 2026-27 సంవత్సరానికి (ఖరీఫ్, రబీ) మరో ఏడాది పాటు కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, సహకార శాఖల ద్వారా సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయని పేర్కొన్నారు. పంటల బీమా పథకాల ద్వారా ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఇతర అనుకోని కారణాలతో పంట నష్టపోయిన రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఖరీఫ్-2026 సీజన్‌లో నోటిఫై చేసిన ప్రాంతాల్లో నోటిఫై చేసిన పంటలను సాగు చేస్తున్న యజమాని రైతులు, కౌలు రైతులు, భాగస్వామ్య సాగుదారులు, పంటపై బీమా హక్కు కలిగిన వారు అందరూ పథకంలో నమోదు చేసుకోవచ్చని మంత్రి పిలుపునిచ్చారు.



**రైతులు గడువులోపు నమోదు చేసుకోవాలి:** పధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఖరీఫ్-2026 సీజన్‌లో వరి మినహా అన్ని నోటిఫైడ్ పంటలకు రుణ కాలం ఏప్రిల్ 1 నుంచి జులై 31 వరకు ఉండగా, రుణ, రుణేతర రైతుల నమోదు గడువు జులై 31గా నిర్ణయించబడిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వరి పంటకు రుణ కాలం ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 15 వరకు ఉండగా, నమోదు గడువు ఆగస్టు 15గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

రబీ 2026-27 సీజన్‌లో వరి మినహా అన్ని నోటిఫైడ్ పంటలకు రుణ కాలం అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 15 వరకు ఉండగా, నమోదు గడువు డిసెంబర్ 15గా నిర్ణయించారని, వరి పంటకు రుణ కాలం అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు ఉండగా నమోదు గడువు డిసెంబర్ 31గా నిర్ణయించినట్లు తెలిపారు.

**రుణ రైతులకు 'ఆప్ట్ అవుట్' విధానంలో బీమా:** సీజనల్ పంట రుణం లేదా కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితి మంజూరైన లేదా పునరుద్ధరించిన రైతులు సంబంధిత బ్యాంకు శాఖల ద్వారా ఆటోమేటిక్‌గా పంట బీమా పరిధిలోకి వస్తారని మంత్రి తెలిపారు. బీమా వద్దనుకునే రైతులు మాత్రమే నమోదు గడువుకు కనీసం ఏడు రోజుల ముందుగా రుణం మంజూరు చేసిన బ్యాంకు శాఖకు లిఖితపూర్వకంగా 'ఆప్ట్ అవుట్' ప్రకటన సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. అలాంటి ప్రకటన సమర్పించని రైతులందరూ స్వయంచాలకంగా బీమా పరిధిలోకి వస్తారని స్పష్టం చేశారు. నోటిఫై చేసిన పంటలకు సంబంధించి రుణ రైతులకు బీమా వర్తింపజేయడం తప్పనిసరి అని పేర్కొన్న మంత్రి, బ్యాంకులు రైతు చెల్లించాల్సిన ప్రీమియం వాటాను డెబిట్ చేసి, వాస్తవ సాగు విస్తీర్ణం ఆధారంగా పంటల వారీగా బీమా నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోపు ప్రీమియంతో కూడిన సమగ్ర వివరాలను బీమా సంస్థలకు పంపించడంతో పాటు విది।శిలో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

నిర్ణీత సమయంలో ప్రీమియం, రైతుల వివరాలను బీమా సంస్థలకు పంపించడంలో బ్యాంకులు లేదా శితిదిశి విఫలమైతే, బీమా రక్షణ కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాల్సిన బాధ్యత ఆయా బ్యాంకులదేనని స్పష్టం చేశారు.

**రుణేతర రైతులకు స్వచ్ఛంద నమోదు:** రుణేతర రైతులు స్వచ్ఛందంగా పథకంలో నమోదు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. ఇందుకోసం యజమాని రైతులు రికార్డ్ ఆఫ్ రైట్స్ ల్యాండ్ పొజెషన్ సర్టిఫికేట్ లేదా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇతర భూ రికార్డులను సమర్పించాల్సి ఉంటుంది.

కౌలు రైతులు, భాగస్వామ్య సాగుదారులు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన ఒప్పంద పత్రాలు లేదా సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. అదనంగా బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌బుక్ ప్రతులు, రైతు స్వీయ పంట సాగు ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలతో సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి విది।శిలో నమోదు చేస్తారని, అసంపూర్ణ దరఖాస్తులు లేదా అవసరమైన పత్రాలు లేని దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోరని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

## ఆగస్టు 1 నుంచి మార్కెట్లోకి

# 'స్వయం ఏపీ' బ్రాండ్

- 65 ప్రత్యేక ఉత్పత్తులకు సెర్ప్ గుర్తింపు
- గ్రామీణ మహిళా ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్
- ఎస్‌హెచ్‌జీ మహిళా కుటుంబాల్లో వివాహాలకు కల్యాణలక్ష్మి
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఆగస్టు 1 నుంచి మార్కెట్లోకి 'స్వయం ఎపి బ్రాండ్' అందుబాటులోకి వస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం విజయవాడలోని సెర్ప్ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి ఆయా ప్రాంతాల సంప్రదాయాలను ప్రతిబింబించేలా 65 ప్రత్యేక ఉత్పత్తులను సెర్ప్ గుర్తించిందని, 587 మహిళా సంఘాల ఆధ్వర్యంలో తయారవుతోన్న ఈ ఉత్పత్తులను ఆగస్టు 1నుంచి మార్కెట్లోకి తీసుకు వస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. ఈ ఉత్పత్తుల నిల్వ, ఆర్డర్ల నిర్వహణ, స్పీడ్ సరఫరా కోసం రెండు ఫుల్ ఫిల్‌మెంట్ సెంటర్లను కూడా ప్రారంభిస్తామన్నారు. విజయవాడలో బాపూజీ మ్యూజియం దగ్గర మరియు గొల్లపూడిలోని టీటీడీసీ ప్రాంగణంలో రెండు సిగ్నేచర్ స్టోర్లు కూడా ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఉత్పత్తులు అన్నీ నాణ్యతా ప్రమాణాల మేరకు ఉండేలా చూస్తున్నామని, ఈ విషయంలో మహిళా సంఘాలకు పూర్తి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ మహిళా ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్ సౌకర్యం కల్పించడం ద్వారా వారి ఆదాయం పెంచడంతో పాటు స్వయం ఏపీ బ్రాండ్‌ను మరింతగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి లక్ష్యానికి అనుగుణంగా పని చేస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటయ్యే పారిశ్రామిక సంస్థల సమర్థవంత పనితీరుకోసం ప్రతి నెలా సామాజిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎస్‌హెచ్‌జీ మహిళల ద్వారా ఆధునిక యాంత్రిక, లాండ్రీ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సెర్ప్ అధికారులకు మంత్రి సూచించారు. ఎస్‌హెచ్‌జీ మహిళలకు వివాహ సంబంధిత అవసరాల కోసం తక్కువ వడ్డీతో, సులభంగా రుణం అందించేందుకు స్త్రీ నిధి "కల్యాణ లక్ష్మి" పథకం ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఎస్‌హెచ్‌జీ మహిళలందరిని ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకాలలో 100 శాతం నమోదు చేసి జీవిత, ప్రమాద బీమా రక్షణ కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. వెలుగు మార్ట్‌లు పనితీరు నిరంతరం పర్యవేక్షించడంతో పాటు నష్టాలతో మూతపడిన, సరిగా పనిచేయని మార్ట్‌ల విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సెక్రటరీ సిఇఒ వాకాటి కరుణ, సెర్ప్ డైరెక్టర్లు, మార్కెటింగ్ సిబ్బంది, స్వయం ఎపి బ్రాండ్ కన్సల్టెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గుమ్మడి గోపాలకృష్ణకు సిఎం అభినందన

- కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుకు ఎంపికపై చంద్రబాబు ప్రశంస



**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇటీవల కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుకు ఎంపికైన ఎపి నాటక అకాడమీ ఛైర్మన్, ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణను ముఖ్య మంత్రి చంద్రబాబు అభినందించారు. సిఎం చంద్రబాబును సచివాలయంలో గోపాలకృష్ణ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రంగస్థలం నటనకు తొలిసారి కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు రావడం సంతోషకరమన్న సిఎం, గుమ్మడి గోపాలకృష్ణకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గోపాలకృష్ణ వేసే నాటకాలన్నీ బాగుంటాయని, తన ప్రదర్శనలతో తెలుగు నాటక రంగానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారని ముఖ్యమంత్రి కొనియాడారు.

## చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యంపై వీడని మిస్టరీ


## వదంతులు నమ్మవద్దు: డిఎస్పీ తిలక్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 7 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సిహెచ్ అగ్రహారానికి చెందిన చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ కేసులో మిస్టరీ వీడలేదు. ఇంతవరకు ఏవిదమైన ఆచూకి లభించకపోగా సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారంతో దర్యాప్తులో పోలీసులకు తలనొప్పిగా మారింది. కాగా ఈ సంఘటన పై పోలీసు దర్యాప్తు కొనసాగుతోందని పెద్దాపురం డిఎస్పి తిలక్ అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నారి జ్ఞానేశ్వరిని తల్లి వద్దకు చేర్చడమే లక్ష్యంగా పోలీసులు పని చేస్తున్నారన్నారు. చిన్నారి ఆచూకీ తెలిసినవారు పోలీసులకు సమాచారం అందిస్తే వారిపై ఎటువంటి కేసులు ఉండవని సంచలన ప్రకటన చేశారు. చిన్నారి జ్ఞానేశ్వరి కేసు పై పక్కా సమాచారంతో మీడియాలో వార్తలు ప్రచురించాలని, అసత్య కథనాల వలన కేసు పురోగతిపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. కేసులో పురోగతి సాధించేందుకు మీడియా సహకరించాలని కోరారు.

## శాంతిపురంలో అమెరికన్ విద్యార్థుల సందడి

- ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు పరిశీలన



**శాంతిపురం, జులై 7 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం ఎంకెపురం గ్రామంలో అమెరికన్ విద్యార్థులు సందడి చేశారు. అమెరికాలోని ప్రెస్టిషియన్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థుల బృందం గ్రామంలో ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించింది. ఈ కార్యక్రమం రైతు సాధికార సంస్థ, ఎపి కమ్యూనిటీ మేనేజ్డ్ నాచురల్ ఫామింగ్ వారి ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా అమెరికన్ విద్యార్థులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి పంట సాగు విధానాలు అడిగి తెలుసుకున్నారు. పంటల నిర్వహణ, గోఆధారిత వ్యవసాయ ఉత్పత్తులు, జీవామృతం, ఘనజీవామృతం తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతుల అనుభవాలను ఆసక్తిగా తిలకించారు. కుప్పం ప్రాంతంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానం ఎంతో ఆదర్శంగా ఉందని అమెరికన్ విద్యార్థులు పేర్కొన్నారు. రైతులు అనుసరిస్తున్న విధానాలతో పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి సిఎం చంద్రబాబునాయుడు చూపిన దూరదృష్టిని అమెరికన్ విద్యార్థులకు వివరించారు. అలాగే స్వర్ణ కుప్పం లక్ష్యాల గురించి తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతుల ఆదాయం, నేల, ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు రామకుప్పం మండలం చెల్దిగానిపల్లి, పెద్దగానూరు గ్రామాలను సందర్శించారు. కార్యక్రమంలో డిపిఎం అమృతవల్లి, నోడల్ అధికారి బాజీబాబు, ఎఎంసి డైరెక్టర్లు, ఎఫ్ఎంటిలు, రైతులు పాల్గొన్నారు.

# విపత్తుల ప్రభావాన్ని తగ్గించేలా సమర్థవంతమైన చర్యలు

- ప్రజల ప్రాణాలు, జీవనోపాధి పరిరక్షణే ప్రభుత్వ ప్రాధాన్యత
- వాతావరణ హెచ్చరికల ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టి 'జీరో లాస్' లక్ష్యంగా పనిచేయాలి
- జిల్లా కలెక్టర్లు వ్యక్తిగతంగా సన్నద్ధత, ప్రతిస్పందన చర్యలను పర్యవేక్షించాలి
- రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత

**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** విపత్తుల ప్రభావాన్ని తగ్గించేలా సమర్థవంతమైన చర్యలు చేపడుతున్నట్లు హోం మంత్రి అనిత తెలిపారు. ఈ విషయంలో పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. నైరుతి రుతుపవనాలు, ఎల్‌నినో ప్రభావంపై ఉన్నత స్థాయి అధికారులతో హోం మంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. విపత్తుల వల్ల ఏ ఒక్క ప్రాణనష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని హోం మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నిరంతరం పని చేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.



రాయలసీమ జిల్లాలపై ఎక్కువగా ఎల్‌నినో ప్రభావం చూపుతుందని అన్నారు. శ్రీసత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో తీవ్రస్థాయిలో వర్షాల కొరత ఉందని తెలిపారు. కర్నూలు, నంద్యాల, చిత్తూరు, కడప జిల్లాల్లో ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, తిరుపతిలో వర్షభావ ప్రభావం మధ్యస్థంగా ఉన్నట్లు వెల్లడించారు. కరవు ముప్పు ఉన్న మండలాల్లో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పునరావాస కేంద్రాలలో ఆహారం, తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, విద్యుత్ వంటి కీలక సేవలకు ఎలాంటి అంతరాయం కలగకూడదని సూచించారు. పోలీస్, ఫైర్, ఎన్‌డీఆర్‌ఎఫ్ ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు అత్యవసర స్పందనకు సిద్ధంగా ఉండాలని హోం మంత్రి అనిత ఆదేశించారు. తూర్పు గోదావరి జిల్లాపై ఎల్ నినో ప్రభావం తీవ్రస్థాయిలో ప్రభావం చూపిందని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు.

గతేడాదితో పోల్చితే ఈ ఏడాది వరి సాగు గణనీయంగా తగ్గిందని, ఇప్పటి వరకు కేవలం 30 శాతం విస్తీర్ణంలోనే నాట్లు వేశారని అధికారిక గణాంకాలు స్పష్టం చేశాయి. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు పంట నష్ట పోకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందస్తుగా ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వరి మాత్రమే పండే ప్రాంతాల్లో రైతులు సాధారణ వరి రకాలు కాకుండా తక్కువ సమయంలో పంట వచ్చే వరి రకాలను సాగు చేయాలని సూచించింది. చెరువులు, బావులు, బోర్ల కింద పంటలు పండించే రైతులు తప్పని సరిగా పంట మార్పిడి విధానాన్ని పాటించాలని అధికారులు తెలుపుతున్నారు.

**సోషల్ మీడియా వేదికగా వ్యవస్థీకృత దుష్ప్రచారానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు:** సోషల్ మీడియా వేదికగా వ్యవస్థీకృత దుష్ప్రచారానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. అశ్లీల పోస్టులు పెట్టడం, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని అసత్య ప్రచారాలకు ఒడిగట్టే వ్యక్తులు, గ్రూపులపై నెట్‌వర్క్ ఆధారిత దర్యాప్తును ముమ్మరం చేయాలని ఆమె స్పష్టం చేశారు. ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులతో కలసి శాంతిభద్రతలు, సైబర్ నేరాల కట్టడి, మహిళలకు రక్షణ, అమరావతి ప్రాంతంలో ప్రేరేపిత నిరసనలపై ఎస్‌వోపీ రూపకల్పన, ఇతర నేరాలపై పరిస్థితిని సమగ్రంగా చర్చించారు. అన్ని పోలీసు జిల్లాల ఎస్పీలు, కమిషనర్లు, ఐజీలతో పోలీసు పనితీరు, ఎదురవుతున్న సవాళ్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అనంతరం అనిత మాట్లాడుతూ... రాష్ట్రంలో రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛ, చట్టబద్ధమైన విమర్శలకు ఆటంకం ఉండదు. అయితే అడ్డూ అదుపు లేకుండా రెచ్చిపోతే చట్టం తనపని తాను చేస్తుంది. రెండేళ్ల కూటమి పాలనలో ఏపీలో మహిళల భద్రత గణనీయంగా పెరిగింది. చిచ్చు పెట్టి విషం చిమ్మే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంటుంది అని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. సమావేశంలో శాంతి భద్రతల ఏడీజీ మధుసూదన్‌రెడ్డి, సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు వేలం కేంద్రాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- వర్జీనియా పొగాకు కొనుగోలుపై మంత్రి అచ్చెన్నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష



**సచివాలయం, జులై 7 ప్రభాతవార్త:** వర్జీనియా పొగాకు కొనుగోళ్ల ప్రక్రియ, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించే చర్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మంగళవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సామాజిక సంక్షేమ, విద్యుత్, రెవెన్యూ శాఖల మంత్రులతో పాటు టుబాకో బోర్డు ఛైర్మన్, టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆక్షన్ ఫ్లాట్‌ఫారమ్‌ల పరిస్థితి, కొనుగోళ్ళ పురోగతి, రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి సమగ్రంగా చర్చించారు. ఈనెల 9న టుబాకో బోర్డు కేంద్ర సంయుక్త కార్యదర్శి ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్న నేపథ్యంలో రైతులు, పొగాకు కొనుగోలు సంస్థల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అధిక రిజెక్షన్ నమోదవుతున్న ఆక్షన్ ఫ్లాట్ ఫార్మ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను గుర్తించి వేంటనే పరిష్కరించాలని సూచించారు. పొగాకు వేలం కేంద్రాలను సంబంధిత సహచర మంత్రులు స్వయంగా సందర్శించి రైతులతో మాట్లాడాలని, కంపెనీల సిండికేట్ వ్యవహారాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ఆక్షన్‌లలో పాల్గొన కుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కంపెనీలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని టుబాకో బోర్డు అధికారులను మంత్రి ఆదేశించారు. రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా, వర్జీనియా పొగాకుకు న్యాయమైన ధరలు లభించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టంచేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ, ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పక్కా గృహాలు

- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

**సచివాలయం, జులై 7 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ పక్కా గృహాలు అందించే లక్ష్యంతో ఈ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి స్పష్టంచేశారు. పేదలకు పక్కా గృహాలు అందించడానికి ముఖ్య మంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేయడంతోపాటు కేంద్రం నుంచి అధిక నిధులు సాధించి వారి సొంత ఇంటి కల నిజం చేయడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సచివాలయంలో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 2014-19మధ్య లో మొత్తం 13,04,516ఇళ్లు మంజూరు చేస్తే రూ.10,194కోట్లు ఖర్చుచేసి 8,04,853ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అందించిన ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. అందరికీ ఇళ్లు అందించాలన్న ఏకైక లక్ష్యంతో ఆనాడు రూ.10 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చుచేశారని గుర్తుచేశారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ, బిసిలు ఇళ్ళ నిర్మాణంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.712.83 కోట్లు అదనపు ఆర్థిక సాయం అందించారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఇంటికి రూ.50వేల చొప్పున ఆదివాసీ గిరిజనులకు ఇంటికి రూ.75వేల చొప్పున అందించి వారికి చేయూత నివ్వడం జరిగిందని మంత్రి పార్థసారధి పేర్కొన్నారు.

స్వర్ణ గ్రామం, వార్డుల్లో పనిచేసే 370మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ప్రభుత్వ గృహ నిర్మాణ శాఖకు కేటాయించడంతో గృహ నిర్మాణాలు మరింత వేగవంతం అవుతాయని మంత్రి హర్షం వ్యక్తంచేశారు. సిబ్బంది కేటాయింపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. వివిధ కార్పొరేషన్లలో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62కు పెంచడంతో గృహ నిర్మాణంలో నైపుణ్యం, విశేష అనుభవం ఉన్న దాదాపు 348మంది విధుల్లో కొనసాగే



అవకాశం ఉందని వారి పర్యవేక్షణలో ఇళ్ళ నిర్మాణం మరింత వేగవంతం అవుతాయన్నారు. పోలవరం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని గృహ నిర్మాణ శాఖ చేపడుతుందని మంత్రి పార్థసారధి తెలిపారు. ఇప్పటికే బుట్టాయిగూడెం, తాడువాయి తదితర ప్రాంతాలో వేగంగా గృహ నిర్మాణాలు చేస్తున్నామన్నారు. పునరావాసంలో భాగంగా పోలవరం పూర్తయ్యే లోపు నిర్వాసితులు అందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పార్థసారధి స్పష్టంచేశారు.

## పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో 10 కిలోల గంజాయి స్వాధీనం



**ఒంగోలు(క్రైమ్), జులై 7 ప్రభాతవార్త:** పూరి నుంచి తిరుపతి వెళ్తున్న పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలులో నిర్వహించిన సాధారణ తనిఖీల్లో 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఒంగోలు రైల్వే సీఐ కమలాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక జీఆర్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్, ఒంగోలు జీఆర్పీ, ఆర్పీఎఫ్, ఈగల్ బృందాలు సంయుక్తంగా సాయంత్రం 4.30 గంటల సమయంలో పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో సాధారణ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. తనిఖీల సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న బ్యాగులను పరిశీలించగా సుమారు 10 కిలోల గంజాయి లభ్యమైందన్నారు. వెంటనే గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అనంతరం నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న గంజాయిని తదుపరి దర్యాప్తు కోసం ఒంగోలు జీఆర్పీ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. నిందితులు గంజాయిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారు, ఎవరికి సరఫరా చేయాలనే ఉద్దేశంతో తరలిస్తున్నారు, ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు. రైల్వే మార్గాల ద్వారా మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపడుతోందని, ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని సీఐ కమలాకర్ తెలిపారు. ప్రయాణికులు అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే మాదకద్రవ్యాల అక్రమ రవాణాను సమర్థంగా అరికట్టగలమని ఆయన అన్నారు. నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ శ్రీరామ్, ఏఎస్ఐ భాషా, చంచయ్య, ఈగల్ టీమ్ సభ్యులు లక్ష్మణ్ తదితర అధికారులు పాల్గొన్నారు. అధికారులు సమన్వయంతో నిర్వహించిన తనిఖీల ఫలితంగానే ఈ గంజాయి పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు.

# అందానికి ఇంటి చికిత్స



అందానికి ఇంటి చికిత్సలూ ఒకటి. ఎన్ని రకాల క్రీములున్నా.. సహజమైనవి చేసే మేలే ఎక్కువ మరి. మీరూ ఆ ప్రయోజనం పొందాలి అనుకుంటున్నారా? అయితే వీటిని ప్రయత్నించేయండి.

**బేకింగ్ సోడా–**యాపిల్ సిడార్ వెనిగర్.. చర్మంపై పేరుకుపోయిన మృతకణాలను తొలగించడంలో వంట సోడా బాగా పని చేస్తుంది. చెంచా వంటసోడాలో రెండు చెంచాల యాపిల్ సిడార్ వెనిగర్ చేర్చి, పేస్టులా చేసుకోవాలి. ముకాన్ని కడిగి, తడి లేకుండా తుడిచాక ఈ మిశ్రమాన్ని పట్టించాలి. పది నిమిషాల తర్వాత గాఢత తక్కువ ఉండే ఫేస్వాష్‌తో కడిగేస్తే సరి. మెరిసే చర్మం మీ సొంతం.

**నిమ్మ..** చర్మాన్ని మెరిపించడంలో నిమ్మదీ ప్రత్యేక పాత్రే. దీనిలోని విటమిన్ సి సహజ అందం కోసం పని చేస్తుంది. ఒక నిమ్మచెక్కను సన్నటి చక్కెరలో ముంచి ముఖంపై మృదువుగా మర్దనా చేస్తే చాలు. అయిదు నిమిషాలయ్యాక గోరువెచ్చని నీటితో శుభ్రం చేస్తే సరి. చర్మరంధ్రాలను లోతుగా శుభ్రం చేసి, చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలుఅలర్జీలు, యాక్నే రాకుండానూ చూస్తుంది.

**నారింజ తొక్కలతో..** చెంచా నారింజ తొక్కల పొడికి, చెంచా తేనె, చిటికెడు పసుపు కలిపి మెత్తని చూర్ణంలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని శుభ్రమైన ముఖానికి పట్టించి ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసి, మాయిశ్చరైజర్‌ను రాస్తే సరి. దీనిలో ఉండే సి విటమిన్ ముఖంపై ముడతలు, గీతలను తగ్గించ కలదు.

**అరటి-తేనె..** బాగా పండిన అరటి పండులో చిన్న ముక్క తీసుకొని గుజ్జులా చేయాలి. దానికి చెంచా తేనె, నాలుగైదు చుక్కలు నిమ్మరసం కలిపి, మెత్తని మిశ్రమంలా చేసుకోవాలి. దీన్ని శుభ్రమైన ముఖానికి పట్టించి, పావుగంటసేపు వదిలేయాలి. ఆపై గోరువెచ్చని నీటితో కడిగేస్తే సరి. అరటిలోపుష్కలంగా ఉండే ఎ,బి,ఇ విటమిన్లు చర్మాన్ని మృదువుగా మార్చడమే కాదు.. నల్ల మచ్చలనీ తగ్గస్తాయి. తేనెలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని తేమగా ఉంచుతాయి. □

### చిట్కా

- బెండ కాయ కూర కరకరలాడు తుండా లంటే ముందు రోజు రాత్రి బెండకాయలను తరిగివుంచుకొని మర్నాడు కూర చేయండి.
- పప్పుధాన్యాలు నిలువవుంచిన పాత్రలక్రింద తాజా వేపాకులు వేస్తే పురుగులు రావు. □

# శఠగోపం..

దేవాలయాల్లో దైవ దర్శనం అనంతరం పూజారి భక్తుల తలపై ఉంచే లోహ కిరీటం వంటి పరికరాన్ని శఠగోపం లేదా శఠారి అంటారు. దీనిపై భగవంతుడి పాద ముద్రలు ఉంటాయి. ఆధ్యాత్మికంగా శఠారిని తలపై ఉంచుకోవడం అంటే దైవ పాదాలను మన శిరస్సుపై ధరించడమే. మనలోని అహంకారాన్ని (శఠం) పోగొట్టి, వినయాన్ని ప్రసాదించేది కాబట్టి దీనికి 'శఠారి' అనే పేరు వచ్చింది. దీనిని స్వీకరించే సమయంలో భక్తులు వంటి నమస్కరించడం ద్వారా తమ సర్వస్వాన్ని దైవానికి సమర్పించుకున్నట్టు అవుతుంది. శఠగోపాన్ని రాగి లేదా వెండి వంటి లోహాలతో తయారుచేస్తారు. గర్భాలయంలోని విగ్రహం సమీపంలో ఉండటం వల్ల ఈ లోహపు శఠారి దైవశక్తిని, మంత్రోచ్చారణల వల్ల కలిగే ప్రకంపనలను నిక్షిప్తం చేసుకుంది. దీనిని తలపై ఉంచినప్పుడు, ఆ దివ్యశక్తి భక్తుల శిరస్సులోని 'సహస్రార చక్రం' ద్వారా శరీర మంతటా ప్రసరించి మనసును ప్రశాంతంగా మారుస్తుంది. అని వేదపండితులు తెలియ జేశారు. శఠగోపం వల్ల మానసిక ఆందోళనలు తొలగి, ఆత్మ విశ్వాసం పెరుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే ఆలయ దర్శనంలో శఠారి ఆశీర్వచనం అత్యంత పవిత్రమైన ఘట్టం. □

# పాపలకు తాజా పాలు



పిల్లల పోషణ.. పాలతో పరిపూర్ణ మవుతుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో తాజా పాలు దొరకడం కొంచెం కష్టమే.దాంతో చాలామంది..ముఖ్యంగా పట్టణాలూ, నగరాల్లోని వాళ్లు ప్యాకెట్ పాలను వాడటానికే మొగ్గు చూపుతుంటారు. అయితే వీటి ఎంపికలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అనారోగ్యాలు తప్పవు. . పేపర్‌బోర్డు లేదా టెట్రా ప్యాకింగుతో తయారైన పాల డబ్బాల్లో బ్యాక్టీరియా శాతం అధికంగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. కారణాలను అన్వేషిస్తే.. పాలను శుద్ధిచేసిన తరవాత వాటిని డబ్బాల్లో నింపడానికి వినియోగించే మెషిన్లే ఇందుకు కారణమని తేల్చారు. ఇందులో భాగంగా మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్లలో పాల శాంపిళ్లను తీసుకుని పరీక్షించారు. వారం తరవాత వాటిల్లోని పాలు 30 శాతం పాడైతే, రెండు వారాలకల్లా 41 శాతం పాడైనట్లు గుర్తించారు. అంతే కాదు రుచిలోనూ తేడాను గమనించారట. మరో విష యం ఏంటంటే.. పెద్ద కంటైనర్లలోని పాలకంటే చిన్న కంటైనర్లలోని పాలు త్వరగా పాడవుతు న్నాయనీ చెబుతున్నారు. యంత్రాల వాడకం పెరగడం, వాటిని శుభ్రం చేయడం క్లిష్టతరంగా ఉండటమే ఈ పరిస్థితికి దారితీస్తోంది. ఈ మెషిన్లను మరింత శ్రద్ధతో శుభ్రం చేయాలనీ, అవసరమైతే వాటి డిజైన్‌లోనూ మార్పులు చేయాలని ఆయా సంస్థకు సూచిస్తున్నారు పరిశోధ కులు. వినియోగదారులు ఈ టెట్రా ప్యాకెట్లనూ, పేపర్‌బోర్డు కంటైనర్లునూ వినియోగించడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటు న్నారు. ముఖ్యంగా గర్భిణులూ, పిల్లలూ వీటిని వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలట. □

**చెలి** సామాజిక పరిణామ క్రమంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చాలంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు,ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం.

ఈ మెయిల్: Cheli@vaartha.com

# హేమమాలిని 'డ్రీమ్ గాళ్'గా మారిన వేళ !



భారతీయ సినీ చరిత్రలో హేమమాలినిని 'డ్రీమ్ గాళ్' పేరు చిరస్థాయిగా నిల బెట్టింది. బాలీవుడ్ ఎవర్ గ్రీన్ బ్యూటీ, ప్రముఖ నటి, రాజకీయ నాయకురాలు హేమమాలినిని అభిమానులు 'డ్రీమ్ గాళ్'గా ఆరాధిస్తుంటారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు కనీసం 4 దశాబ్దలకు పై ఆమెకాబిరుదు సార్థకత సాధించి పెట్టింది. ఈ బిరుదు వెనుక ఉన్న ఆసక్తికర మైన కథను ఆమె 'ది కపిల్ శర్మ షో'లో పంచుకున్నారు. 'డ్రీమ్ గాళ్' సినిమాలో నటించకముందే ఆమెకా పేరు వచ్చేసింది. అదీ కాకతాళీయంగా తనకే తెలియ కుండా తెరంగ్రేటం నాడే డ్రీమ్ గరల్‌గా పరిచయం చేయబడింది. హేమమాలిని హిందీలో అడుగుపెట్టిన తొలి చిత్రం 'సప్నో కా సౌదాగర్' (1968). ఈ సినిమా నిర్మాత బి. అనంతస్వామి ఓ అద్భుతమైన ప్రచార వ్యూహంలో భాగంగా సినిమా విడుదల కాక ముందు, హీరోయిన్ ఎవరో చెప్పకుండా "డ్రీమ్ గాళ్ వస్తోంది' అంటూ ముంబై అంతటా పోస్టర్లు వేయించారు. ఇది అప్పట్లో పెద్ద సంచలనం .. ఉత్కంఠ రేపాకనే ప్రేక్షకుల ముందుకు వస్తున్న 'డ్రీమ్ గాళ్' హేమామాలిని అని ప్రేక్షకుల చెవికి వినబడడంతో నాడు కేరింతలు కొట్టారు. ఆనాటి నుంచి ఈ నాటి వరకు 'డ్రీమ్ గాళ్' పేరు వినిపిస్తే చాలు అక్కడ హైమామాలిని ఉన్నట్లే యువత స్మృతి పథంలో ఆమె నాలట్యం చేస్తునేట్లే ఉంటుంది. హైమామాలిని అంటూ యువత ఎగిరి గంతేసే వారు. ఇప్పడికి అంతే. ఈ విషయంపై హేమమాలిని మాట్లాడుతూ.. 'నా తొలి సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. కానీ, పోస్టర్ల మీద ఎక్కడా తన పేరు కాకుండా 'డ్రీమ్ గాళ్, డ్రీమ్‌గాళ్' అనే కనిపిస్తోంది. ప్రేక్షుకుల నుంచి ఒకటే స్పందన ఎవరేం చేస్తున్నారో అర్థం కాక నేను కాస్త ఆందోళన చెందాను. అప్పుడు నిర్మాత అనంతస్వామి నాతో, నీ పేరును మేం ఇలాగే పరిచయం చేయబోతున్నాం. ఆ డ్రీమ్ గాళ్ ఎవరో కాదు, నువ్వే! నన్నారు తామే ప్రకటిస్తాం అంత వరకూ సస్పెన్సే! అలా అనంతస్వామి ఆలోచన అద్భుతంగా ఫలించింది. ఆ పేరు నాకు శాశ్వతంగా నిలిచిపోయింది అని వివరించారు. మహేశ్ కౌల్ దర్శకత్వం వహించిన 'సప్నో కా సౌదాగర్' చిత్రంలో రాజ్ కపూర్, హేమ మాలిని, తనూజ, నదీరా ప్రధాన పాత్రలు పోషించారు. 'డ్రీమ్‌గాళ్'గా సినీప్రేక్షకుల హృదయాల్లో బందీ అయిన దాదాపు దశాబ్దం తర్వాత, 1977లో హేమమాలి నటించిన 'డ్రీమ్ గాళ్' పేరుతో వచ్చిన మరో సినిమాలో ప్రధాన పాత్రలో నటించారు. ప్రమోద్ చక్రవర్తి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అశోక్ కుమార్, ధర్మేంద్ర, ప్రేమ్ చోప్రా వంటి అగ్ర తారలు ఉన్నారు. ఈ సినిమాలో హేమమాలిని అనాథ పిల్లల ఆశ్రమాన్ని నడపడం కోసం డబ్బు సంపాదించ డానికి సప్న, పద్మ, చంపాబాయి, డ్రీమ్ గాళ్, రాజ్ కుమారి అనే ఐదు విభిన్న పాత్రలలో కనిపిస్తారు. లక్ష్మీకాంత్‌ప్యారేలాల్ స్వరపరిచిన ఈ చిత్రంలోని "డ్రీమ్ గాళ్" టైటిల్ సాంగ్ ఎవర్ గ్రీన్ హిట్ నేపథ్య గాయకులు కిశోర్ కుమార్ ఆలపించారు. □

# నోరూరే నేరేడు !



నల్లగా నిగనిగలాడే నేరేడు పండును చూస్తేనే నోరూరిపోతుంది. కండ తక్కువ, గింజ పెద్దది కనుక ఎన్ని తిన్నా తిన్నట్టే ఉండదు. ఇవి రుచిలోనే కాదు, ఆరోగ్యం అందించడంలోనూ ముందుంటాయి. వీటితో ఎన్ని లాభాలున్నాయంటే. నేరేడుపండ్లు తినటం వల్ల శరీరానికి అవసంమైన క్యాల్షియం, ఐరన్, మెగ్నీషియం, భాస్వరం, పొటాషియం, సోడియం, సల్ఫర్, థియామిన్, రిబోఫ్లేవిన్, ఫోలిక్ యాసిడ్, ఎ,బి1, బి2, బి3, బి5, బి6, సి-విటమిన్లు అందుతాయి. రక్తపోటును తగ్గిస్తాయి, కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రిస్తాయి. గుండెకు మేలు చేస్తాయి. బరువు తగ్గటంలో తోడ్పడతాయి. కీళ్లనొప్పులను నివారిస్తాయి. కంటిచూపును మెరుగుపరుస్తాయి. గొంతులో వచ్చే సమస్యలను నివారిస్తాయి. జుట్టు రాలదు. కుదుళ్లు దృఢంగా ఉంటాయి. శరీరంలో చేరిన మలినాలను హరింప చేస్తాయి. కాలేయాన్ని సంరక్షిస్తాయి.మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. చర్మం కాంతితో మెరిసేలా చేస్తాయి. మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. జీర్ణ ప్రక్రియ సాఫీగా ఉంటుంది. రక్త హీనతతో బాధపడుతున్న వారు వీటిని తీసుకోవటం వల్ల సత్వర ప్రయోజనం ఉంటుంది. రక్తహీనతతో బాధపడుతున్న వారు వీటిని తీసుకోవటం వల్ల సత్వరప్రయోజనం ఉంటుంది. □

# తెర

## VenkyAnil5 ( NkrAR2)- షూటింగ్‌లో వెంకటేష్




విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అనిల్ రావిపూడి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న VenkyAnil5 ( NkrAR2)- చిత్రం కోసం జతకట్టారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. కల్యాణ్ రామ్ పుట్టినరోజున విడుదలైన ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. కల్యాణ్ రామ్, ఇతర నటీనటులపై చిత్రీకరించిన ఒక పాట షూటింగ్‌ను చిత్ర బృందం ఇటీవల పూర్తి చేసింది. ఈ సినిమా మొదటి షెడ్యూల్‌లో కీర్తి సురేష్, కృతి శెట్టి కూడా పాల్గొంటున్నారు. తాజాగా విక్టరీ వెంకటేష్ షూటింగ్ సెట్‌లో చేరారు. ప్రస్తుతం ప్రధాన తారాగణంతో కూడిన కీలక సన్నివేశాలను భారీ సెట్‌లో చిత్రీకరి స్తున్నారు. వెంకటేష్, కీర్తి సురేష్, కృతి శెట్టిలతో కలిసి కల్యాణ్ రామ్ కూడా ఈ సన్నివేశాల్లో పాల్గొంటున్నారు. వెంకటేష్, కల్యాణ్‌రామ్ మధ్య వచ్చే సన్నివేశాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. వీరిద్దరి ఆకట్టుకునే ఆన్‌స్క్రీన్ అనుబంధం, అనిల్ రావిపూడి మార్కు వినోదానికి చక్కగా సరిపోతుంది.ఈ చిత్రంలో వెంకటేష్ సరసన కీర్తి సురేష్ కథా నాయికగా నటిస్తుండగా, కల్యాణ్ రామ్ సరసన కృతిశెట్టి నటిస్తోంది. ఈ చిత్రానికి బలమైన సాంకేతిక బృందం పని చేస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్, ఎ.ఎస్. ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరి స్తున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. VenkyAnil5 ( NkrAR2)- అనిల్ రావిపూడి మార్క్ వినోదం, కుటుంబ భావోద్వేగాలు, ఫెస్టివల్ ట్రేడ్‌మార్క్ ఎంటర్టైనర్. ఈ చిత్రం 2027 సంక్రాంతికి అత్యంత ఎదురుచూస్తున్న చిత్రంగా నిలుస్తోంది.

## 'రాజా ది రాజా' : ట్రైలర్ లాంచ్



ఈవెంట్‌లో నిర్మాత రవిశంకర్ రుత్విక్, విశాఖ ధిమాన్ 'రాజా ది రాజా' అద్భుతమైన థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా నటించిన 'రాజా ది రాజా' చిత్రం థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. అనిల్ బోయిడపు దర్శకత్వంలో రూపొందిన ఈ పీరియాడిక్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్, ప్రేమ, వినోదం, యూత్‌కు సంబంధించిన భావోద్వేగాల కలయికతో ఆకట్టుకోనుంది. తొలి సినిమానే అయినప్పటికీ రుత్విక్ రెండు భిన్నమైన పాత్రల్లో ఎంతో మెచ్యూర్డ్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ.. 'రాజా ది రాజా' ఈ మధ్యకాలంలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు. ఈ సినిమా హీరో రుత్విక్‌తో పాటు నిర్మాత నిహారిక కూడా చాలా ప్యాషన్ ఉన్న నిర్మాత. ఇందులో పాటలు చూస్తుంటే అద్భుతంగా ఉన్నాయి. హీరో రుత్విక్ మాట్లాడుతూ.. 'రాజా ది రాజా' సినిమా ద్వారా నేను నటుడిగా తెలుగు ప్రేక్షకులకు పరిచయం కాబోతున్నాను. ఈ జర్నీ చాలా ఎమోషనల్. అనిల్‌తో కలిసి సినిమా చేయడం చాలా అద్భుతమైన అనుభూతి. ప్రేక్షకులను అలరించేలా ప్రతి సన్నివేశాన్ని తెరకెక్కించడానికి మేమంతా చాలా కష్టపడ్డాం. నిర్మాత నిహారిక దాసరి మాట్లాడుతూ.. రవికి, నవీన్‌కి హృదయ పూర్వక ధన్యవాదాలు. వారు ఈ సినిమా రిలీజ్ చేయడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. దర్శకుడు అనిల్ మాట్లాడుతూ.. టీజర్ వచ్చినప్పటి నుంచి సినిమాకి చాలా మంచి పేరు వస్తోంది. పాటలకు కూడా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ప్రేక్షకుల స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. మా చిత్రాన్ని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా రిలీజ్ చేస్తున్నందుకు రవికి, నవీన్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు.

## #ChiruBobby2 / #Chiru158 యాక్షన్ షెడ్యూల్



'వాల్తేరు వీరయ్య' భారీ విజయం తర్వాత మెగాస్టార్ చిరంజీవి, బ్లాక్‌బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి మళ్లీ కలిసి పనిచేస్తున్న చిత్రం #ChiruBobby2 / #Chiru158 KVN ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ ఎంటర్‌టైనర్ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో విస్తృతంగా జరుగుతోంది. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్లు రామ్‌లక్ష్మణ్ మాస్టర్స్ పర్యవేక్షణలో చిత్రీకరిస్తున్న భారీ యాక్షన్ సన్నివేశం ఈ చిత్రంలో మేజర్ హైలెట్స్‌లో ఒకటి. భారీ సంఖ్యలో ఫైటర్లతో అత్యంత భారీ స్థాయిలో రూపొందు తున్న ఈ సన్నివేశం, మెగాస్టార్ చిరంజీవిని పవర్ ఫుల్ , డైనమిక్ అవతార్‌లో ప్రజెంట్ చేయనుంది. అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందించేలా రూపొందు తున్న ఈ యాక్షన్ ఘట్టంలో, మెగాస్టార్ స్వయంగా పాల్గొంటూ చాలా సాహసోపేతమైన స్టంట్స్ చేస్తున్నారు. అభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రానికి సంబం ధించిన టైటిల్ టీజర్‌ను విడుదల చేయడానికి చిత్ర బృందం సన్నద్ధమవుతోంది. ఈ చిత్రానికి అద్భుతమైన సాంకేతిక బృందం పని చేస్తోంది. థమన్ ఎస్ సంగీతం సమకూరుస్తుండగా, ప్రఖ్యాత సినిమా టోగ్రాఫర్ విజయ్ కార్తీక్ కన్నన్ అద్భుతమైన విజువల్స్ అందిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్‌ను అవినాష్ కొల్లా నిర్వహిస్తుండగా, ఎడిటింగ్ ఆంటోనీ రూబెన్. కోన వెంకట్, కె.చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందించగా, హరి మోహన కృష్ణ, వినీత్ పోట్లూరి అడిషనల్ స్క్రీన్‌ప్లేను సమకూర్చారు. స్టార్ రచయితల ద్వయం భానునందు సంభాషణలు రాస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న చిత్రాలలో అత్యంత ఆసక్తిని రేకెత్తిస్తున్న మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది.

## 'రోమాంచకం' గ్లింప్స్ రిలీజ్



సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తున్న మూవీ భద్రకాళీ పిక్చర్స్, డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబోలో భారీ పాన్ ఇండియా బ్లాక్ బస్టర్స్ వచ్చాయి. ఈ కాంబోలో ఒక యంగ్ టీమ్ తో ఫ్రెష్ లవ్ స్టోరీ మూవీ వస్తోం దంటే ప్రేక్షకులు కొత్తదనం ఆశిస్తారు, స్ట్రాంగ్ కంటెంట్ ఎక్స్ పెక్ట్ చేస్తారు. ప్రేక్షకులు కోరుకునే అలాంటి కొత్తదనంతో యూనిక్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోంది 'రోమాంచకం' సినిమా. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని సందీప్ రెడ్డి వంగా సమర్పిస్తుండగా, ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొంది స్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన 'రోమాంచకం' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఆడియెన్స్‌ను అట్రాక్ట్ చేసి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ సినిమా సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.ఈ రోజు "రోమాంచకం" సినిమా గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్ డీవోపీ పవన్ పప్పుల అందించిన పెయింటింగ్ లాంటి బ్యూటిఫుల్ విజువల్స్ తో , వాసుకి వైభవ్ కంపోజ్ చేసిన స్వీట్ మెలొడియస్ ట్యూన్ తో సాగుతూ హీరోయిన్స్ మధ్య ఉన్న ప్రేమను, వారి మధ్య ఏర్పడిన దూరాన్ని చూపిస్తూ సాగింది. ఖిలఅణువు అణువును ఉర్రూతలూపే ప్రణయ కల్లోలమే రోమాంచకం, ఊహకే అందని ఉవ్వెత్తునెగిసే ఉత్తుంగ తరంగమే రోమాంచకం.. అంటూ గ్లింప్స్ లో వచ్చిన లిరిక్స్ ఈ మూవీ ఎంత వైబ్రేటింగ్ గా ఉండబోతుందో తెలియజేస్తోంది. "రోమాంచకం" సినిమా ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపి ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు వస్తోంది. సుమంత్ ప్రభాస్, అనంతిక జంట కెమిస్ట్రీ ఈ సినిమాకు హైలైట్‌గా నిలుస్తోంది.

## 'లవ్ ఓ లవ్' ప్రీరిలీజ్ వేడుకలో మాస్ కా దాస్ విశ్వక్ సేన్



లవ్ ఓ లవ్ ప్రీరిలీజ్ వేడుక నేడు హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. చిత్ర బృందం, సినీ ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, అభిమానుల సమక్షంలో నిర్వహించిన ఈ వేడుక ఎంతో సందడిగా సాగింది. పావిష్ నారాయ ణన్, నాగ దుర్గా జంటగా నటించిన ఈ చిత్రానికి మాగేశ్ రాజేంద్రన్ దర్శకత్వం వహించారు. రొమాన్స్, కామెడీ, భావోద్వేగాల సమ్మేళనంగా రూపొందిన ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన మాస్ కా దాస్ విశ్వక్ సేన్ చిత్ర బృందానికి తన హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ నిర్మాతలు సి. కళ్యాణ్, దామోదర్ ప్రసాద్, జి. నాగేశ్వర రెడ్డి కూడా హాజరై చిత్ర బృందానికి తమ శుభాకాం క్షలు తెలియజేశారు. లవ్ ఓ లవ్ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ, చిత్ర యూనిట్‌కు తమ పూర్తి మద్దతు ప్రకటించారు. అనంతరం ప్రీ రిలీజ్ ఈవెంట్ వేడుకలో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. ఈరోజు ఇక్కడికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా మీడియా మిత్రులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. పవిష్ ప్రత్యేకంగా ఈ కార్యక్రమానికి రావాలని నన్ను ఆహ్వానించాడు. నేను ప్రస్తుతం ఏ నగరానికి ఏమైంది 2 సినిమా షూటింగ్‌లో ఉన్నాను. ఈరోజు పవిష్ సినిమా ఈవెంట్‌కు వెళ్లాల్సి ఉందని తరుణ్ భాస్కర్‌కు చెప్పగా, ఆయన కూడా రెండు గంటల ముందే షూటింగ్ నుంచి వెళ్లమని ప్రోత్సహించారు. నిర్మాత జి. ధనంజేయన్ మాట్లాడుతూ.. విశ్వక్ సర్‌కు నేను పెద్ద అభిమానిని. మా ఆహ్వానాన్ని స్వీక రించి ఈ కార్యక్రమానికి విచ్చేసిన విశ్వక్‌కి నా హృదయ పూర్వకధన్యవాదాలు

## 'లెనిన్' వాయిస్ ఓవర్ ఇచ్చిన ఎన్టీఆర్



'లెనిన్' చిత్రానికి పవర్ ఫుల్ వాయిస్ ఓవర్ ఇచ్చిన మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్.. అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించిన చిత్రం 'లెనిన్'. ఈ సినిమాకి మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. ఈ మూవీ జూలై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన కంటెంట్ ఆడియెన్స్‌లో అంచనాల్ని పెంచేసింది. ఇక ట్రైలర్‌కి నాగార్జున ఇచ్చిన వాయిస్ ఓవర్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. తాజాగా చిత్రయూనిట్ మరో సర్ ప్రైజ్‌తో అభిమానుల్లో అంచనాల్ని మరింతగా పెంచింది. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ 'లెనిన్' కోసం వాయిస్ ఓవర్ ఇచ్చారు. సినిమా కథను, నేపథ్యాన్ని, శ్రీరామపురం గురించి ఎన్టీఆర్ తన గంభీరమైన గాత్రంతో ప్రేక్షకులకు పరిచయం చేయనున్నారు. ఇక థియేటర్లో ఎన్టీఆర్ వాయిస్ ఓవర్‌కి, ఆయన ఇచ్చే ఎలివేషన్స్‌కి బాక్సులు బద్దలయ్యేలా ఉంది. ఎన్టీఆర్ ఇచ్చే ఈ వాయిస్ ఓవర్ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని భావిస్తున్నారు. ఎన్టీఆర్‌కి నాగార్జునతో, అక్కినేని కుటుంబంతో ఎంతో అనుబంధం ఉంది. అందుకే అఖిల్ కోసం ఎన్టీఆర్ ఇలా వాయిస్ ఓవర్ ఇచ్చి 'లెనిన్'కి తన వంతుగా సపోర్ట్ చేశారు.ఇప్పటివరకు విడుదలైన పోస్టర్లు, పాటలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. అఖిల్ రగ్డ్ రా అండ్ రస్టిక్ లుక్ ఇప్పటికే అభిమానుల్ని ఆకట్టుకుంది. ఈ చిత్రానికి తమన్ సంగీతం, నేపథ్య సంగీతం, లియోన్ బ్రిట్టో కెమెరావర్క్ హైలెట్‌గా నిలుస్తుందని అంతా భావిస్తున్నారు. ఈ మూవీకి నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.ఈ చిత్రం 2026 జూలై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# రొనాల్డో కల చెదిరె.. పోర్చుగల్ కథ ముగిసె

## అమెరికా ఖేల్ ఖతమ్ * క్వార్టర్ ఫైనల్లో స్పెయిన్, బెల్జియం



పోర్చుగల్ జీరో
క్రిస్టియానో రొనాల్డో

**డల్లాస్, జులై 7:** సాకర్ ప్రపంచకప్‌లో మరో సంచలనం నమోదైంది. యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్ ఏకైక గోల్‌తో హాట్ ఫేవరెట్ పోర్చుగల్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. చివరి నిమిషాల్లో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన మికేల్ మెరినో అద్భుత గోల్‌తో పోర్చుగల్ కథ ముగిసింది. దీంతో కప్పు కల నెరవేరకుండా ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో ప్రపంచకప్ వీడాడు. తన కెరీర్‌లో చివరి ప్రపంచకప్‌కు కన్నీటితో వీడ్కోలు పలికాడు. ఆరు ప్రపంచకప్ ఎడిషన్ల పాటు సాగిన రొనాల్డో సుదీర్ఘ ప్రస్థానానికి తెరపడింది.

మ్యాచ్ ఆరంభం నుంచే పోర్చుగల్, స్పెయిన్ మధ్య మైండ్ గేమ్ ప్రారంభమైంది. 4వ నిమిషంలోనే స్పెయిన్ ఫార్వర్డ్ అమికేల్ ఓయర్జబాల్ గోల్ ప్రయత్నాన్ని పోర్చుగల్ గోల్ కీపర్ డియోగో కోస్టా అడ్డుకున్నాడు. కాసేపటికే పెడ్రో నెటో రైట్ వింగ్ నుంచి ఇచ్చిన అద్భుతమైన క్రాస్‌ను ఫెలిక్స్ అడ్డుకుని రొనాల్డో వైపు మళ్లించాడు. రొనాల్డో గాల్లోనే బంతిని హుక్ చేస్తూ గోల్ వైపు కొట్టగా స్పెయిన్ గోల్ కీపర్ అద్భుతంగా అడ్డుకున్నాడు. తొలి అర్ధభాగం ముగిసేసరికి ఇరు జట్లు 0-0తో సమంగా నిలిచాయి.

**పోర్చుగల్ బ్యాడ్‌లక్**

రెండో అర్ధభాగంలో స్పెయిన్ ఆటగాడు దాని ఓల్మో ఫౌల్ చేయడంతో పోర్చుగల్‌కు ఫ్రీకిక్ లభించింది. అయితే బ్రూనో ఫెర్నాండెజ్ కొట్టిన షాట్ నేరుగా కీపర్ సిమోన్ చేతుల్లోకి వెళ్లింది. 59వ నిమిషంలో రొనాల్డోకు మరో సువర్ణావకాశం లభించింది. జోవా ఫెలిక్స్ డిఫెండర్లను దాటుకుంటూ బంతిని బ్యాక్ పోస్ట్ వైపు చిప్ చేశాడు. రొనాల్డో అక్కడ షాట్ కొట్టడానికి ప్రయత్నించాడు, కానీ బంతి అతని కాలికి సరిగ్గా కనెక్ట్ కాకపోవడంతో వైడ్‌గా వెళ్లింది.

**ఇంజ్యూరీ టైమ్‌లో సబ్‌స్టిట్యూట్ల మ్యాజిక్**

ఇక ఇంజ్యూరీ టైమ్ ప్రారంభమైన కొన్ని సెకన్లలోనే స్పెయిన్ మేనేజర్ వ్యూహాత్మకంగా మైదానంలోకి పంపిన సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు అద్భుతం చేశారు. స్పెయిన్ ఆటగాడు ఫాబియన్ రూయిజ్ బంతిని సబ్‌స్టిట్యూట్ ఆటగాడు ఫెర్రాన్ టోరెస్ వైపు పంపాడు. టోరెస్ చాలా తెలివిగా బంతిని బాక్స్‌లో ఉన్న మరో సబ్‌స్టిట్యూట్ మికేల్ మెరినోకు పాస్ చేశాడు. మెరినో ఎలాంటి పొరపాటు చేయకుండా, బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపాడు. ఈ గోల్‌తో స్పెయిన్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లడమే కాకుండా పోర్చుగల్ ఆశలపై నీళ్లు చల్లింది..

**ముగిసిన ఆతిథ్యదేశాల ఆట**


ఫిఫా ప్రపంచకప్‌కు ఆతిథ్యమిస్తున్న దేశాల ఆట ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన కెనడా, మెక్సికో ఇప్పటికే ఓటములతో నిష్క్రమించగా, తాజాగా అమెరికా కూడా అదే దారి పట్టింది. సహ ఆతిథ్య దేశం అమెరికాపై బెల్జియం 4-1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది.

**ఆరంభం నుంచే బెల్జియం ఆధిక్యం**

మ్యాచ్ ప్రారంభం నుంచే బెల్జియం ఆధిపత్యం చెలాయించింది. 9వ నిమిషంలో చార్లెస్ డి కెటెలారే గోల్ చేసి బెల్జియంకు తొలి ఆధిక్యం అందించాడు. 31వ నిమిషంలో మాలిక్ టిల్‌మన్ ఫ్రీ కిక్ ద్వారా అద్భుత గోల్ చేసి అమెరికాను 1-1తో సమవుజ్జీగా నిలిపాడు. అయితే అమెరికా ఆనందం ఎంతో సేపు నిలవలేదు. కేవలం రెండు నిమిషాలకే బెల్జియం మరో గోల్ చేసి మళ్లీ ఆధిక్యంలోకి వెళ్లింది.

**కొనసాగిన అమెరికా తప్పిదాలు**

రెండో అర్ధభాగంలో కూడా అమెరికా తప్పిదాలు కొనసాగాయి. 57వ నిమిషంలో గోల్‌కీపర్ మ్యాట్ ఫ్రీస్ పెనాల్టీ ప్రాంతం బయటకు వచ్చి లాంగ్ బాల్‌ను అందుకునే ప్రయత్నంలో బంతిని కోల్పోవడంతో హాన్స్ వానాకెన్ ఖాళీ గోల్‌లోకి సులభంగా బంతిని పంపించాడు. అదనపు సమయంలో లుకాకు మరో గోల్ చేయడంతో బెల్జియం 4-1తో మ్యాచ్‌ను ముగించింది. ప్రపంచకప్‌లో ముందంజ వేసింది. క్వార్టర్‌ఫైనల్లో స్పెయిన్‌తో తలపడనుంది.


స్పెయిన్ హీరో
మికెల్ మెరినో

# వింబుల్డన్ సెమీస్‌లో సినర్, కోకో గాఫ్

**లండన్, జులై 7:** వింబుల్డన్ పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్‌వన్ జానిక్ సినర్, మహిళల సింగిల్స్‌లో కోకో గాఫ్ సెమీఫైనల్స్ ప్రవేశించారు. జపాన్ డాల్ నయోమి ఒసాకా క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. క్వార్టర్ ఫైనల్లో సినర్...జాన్‌లెన్నార్డ్ స్ట్రఫ్ యొక్క అద్భుతమైన ప్రయాణానికి ముగింపు పలికాడు. మూడు సెట్ల పోరులో 7-5, 7-6, 6-3తో గెలుపొందాడు. నాలుగుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ సినర్ శక్తివంతమైన సర్వ్‌లతో విరుచుకుపడి స్ట్రఫ్‌ను కట్టడి చేశాడు. దీంతో అతను తన 10వ గ్రాండ్ స్లామ్ సెమీఫైనల్‌కు, వింబుల్డన్‌లో మూడో సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. మహిళల సింగిల్స్‌లో కోకో గాఫ్ 4-6, 6-3, 6-3తో తోటి అమెరికన్ జెస్సికా పెగులాపై గెలిచి మొదటిసారి వింబుల్డన్ సెమీఫైనల్‌కు చేరుకుంది. సెంటర్ కోర్టులో జరిగిన ఈ ఆల్‌అమెరికన్ పోరులో తొలి సెట్ ఓడినా ఆ తర్వాత పుంజుకుని వరుసగా రెండు సెట్లను కైవసం చేసుకుంది.

**క్వార్టర్ ఫైనల్లో అలెగ్జాండర్ జ్వెరెవ్**

రెండు రోజుల పాటు సాగిన పురుషుల నాలుగో రౌండ్‌లో రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ 6-4. 7-5, 3-6, 7-6తో 14వ సీడ్ జిరి లెహెకాపై నెగ్గి తొలిసారిగా వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. జ్వెరెవ్ 6-4, 7-5, 3-3తో ఆధిక్యంలో ఉన్నపుడు చీకటి కారణంగా ఆటను నిలిపివేశారు. మంగళవారం తిరిగి ప్రారంభమైనప్పుడు లెహెకా పుంజుకున్నప్పటికీ, జ్వెరెవ్ దూకుడు చూపి నెగ్గాడు.







# మెస్సీ మ్యాజిక్: క్వార్టర్స్‌లో అర్జెంటీనా

**న్యూయార్క్, జులై 7:** డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా వరుసగా రెండో కప్ అందుకునే దిశగా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈజిప్ట్‌తో జరిగిన ప్రి క్వార్టర్ ఫైనల్లో మెస్సీ మ్యాజిక్ చేశాడు. ఓటమి ఖాయమనుకున్న దశ నుంచి అర్జెంటీనాను గెలుపు తీరాలపై నిలిపాడు. 3-2 గోల్స్ తేడాతో విజయాన్ని అందించాడు. మ్యాచ్ ఆరంభంలోనే ఈజిప్ట్ ఆధిక్యం చాటి ఝలక్ ఇచ్చింది. 15వ నిమిషంలో యాసర్ ఇబ్రహీం హెడర్‌తో గోల్ సాధించాడు. దీంతో తొలి అర్ధభాగం ముగిసే సరికి ఈజిప్ట్ 1-0 ఆధిక్యంతో నిలిచింది. రెండో అర్ధభాగంలో మరో గోల్ చేసింది. 67వ నిమిషంలో ముస్తాఫా జికో గోల్ చేసి ఈజిప్ట్ ఆధిక్యాన్ని 2-0కు చేర్చాడు. ఇక మ్యాచ్ చివరి దశకు చేరుకుంటున్న దశలో మెస్సీ మ్యాజిక్ చేశాడు. నాలుగు నిమిషాల్లో రెండు గోల్స్ సాధించడంలో కీ రోల్ పోషించాడు. 79వ నిమిషంలో మెస్సీ అందించిన పాస్‌ను రొమెరో గోల్‌గా మలచగా, 83వ నిమిషంలో స్వయంగా మెస్సీ గోల్ సాధించాడు. ఈ ప్రపంచకప్‌లో మెస్సీకి ఇది ఎనిమిదో గోల్. కాగా ఇంజ్యూరీ టైమ్ ఆరంభంలో ఎంజో ఫెర్నాండెజ్ చేసి గోల్‌తో అర్జెంటీనా విజయం ఖాయమైంది. తొలిసారి క్వార్టర్ ఫైనల్ చేరాలన్న ఈజిప్ట్ ఆశలపై నీళ్లు చల్లింది.

# కోహ్లీతో క్రికెట్ ఆడాలనుంది: జొకోవిచ్

**లండన్, జులై 7:** మిస్టర్ ఛేజర్ విరాట్ కోహ్లీపై సెర్బియా టెన్నిస్ దిగ్గజం నోవాక్ జొకోవిచ్ అభిమానాన్ని చాటుకున్నాడు. ప్రస్తుతం వింబుల్డన్ ఆడుతున్న జొకోవిచ్... గొప్ప బ్యాటింగ్ యోధుడు విరాట్ కోహ్లీతో కలిసి క్రికెట్, టెన్నిస్ ఆడాలని ఉందని జియో స్టార్‌తో మాట్లాడుతూ చెప్పాడు. త్వరలో భారత్‌ను సందర్శించేందుకు ప్లాన్ చేస్తున్నానని, ఇప్పటికే కోహ్లీతో మాట్లాడినట్లు చెప్పుకొచ్చాడు. విరాట్ ఓ గ్లోబల్ స్టార్, అతను భారత్‌లో అద్భుతమైన ఆటగాడు. కోహ్లీ తనకు ఆతిథ్యమిచ్చి, దేశమంతా తిప్పి చూపిస్తే బాగుంటుంది. అతనిపైనా, భారత్ క్రికెట్‌పైనా తనకు చాలా గౌరవం ఉందని జొకోవిచ్ పేర్కొన్నాడు. సెర్బియాలో క్రికెట్‌కు అంత ప్రాధాన్యం లేదని, అయితే ఇంగ్లాండ్ టెన్నిస్ ప్లేయర్ల నుంచి క్రికెట్ గురించి తెలుసుకున్నట్లు చెప్పాడు. గత వింబుల్డన్‌లో తన భార్య బాలీవుడ్ నటి అనుష్కశర్మతో కలిసి కోహ్లీ... జొకోవిచ్ మ్యాచ్‌ను వీక్షించాడు. ఎంత అద్భుతమైన మ్యాచ్. గ్లాడియేటర్ జొకోవిచ్‌కు ఇది మామూలు విషయమేనని కోహ్లీ పోస్ట్ చేశాడు.





# పసిడి తాకట్టు రుణాలు 3.29లక్షల కోట్లు

**న్యూఢిల్లీ,జులై 7:** ప్రైవేటు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థల్లో బంగారు ఆభరణాల తాకట్టుపై మంజూరు చేసిన రుణాలు ఈ ఏడాది మే నెలలో దాదాపు 70శాతం పెరిగి అన్ని రుణ విభాగాల్లోనే అత్యంత భారీ వృద్ధిని నమోదు చేసినట్లు రిజర్వు బ్యాంకు మంగళవారం విడుదల చేసిన నివేదికలో ప్రస్తావించింది.

2026మే నెలాఖరు నాటికి బంగారు ఆభరణాల తాకట్టుపై ఎన్‌బీఎఫ్‌సీలు ఇచ్చిన రుణాలు రూ.3.29 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే సమయంలో ఇవి రూ.1.94 లక్షల కోట్లుగా ఉండగా, ఏడాది వ్యవధిలో 69.9 శాతం వృద్ధి నమోదైంది. రిటైల్ రుణాల విభాగంలో గృహ రుణాలు, వాహన రుణాలు, బంగారం తాకట్టు రుణాలు గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయి. దీంతో మొత్తం రిటైల్ రుణాల వృద్ధి 2026 మేలో వార్షిక ప్రాతిపదికన 19.5 శాతానికి చేరుకుంది. గత ఏడాది ఇదే నెలలో ఈవృద్ధి 14.9 శాతంగా నమోదైంది. బంగారం రుణాల తర్వాత వాణిజ్య రంగానికి ఎన్‌బీఎఫ్‌సీలు అందించిన రుణాల బకాయిలు రెండో స్థానంలో నిలిచాయి. గత ఏడాది మేలో రూ.85,317 కోట్లుగా ఉండగా, 2026 మే నాటికి రూ.1.19 లక్షల కోట్లకు పెరిగి 40.2శాతం వార్షిక వృద్ధిని నమోదు చేశాయి. వ్యవసాయం, అనుబంధ రంగాలకు అందించిన రుణాల వృద్ధి కూడా బలంగానే కొనసాగింది. ఈ విభాగంలో రుణాలు 2026 మేలో వార్షిక ప్రాతిపదికన 17.9 శాతం పెరిగాయి. గత ఏడాది ఇదే నెలలో నమోదైన 5 శాతం వృద్ధితో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల. పారిశ్రామిక రంగానికి రుణాల వృద్ధి కొంత మందగించింది. 2025 మేలో 10 శాతంగా ఉన్న పారిశ్రామిక రుణాల వృద్ధి 2026 మేలో 7.3 శాతానికి తగ్గింది. ముఖ్యంగా మౌలిక వనరుల రంగానికి రుణాల వృద్ధి మందగించడం ఇందుకు ప్రధాన కారణమని ఆర్‌బీఐ తెలిపింది.




2025 మేలో 23.9 శాతంగా నమోదైన సేవల రంగ రుణాల వృద్ధి, 2026 మేలో 16.7 శాతానికి పరిమితమైంది.

# లాభాల స్వీకరణతో వరుస నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్

**ముంబయి,జులై 7:** దేశీయ ఈక్విటీ మార్కెట్లలో వరుసగా 4 రోజులుగా కొనసాగిన ర్యాలీకి మంగళవారం బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు రావడంతో పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. విస్తృత స్థాయిలో అమ్మకాల ఒత్తిడి నెలకొని నిఫ్టీ 24,400 స్థాయి దిగువన ముగిసింది. మెటల్, రియాల్టీ రంగ షేర్లు భారీగా నష్టపోగా, ఐటీ, ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాలకు చెందిన షేర్లు లాభాల్లో నిలిచాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 104.35 పాయింట్లు తగ్గి 78,180.72 వద్ద ముగిసింది. నిఫ్టీ50 సూచీ 31.65 పాయింటు క్షీణించి 24,398.70వద్ద స్థిరపడింది. నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2.34 శాతం, నిఫ్టీ 2.35 శాతం చొప్పున లాభపడిన విషయం గమనార్హం. నిఫ్టీపై అత్యధిక ఒత్తిడి తీసుకొచ్చిన షేర్లలో ట్రెంట్ 12.64శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్1.23శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.04 శాతం చొప్పున క్షీణించాయి.

విస్తృత మార్కెట్ కూడా ప్రధాన సూచీల కంటే బలహీనంగా ప్రదర్శించింది. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.18 శాతం తగ్గగా, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.76శాతం పడిపోయింది. ఎన్ఎస్ఈలో మార్కెట్ వెడల్పు ప్రతికూలంగా నమోదైంది. మొత్తం 1,191 షేర్లు లాభపడగా, 2,084 షేర్లు నష్టపోయాయి. మరో 109 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. సమీప కాలంలో మార్కెట్ అస్థిరతను సూచించే ఇండియా వీఐఎక్స్ సూచీ 1.43 శాతం తగ్గి 11.65 వద్దకు చేరింది. విదేశీ మారక మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. రూపాయి విలువ94.95 వద్ద ట్రేడవగా, గత ముగింపు 95.43గా నమోదైంది.




ఆగస్టు 5, 2026 డెలివరీకి సంబంధించిన ఎంసీఎక్స్ బంగారం ఫ్యూచర్స్ ధర 1.02 శాతం తగ్గి రూ.1,45,414కు చేరింది. కమోడిటీ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 81 సెంట్లు (1.13 శాతం) పెరిగి 72.80 డాలర్లకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లుఅమెరికా ఫెడరల్ రిజర్వ్ తాజా ద్రవ్య విధాన సమావేశ మినిట్స్‌తో పాటు కీలక ఆర్థిక గణాంకాల విడుదలకు ముందు జాగ్రత్త ధోరణి కొనసాగడంతో యూరప్ మార్కెట్లు స్వల్ప లాభాలతో ముగిశాయి. ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశ మినిట్స్ కోసం వేచి చూసిన ఆసియా మార్కెట్లు మాత్రం నష్టాల్లో ముగిశాయి. ప్రధాన కార్పొరేట్ పరిణామాలుతొలి త్రైమాసిక ఆదాయ వృద్ధి మార్కెట్ అంచనాలకు తగ్గడంతో ట్రెంట్ షేరు 12.64 శాతం క్షీణించింది. టైటాన్ కంపెనీ తొలి త్రైమాసికంలో వినియోగదారుల వ్యాపారం 41 శాతం వృద్ధి నమోదు చేయడంతో షేరు 2.38 శాతం పెరిగింది. దేశీయ యాజమాన్యం 50 శాతాన్ని దాటినట్లు ప్రకటించడంతో స్విగ్గీ షేరు 7.17 శాతం ఎగిసింది.

తొలి త్రైమాసిక బిల్లింగ్స్ రూ.737 కోట్లకు చేరి 14.4 శాతం వృద్ధి నమోదు చేయడంతో ఇన్ఫో ఎడ్జ్ ఇండియా షేరు 12.95 శాతం లాభపడింది. ప్రీమియం హౌసింగ్ ప్రాజెక్టులకు బలమైన డిమాండ్ కారణంగా టీఏఆర్‌సీ షేరు 1.74 శాతం పెరిగింది. జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్ షేరు 3.98 శాతం లాభపడింది. వరుణ్ బేవరేజెస్ షేరు 2.19 శాతం తగ్గింది. టెక్స్‌మాకో రైల్ అండ్ ఇంజినీరింగ్ షేరు 2.02 శాతం క్షీణించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి రూ.166.82 కోట్ల బొగ్గు గ్యాస్ ఉత్పత్తి సేవల ఆర్డర్ పొందడంతో సౌత్ వెస్ట్ పిన్నాకిల్ ఎక్స్‌ప్లోరేషన్ షేరు 2.45 శాతం పెరిగింది. తొలి త్రైమాసికంలో ఆదాయం 41 శాతం పెరిగినప్పటికీ పి ఎన్ గాడ్గిల్ జ్యువెలర్స్ షేరు 2.20 శాతం తగ్గింది. రిటైల్ ఆదాయం 56 శాతం పెరిగి మొత్తం ఆదాయంలో 78 శాతం వాటాను అందుకుంది. ఫ్రాక్టల్ అనలిటిక్స్ షేరు 2.97 శాతం క్షీణించింది. వివిధ విభాగాల్లో కలిపి రూ.239.61 కోట్ల విలువైన కొత్త ఆర్డర్లు పొందినట్లు కేపీ గ్రీన్ ఇంజినీరింగ్ ప్రకటించింది. సోలార్ ప్రాజెక్టులు, క్రాష్ బ్యారియర్లు, ఆర్ఎస్‌జే పోల్స్, ప్రీఇంజినీర్డ్ భవనాలు, ట్రాన్స్‌మిషన్ టవర్ల ప్రాజెక్టులు పొందినా షేరు 2.12 శాతం తగ్గింది.

# ఐదేళ్లలో 1 లక్ష కోట్ల ఆదాయం

## 10వేల కోట్ల లాభం టార్గెట్: టాటా పవర్





**ముంబయి,జులై 7:** విద్యుత్ రంగంలోని ప్రముఖ సంస్థ టాటా పవర్ వచ్చే ఐదేళ్లలో లక్ష కోట్ల ఆదాయం, రూ.10వేల కోట్ల నికర లాభాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంగళవారం ప్రకటించింది. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, పునరుత్పాదక ఇంధనాలు, తయారీ విభాగాల్లో విస్తరణ ద్వారా ఈ లక్ష్యాలను చేరుకోవాలని సంస్థ భావిస్తోంది. కంపెనీ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో ప్రశ్నోత్తరాల సందర్భంగా టాటా పవర్ చైర్మన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ, ఐదేళ్లలో రూ.10,000 కోట్ల లాభం, రూ.1 లక్ష కోట్ల ఆదాయాన్ని సాధించాలన్నది సంస్థ లక్ష్యమని, నివాస, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులు పరిశుభ్రమైన, హరిత ఇంధన పరిష్కారాలకు మారేలా ఎనర్జీ యాజ్ ఎ సర్వీస్ విధానాన్ని టాటా పవర్ ముందుండి అమలు చేస్తుందని తెలిపారు. సౌర పరికరాల తయారీ సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా ఒడిశాలో కొత్తగా 10 గిగావాట్ల సామర్థ్యంతో సౌర తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నట్లు కూడా చంద్రశేఖరన్ వెల్లడించారు.

ప్రస్తుతం తమిళనాడులోని తిరునెల్వేలిలో టాటా పవర్‌కు 4.3 గిగావాట్ల సౌర సెల్స్, మాడ్యూల్ తయారీ సామర్థ్యం ఉంది. బెంగళూరు యూనిట్‌తో కలిపి సంస్థ మొత్తం తయారీ సామర్థ్యం 4.9 గిగావాట్లకు చేరుకుంది. సౌర తయారీతో పాటు ఇంగాట్లు, వేఫర్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా ఒడిశాలోని కొత్త 10 గిగావాట్ల ప్రాజెక్టు ద్వారా పెంచాలని కంపెనీ ప్రణాళిక రూపొందించింది. విద్యుత్ పంపిణీ రంగంలో ప్రైవేటీకరణ చేపట్టే రాష్ట్రాల్లో అవకాశాలు లభిస్తే తమ పంపిణీ కార్యకలాపాలను కూడా విస్తరించేందుకు టాటా పవర్ సిద్ధంగా ఉందని చంద్రశేఖరన్ తెలిపారు. ఇప్పటివరకు కంపెనీ 2.5 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ప్రారంభించినట్లు వెల్లడించారు.

# గ్లోబల్ మార్కెట్లలో స్థిరంగా ముడిచమురు ధరలు

**న్యూఢిల్లీ,జులై 7:** అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు మంగళవారం స్థిరంగా కొనసాగాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 72 డాలర్లకు పైగా నిలిస్తే అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 69డాలర్ల సమీపంలో ట్రేడైంది. యుద్ధ ప్రభావం పూర్తిగా తగ్గిన చమురుధరలు అమెరికా, ఇరాన్ మధ్య తాత్కాలిక శాంతి ఒప్పందం కుదరడంతో మధ్యప్రాచ్య చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్న భయాలు తగ్గాయి. దీంతో రెండో త్రైమాసికంలో అంతర్జాతీయ ముడి చమురు ధరలు సుమారు 30 శాతం మేర పడిపోయాయి. యుద్ధ భయాల కారణంగా చమురు ధరల్లో ఏర్పడిన అదనపు పెరుగుదల దాదాపు పూర్తిగా కరిగిపోయిందని మార్కెట్ నిపుణుల అంచనా. రాబోయే నెలల్లో ప్రపంచ మార్కెట్లో ముడి చమురు అధిక సరఫరా పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని గోల్డ్‌మన్ సాక్స్, మోర్గాన్ స్టాన్లీ వంటి ప్రముఖ అంతర్జాతీయ పెట్టుబడి బ్యాంకులు హెచ్చరిస్తున్నాయి. ఈ ఆందోళనలకు మరింత బలం చేకూరుస్తూ సౌదీ అరాంకో ఆసియా కొనుగోలుదారుల కోసం ప్రధాన అరబ్‌లైట్ క్రూడ్ ధరను వచ్చే నెలకు బ్యారెల్‌కు 11 డాలర్లు తగ్గించింది. ప్రాంతీయ బెంచ్‌మార్క్‌తో పోలిస్తే బ్యారెల్‌కు 1.5డాలర్ల డిస్కౌంట్‌పై విక్రయించనున్నట్లు ప్రకటించింది. గతంలో 2020, 2015లో జరిగిన అంతర్జాతీయ చమురు ధరల యుద్ధాల సమయంలో మాత్రమే ఈ గ్రేడ్‌ను డిస్కౌంట్‌పై విక్రయించారు. సౌదీ అరేబియాతో పాటు ఒపెక్ ప్లస్ సభ్యదేశాలు వచ్చే నెలనుంచి ఉత్పత్తి కోటాలను పెంచాలని నిర్ణయించాయి. అదనపు ఉత్పత్తి వెంటనే మార్కెట్‌లోకి రాకపోయినా, పరిస్థితులు సాధారణ స్థితికి చేరుతున్న నేపథ్యంలో సరఫరాను పెంచే దిశగా అడుగులు వేస్తున్నట్లు ఈ నిర్ణయం సూచిస్తోంది. ఇదిలా ఉంటే అమెరికా ఇంధన మార్కెట్ సమాచార సంస్థ డేటా ప్రకారం 2027 నాటికి అమెరికా ముడి చమురు ఉత్పత్తి అంచనాను రోజుకు అదనంగా 2.20 లక్షల బ్యారెళ్ల మేర పెంచి 1.383 కోట్ల బ్యారెళ్లకు సవరించింది.






# ఆరు నెలల్లోనే ఐటి కంపెనీల్లో 1.19 లక్షల మందికి లేఆఫ్

**న్యూఢిల్లీ, జులై 7:** ప్రపంచవ్యాప్తంగా టెక్ రంగంలో ఉద్యోగాల కోతలుఏమాత్రం తగ్గడం లేదు. తమ వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా టెక్ కంపెనీలు ఉద్యోగులను తొలగించడాన్ని తీవ్రం చేశాయి. తాజా గణాంకాల ప్రకారం 2026 సంవత్సరపు మొదటి ఆరు నెలల కాలంలోనే వివిధ టెక్ కంపెనీలలో దాదాపు 1.19లక్షలమందికి పైగా ఉద్యోగాలు కోల్పోయారు. ఈ లేఆఫ్స్ పర్వం ఐటీ పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా సాగుతున్న ఉద్యోగాల తొలగింపు ప్రక్రియతో పోలిస్తే, 2026 మొదటి అర్ధ భాగంలో ఈ సంఖ్య మరింత పెరిగినట్లు మార్కెట్ డేటా స్పష్టం చేస్తోంది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే లేఆఫ్స్ తీవ్రత ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. పెద్ద పెద్ద టెక్ దిగ్గజాల నుండి చిన్న స్థాయి స్టార్టప్‌ల వరకు అనేక కంపెనీలు తమ వ్యాపార పునర్వ్యవస్థీకరణ, వ్యయాలను తగ్గించుకోవడం, మారుతున్న మార్కెట్ డిమాండ్లకు అనుగుణంగా మారే ప్రక్రియలో భాగంగా ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నాయి.

# కల్ట్.ఫిట్ ఐపీఓకు సెబీకి దరఖాస్తు

## నాలుగు వేల కోట్ల సమీకరణ లక్ష్యం




**ముంబయి,జులై 7:** ఫిట్‌నెస్ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రముఖ ఫిట్‌నెస్, వెల్‌నెస్ సంస్థ కల్ట్ ఫిట్ ఐపిఓకోసం సెబీకి డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసింది. ఐపీఓ ద్వారా కంపెనీ ఈక్విటీ షేర్ల జారీచేసి సుమారు రూ.950 కోట్ల వరకు నిధులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆఫర్ ఫర్ సేల్‌తో కలిపి మొత్తం ఐపీఓ పరిమాణం రూ.4,000 కోట్ల వరకు ఉండే అవకాశం ఉందని మార్కెట్ నిపుణుల అంచనా. ఐపీఓలో ప్రస్తుత పెట్టుబడిదారులైన టీమ్‌సెక్, ఫిట్‌నెస్ ఫస్ట్ లక్సెంబర్గ్, చిరాటే వెంచర్స్, టాటా డిజిటల్, యాక్సెల్ ఇండియా, కలారి క్యాపిటల్, ష్రోడర్స్ క్యాపిటల్ తదితర సంస్థలు కలిపి 17.86 కోట్ల షేర్ల వరకు విక్రయించనున్నాయి.

ఒక్కో ఈక్విటీ షేరు ముఖ విలువ రూ.1గా నిర్ణయించారు కంపెనీ సహ వ్యవస్థాపకుడు ముకేష్ బన్సాల్, ఏంజెల్ ఇన్వెస్టర్ బ్రూనో రాష్లే, ప్రముఖ సినీ నటుడు హృతిక్ రోషన్‌లు తమ వాటాలోని కొంత భాగాన్ని ఈ ఐపీఓలో విక్రయించనున్నారు. షేర్లు విక్రయించే ఇతర వాటాదారుల్లో ఏషియన్ పెయింట్స్ ప్రమోటర్ డోలీ ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్, సన్ ఎన్ సాండ్ హోటల్స్, ఎండియా పార్ట్‌నర్స్ వ్యవస్థాపకుడు సతీష్ ఆంధ్రా, మాజీ మింత్రా సీఈఓ అనంత్ నారాయణన్ కుటుంబ ట్రస్ట్, హృతిక్ రోషన్ పెట్టుబడి సంస్థ ఎక్స్‌ట్రీమ్ బ్రాండ్స్ ఉన్నాయి. కల్ట్.ఫిట్‌లో మాక్‌రిచీ ఇన్వెస్ట్‌మెంట్స్ అత్యధికంగా 20.3 శాతం వాటాను కలిగి ఉంది. తర్వాత యాక్సెల్‌కు 13.5 శాతం, సహ వ్యవస్థాపకుడు ముకేష్ బన్సాల్‌కు 8.4శాతం, కలారి క్యాపిటల్‌కు 7.8, ఎటర్నల్ వద్ద 4.9, టాటా డిజిటల్ వద్ద 3.6 శాతం వాటాలున్నాయి. ఐపీఓ ద్వారా సమీకరించే నిధులను కంపెనీ రుణాల చెల్లింపు, కల్ట్ ఎలైట్, కల్ట్ నియో ఫిట్‌నెస్ సెంటర్ల విస్తరణ, కొత్త కల్ట్‌స్పోర్ట్ రిటైల్ స్టోర్ల ఏర్పాటు, లీజ్ చెల్లింపులు, మార్కెటింగ్ కార్యక్రమాల కోసం వినియోగించనుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.